www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

8th ANNIVERSARY 22nd October, 2026

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 324 | ఆదివారం | 25-10-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఫ్రాన్స్ మరో మూడు యూరప్ దేశాల్లో హై అలర్ట్

పారిస్, ఇతర నగరాల్లో 70 వేలమంది పోలీస్‌ల మోహరింపు

అల్లరిమూకలతో రాజీ ప్రశ్నేలేదు : మంత్రి నూనెజ్

ర్యాలీ పాయింట్ దగ్గరకు వస్తే 135 యూరోలు జరిమానా

08



## ప్రశ్నించే గొంతుకలను



# అణచివేయలేరు

- అణగారిన వర్గాల స్వరాన్ని బలంగా వినిపించడంలో మహిళా జర్నలిస్టుల పాత్ర కీలకం : విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి
- హక్కుల కోసమే పోరాడుతున్నాం.. ఎవరి భిక్షనూ కోరడం లేదు : మంత్రి సీతక్క
- మహిళలు నిర్భయంగా నేతృత్వం వహించాలి : మల్కాజిగిరి సిపి సుమతి

**హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు**

- వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మహిళా పాత్రికేయులు హాజరు

ప్రజాపక్షం/హైదరాబాద్

''సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం. స్వతంత్ర పత్రికారంగం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం కాదు. ప్రశ్నించే తత్వమే పత్రికారంగానికి ప్రాణవాయువు. నిష్పాక్షికమైన వాస్తవాలను సమాజం ముందుంచడమే జర్నలిజం కర్తవ్యం'' అని హైకోర్టు రిటైర్ట్ న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి.రాధారాణి అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పిస్తే, అధికరణ 19(2) బాధ్యతాయుతమైన పరిమితులను నిర్దేశించిందని ఆమె గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో, సమాజంలో అణగారిన వర్గాల గొంతుకను బలంగా వినిపించడంలో మహిళా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని టూరిజం ప్లాజా హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా పాత్రికేయులు హాజరయ్యారు. జాతీయ సెమినార్ ప్రారంభోత్సవ సభలో రాష్ట్ర పంచాయతీరాజ్,

తరువాయి 8లో

## 'ప్రాణహిత–చేవెళ్ల' రీ డిజైన్

# బిఆర్‌ఎస్ ఘోర తప్పిదం

- ప్రాజెక్టు పేరుతో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఘాటు విమర్శలు
- 2027 వర్షాకాలానికి ముందే కాళేశ్వరం పునరుద్ధరిస్తామని ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డను కేంద్రంగా చేసుకుని రీడిజైన్ చేయడం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన సాగునీటి ప్రయోజనాలు అందించకుండా, రాష్ట్రంపై భారీ అప్పుల భారం మోపారని ఆరోపించారు. హైదరాబాద్ మహానగరంలో తలెత్తుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన

తరువాయి 8లో

**తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై**

## రేపు మహారాష్ట్రతో చర్చలు

కెఆర్ఎంబి సమావేశం మంగళవారానికి వాయిదా

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన చర్చలు జరపనుంది. ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బృందంతో చర్చించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ఉన్నతాధికారుల బృందం వెళ్లనుంది. ఈ నెల 23 తర్వాత తుమ్మిడిహెట్టిపై చర్చలకు

తరువాయి 8లో










## కలుషిత నీటికి 'పనస తొక్క'తో చెక్!



భారతదేశంలోని పలు ప్రాంతాల్లో భూగర్భజలాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉండటం ప్రజారోగ్యానికి సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఒడిశాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటి) రూర్కెలా పరిశోధకులు ఒక వినూత్న సాంకేతికతను అభివృద్ధి చేశారు. పనస పండు తొక్కతో తయారు చేసిన ప్రత్యేక పదార్థం ద్వారా తాగునీటిలోని అధిక ఫ్లోరైడ్‌ను తొలగించే ఈ సాంకేతికతకు పేటెంట్ పొందారు. సాధారణంగా పనస పండ్ల తొక్కలను వ్యర్థాలుగా పారవేస్తారు. అయితే పరిశోధకులు ఈ తొక్కలను ఉపయోగించి యాక్టివేటెడ్ కార్బన్ (సక్రియ కార్బన్) తయారు చేశారు. అనంతరం దానికి జిర్కోనియం అనే మూలకాన్ని జోడించి, నీటిలోని ఫ్లోరైడ్‌ను అంటిపట్టుకునే సామర్థ్యాన్ని పెంచారు. ప్రయోగశాల పరీక్షల్లో ఈ పదార్థం సుమారు 10 నుంచి 20 నిమిషాల్లోనే 90 నుంచి 97 శాతానికి పైగా ఫ్లోరైడ్‌ను తొలగించినట్లు నివేదిక వెల్లడిస్తున్నది. ఈ ఫలితాలు లీటరుకు 15 మిల్లీగ్రాముల ఫ్లోరైడ్ ఉన్న నీటిపై నిర్వహించిన పరీక్షల్లో నమోదయ్యాయి. ప్రస్తుతం నీటిలో ఫ్లోరైడ్ తొలగించడానికి రివర్స్ ఆస్మోసిస్ (ఆర్ఓ), అయాన్ ఎక్స్ఛేంజ్ వంటి పద్ధతులను ఉపయోగిస్తున్నారు. 'ఆర్ఓ' ప్రక్రియలో కొంత నీరు వృథా అవుతుంది. కాల్షియం, మెగ్నీషియం వంటి ఉపయోగకరమైన ఖనిజాలు కూడా తొలగిపోవచ్చు. కొన్ని ఇతర పద్ధతుల్లో రసాయనాల వినియోగం అవసరమవుతుంది. పనస తొక్కలతో రూపొందించిన పదార్థం వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించుకోవడంతో పాటు తక్కువ ఖర్చుతో నీటి శుద్ధికి ఉపయోగపడే అవకాశం ఉంది.

## ఇంద్రుడిపైనే ఫిర్యాదు!



వారూ.. వీరూ కాదు.. ఏకంగా ఇంద్రుడిపైనే అధికారులకు ఫిర్యా దు చేశాడు ఓ వ్యక్తి. సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతున్న ఈ ఘటన వివరాల్లోకి వెళితే, ఇటీవల కాలంలో, ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, ఈ పరిస్థితికి కారణమయ్యాడంటూ, మల్లావాన్ బ్లాక్‌లోని నెవడ్డా పరాస్ గ్రామానికి చెందిన సూరజ్ తివారీ ఏకంగా, 'వర్ష దేవుడు'గా భవించే ఇంద్రదేవుడిపై అధికారికంగా ఫిర్యాదు చేశాడు. వర్షాలు ఆపించాలంటూ రాష్ట్ర ప్రజా ఫిర్యాదుల పోర్టల్ ద్వారా జిల్లా అధికారులకు ఈ ఫిర్యాదు పంపించారు. వర్షం కొన్నిసార్లు భారీగానూ, మరికొన్నిసార్లు మోస్తరుగానూ కురుస్తున్నదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇంద్రదేవుడు నిరంతరం వర్షం కురిపిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని తివారీ చెప్పుకొచ్చాడు. రోడ్లు, వీధులు, లోతట్టు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారని, రోజువారీ పనులు స్తంభించిపోయాయని అందులో రాశాడు. పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతుల్లోనూ ఆందోళన నెలకొందని వాపోయాడు. 'ఇంద్రదేవుడి మొబైల్ నంబర్ నాకు తెలియదు. కాబట్టి జిల్లా కలెక్టర్ తన 'దైవిక సంబంధాల' ద్వారా ఇంద్రుడికి ఆదేశాలు జారీ చేసి వర్షాన్ని వెంటనే నియంత్రించాలని కోరుతున్నాను' అంటూ ఆయన చేసిన విజ్ఞప్తి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చూడడానికి ఇది సరదానే కనిపించినప్పటికీ, సెప్టెంబర్ 25–27 తేదీల మధ్య హర్దోయ్‌లో వర్షాలు, పాముకాట్లు తదితర ఘటనల్లో ఏడుగురు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. 330 ఇళ్లు దెబ్బతిన్నాయి, రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల వర్షాలకు 56 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు.

## ఫ్లెమింగోలు.. ప్రకృతి పరిరక్షణకు కొత్త ఆశలు



రాజస్థాన్‌లోని సాంబర్ సరస్సు వలస పక్షులకు కేవలం ఆహార కేంద్రంగానే కాకుండా, సంతానోత్పత్తి ఆవాసంగా కూడా మారే అవకాశా లు కనిపిస్తున్నాయి. సాధారణంగా గుజరాత్‌లోని కచ్ రణ్ ఫ్లెమింగోల ప్రధాన సంతానోత్పత్తి ప్రాంతంగా గుర్తింపు పొందింది. అయితే సాంబర్ సరస్సులో వేలాది బురద గూళ్లు కనిపించడం కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన పరిశీలనల్లో సుమారు 4,000 గూళ్లను గుర్తించారు. వాటిలో పిల్లలు పొదిగిన ఆనవాళ్లు ఉన్నాయి. ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం కారణంగా సరస్సులో నీటిమట్టం తగ్గి, సాధారణంగా నీటిలో మునిగి ఉండే ప్రాంతాలు బయటపడటంతో ఈ గూళ్లు కనిపించాయి. ఈ పరిణామం పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి రక్షణ పట్ల కొత్త ఆశలకు తావిస్తున్నది.

## తెలంగాణలో గుర్తించిన రెండు కొత్త బల్లి జాతులు



ఇటీవల తెలంగాణలో శాస్త్రవేత్తలు రెండు కొత్త 'గెక్కో' (బల్లి) జాతులను గుర్తించారు. వాటికి 'హెమిడాక్టిలస్ కైర్నికోలా', 'హెమిడాక్టిలస్ కొయోరుమ్' అని పేర్లు పెట్టారు. ఇవి తెలంగాణలోని రాతి ప్రాంతాలు, అడవుల జీవవైవిధ్యానికి ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. 'హెమిడాక్టిలస్ కైర్నికోలా' జాతి సంప్రదాయంగా పేర్చిన రాతి కుప్పలను ఆశ్రయిస్తూ జీవిస్తుంది. అందుకే దాని పేరులో 'కేర్నికోలా' అనే పదాన్ని ఉపయోగించారు. ఇది గరిష్ఠంగా సుమారు 49 మి.మీ. పొడవు పెరుగుతుంది. శరీరంపై వివిధ రకాల ధాన్యాకార పొలుసులు, కొన్ని పెద్ద కీల్ (రేఖలతో ఉన్న) పొలుసులు ఉంటాయి. ముదురు రాళ్లతో కలిసిపోయే రంగు ఉండటం వల్ల శత్రువుల నుంచి రక్షణ పొందుతుంది. ఇది ప్రధానంగా రాత్రివేళ చురుకుగా ఉండి, రాతి పగుళ్లలో దాక్కొని, రాత్రి కీటకాలను వేటాడుతుంది. కాగా, 'హెమిడాక్టిలస్ కొయోరుమ్' జాతికి తెలంగాణ ప్రాంతంలోని అడవులు, కొండలతో సాంస్కృతిక అనుబంధం ఉన్న కోయ గిరిజన సమాజం గౌరవార్థం పేరు పెట్టారు. ఇది సుమారు 55.6 మి.మీ. వరకు పెరుగుతుంది. శరీరం బూడిద రంగులో ఉండి, నాలుగు స్పష్టమైన తెల్లని పుష్పాకార నమూనాలు కనిపిస్తాయి. ఈ ఆవిష్కరణలు తెలంగాణలోని జీవవైవిధ్యం, స్థానిక జాతుల పరిరక్షణ, గిరిజన సమాజాల సాంస్కృతిక సంబంధం వంటి అంశాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి.

## ప్రాణం తీసిన దొంగతనం!



ముంబయి తీరంలో దొంగతనం చేయాలన్న ప్రయత్నం విషాదాంతమైంది.మానోరి బీచ్ సమీపంలోని గోరై తీరంలో ఒడ్డుకు చేరిన ఓ విదేశీ నౌకలో విషవాయువు పీల్చి నలుగురు యువకులు మృతి చెందారు. వీరంతా 30 ఏళ్లలోపు వారే. బలమైన గాలులు, భారీ వర్షాల కారణంగా సుమారు నాలుగు నెలల క్రితం ఆ నౌక సముద్రంలోనే నిలిచిపోయింది. గత నెల రోజులుగా ఓ ముఠా ఆ నౌకను లక్ష్యం గా చేసుకుని పలుమార్లు దొంగతనాలకు ప్రయత్నించినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తు లో తేలింది. ఇటీవల ఎనిమిది మంది స్పీడ్‌బోట్‌లో నౌక వద్దకు చేరుకున్నారు. ఒకరు బోటులో ఉండగా, ఏడుగురు నౌకపైకి ఎక్కారు. వారిలో నలుగురు నౌకలోని మూసివున్న భాగంలోకి వెళ్లి గ్యాస్ కట్టర్‌తో పైప్‌లైన్‌ను కోసేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో అకస్మాత్తుగా విషవాయువు లీక్ కావడంతో ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు సహచరులు కనిపించకపోవడంతో ముఠాలోని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించడంతో ఘటన వెలుగులోకి వచ్చిం ది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# కొత్త సైనిక కూటములు

ఇటీవల కాలంలో ఇస్లామిక్ ప్రపంచంలో కొన్ని ఆసక్తికర పరిణామాలు జరుగుతున్నాయి. వాటిలో ప్రధానంగా చెప్పుకోవలసిందీ, ప్రాముఖ్యతగలదీ సైనిక కూటముల ఏర్పాటు. ఆగస్టులో సౌదీ అరేబియా, తుర్కియె (టర్కీ), పాకిస్థాన్‌లు మక్కాలో సమష్టి రక్షణ ఒప్పందంపై సంతకం చేశాయి. తుర్కియె, పాకిస్థాన్, ఇండోనేషియా, కటార్‌లు అక్టోబర్ 21న కటార్ రాజధాని దోహాలో 'బదర్ అవగాహన పత్రంపై' సంతకం చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం ఈ నాలుగు దేశాలు సమష్టిగా సైనిక పరికరాలను ఉత్పత్తి చేస్తాయి, టెక్నాలజీ పంచుకుంటాయి, రక్షణ పరిశోధనను పెంపొందిస్తాయి. తుర్కియె, పాకిస్థాన్‌లు రెండూ కూటములలోనూ భాగస్వాములుగా ఉన్నాయి. ఈ రెండు దేశాలూ సైనిక పాటవంలో ముందున్నాయి, పాకిస్థాన్ అణ్వస్త్ర రాజ్యం కూడాను.

సౌదీ అరేబియా, కటార్‌లు పెట్రో వనరులతో ఆర్థికంగా బలమైన దేశాలు. పశ్చిమాసియాలో అరడజను గల్ఫ్ దేశాలు అమెరికాతో కలిసి ప్రయాణిస్తూ దాని సైనిక స్థావరాలకు వసతి కల్పించి తమ దేశాల రక్షణ బాధ్యతను అమెరికాకు అప్పగించాయి. తమ రక్షణ గూర్చి చింతలేకుండా గుండె దిటవుతో ఉంటూ, ఆయిలు వ్యాపారంతో పెట్రో డాలర్ల పంట పండించుకుంటున్నాయి. పశ్చిమాసియాలోని ఇతర అరబ్, ఇస్లామిక్ దేశాలతోపాటు గల్ఫ్ దేశాలు కూడా ఒకవైపు ఇజ్రాయెల్ నుంచి, మరోవైపు ఇరాన్ నుంచి శత్రుత్వం ఎదుర్కొంటున్నాయి. అమెరికా ఇజ్రాయెల్‌ను పనిముట్టుగా వాడుకుంటూ అరబ్ దేశాలను అణిచి ఉంచుతోంది. అందువల్లనే పాలస్థీనా స్వతంత్ర రాజ్యస్థాపన ఆచరణకు నోచుకోకపోగా ఇజ్రాయెల్ ఆగడాలకు, ఆక్రమణకు నిరంతరం గురవుతున్నది. అయితే పశ్చిమాసియాపై అమెరికా ఆధిపత్యం కొనసాగుతుండగా, ఇప్పుడీ సైనిక కూటముల అవసరం ఎందుకొచ్చింది? ఇజ్రాయెల్ తప్పుడు నివేదికలు, ప్రోత్సాహంతో అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌లో ప్రభుత్వ మార్పుకు చేసిన సైనిక దాడి బెడిసికొట్టిన దరిమిలా, ఇరాన్ గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాల ఆర్థిక వనరులపైన పదేపదే దాడులు చేస్తున్నది. గల్ఫ్ దేశాలకు అమెరికా నుంచి ఆశించిన రక్షణ దొరకలేదు. ఈ దశలో అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తూనే తమ రక్షణపై కూడా దృష్టి పెట్టాలన్న ఆలోచన ఆ దేశాల నేతల్లో మేల్కొన్నది. ఆర్థిక సంక్షోభాల్లో ఉన్న పాకిస్థాన్, తుర్కియె తమ సైనిక శక్తిని చూపి ఆ అవకాశంలోకి చొరబడ్డాయి. అయితే మక్కా ఒప్పందం తదుపరి సౌదీ అరేబియా ఆయిలు రిఫైనరీ వ్యవస్థ అరామ్కోపై ఇరాన్ పలుమార్లు క్షిపణు లు ప్రయోగించి కొన్ని వసతులను ధ్వంసం చేసినా 'ఉమ్మడి రక్షణ' (ఒక దేశంపై దాడి జరిగితే మూడు దేశాలపై దాడిగా పరిగణన సూత్రం) ప్రకారం పాకిస్థాన్ గాని, తుర్కియెగాని సౌదీ రక్షణకు వెళ్లలేదు. అమెరికా అనుమతి లేనిదే అవి సైనిక చర్యలకు దిగలేవు. తాజాగా నాలుగు దేశాల బదర్ ఒప్పందంలో ఆయుధాల ఉత్పత్తి, టెక్నాలజీ అభివృద్ధి, రక్షణ పరిశోధనకు ప్రోత్సాహం తప్ప ఉమ్మడి రక్షణ బంధం లేదు. ఈ రెండు సైనిక కూటముల మధ్యనున్న ఈ ప్రధాన వ్యత్యాసం గమనించ దగింది. తుర్కియె నాటో కూటమి సభ్యరాలు, కటార్ లో అతిపెద్ద అమెరికా సైనిక స్థావరముంది. సౌదీ అరేబియా అమెరికాకు అతి సంపన్న మిత్రదేశం. అందువల్ల ఇవేవీ స్వతంత్ర సైనిక శక్తిగా ఎదగలేవు.

ఈ కూటములు భౌగోళికంగా భారత్‌కు అతిచేరువలో ఉన్నందున, పాకిస్థాన్ సైనిక శక్తిగా ఆ రెండింటిలో ప్రధాన భాగస్వామిగా ఉన్నందున ఈ పరిణామాలు గమనించక తప్పనివి. భారత్‌కు సౌదీ అరేబియా, కటార్, ఇండోనేషియాలతో బలమైన ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలున్నాయి. ఇంధనం, వాణిజ్యంలో సౌదీ ముఖ్యమైన భాగస్వామి కాగా, కటార్ ప్రధానమైన గ్యాస్ సరఫరాదారు. ఇండోనేషియాతో కూడా భారత్ రక్షణ సహకారం వృద్ధి చెందుతున్నది. బ్రహ్మోస్ మిస్సిలీలు, ఉమ్మడిగా రక్షణ ఉత్పత్తుల రంగాల్లో సహకారం వృద్ధి చెందుతున్నది. ఆ సైనిక కూటముల్లో ఉన్న దేశాలు భారత్‌కు వ్యతిరేకంగా ఉమ్మడి కూటమి కాజాలవు. భారత్‌తో వాటికి దీర్ఘకాలిక ప్రయోజనాలున్నాయి. ఇవాళ ప్రపంచ దేశాలు ప్రచ్ఛన్న యుద్ధకాలంలోలాగా శిబిరాలకు కట్టుబడిలేవు. తమ ప్రయోజనాలు గీటురాయిగా అమెరికా, చైనా రెండింటితోనూ సహకారం పెంపొందించుకుంటున్నాయి. అయితే మిలటరీ టెక్నాలజీ, ఆయుధాల ఉత్పత్తిని ఎవరు నియంత్రిస్తారు, భద్రతా నిర్ణయాలు ఎవరు తీసుకుంటారు అనేది భవిష్యత్‌లో స్వతంత్ర దేశాల నిర్ణయాలను బహుశా ప్రభావితం చేస్తుంది.

# పిల్లలకు ఇంటర్నెట్ హక్కు... భద్రత రెండూ అవసరమే!



కాలగిరి శ్రీనివాసరెడ్డి
9010128884

ఒకప్పుడు పిల్లల భద్రత అంటే ఇంటి గుమ్మం దాటకుండా చూడటం, అపరిచితులతో మాట్లాడవద్దని హెచ్చరించడం, పాఠశాల నుంచి ఇంటి కి సురక్షితం గా చేరేలా జాగ్రత్త పడటం. ఇప్పుడు ఆ బాధ్యతకు కనిపించని డిజిటల్ ప్రపంచం కూడా తోడైంది. పిల్లల చేతిలోని చిన్న ఫోన్‌లో పాఠశాల ఉంది.. పుస్తకాలున్నాయి.. విజ్ఞానం ఉంది.. వినోదం ఉంది. అదే తెర వెనుక సైబర్ వేధింపులు, మోసపూరిత పరిచయాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, లైంగిక దోపిడీ ప్రమాదాలూ ఉన్నాయి. అందుకే పిల్లల ఇంటర్నెట్ వినియోగం కుటుంబ సమస్య మాత్రమే కాదు.. బాలల హక్కులు, భద్రత, సాంకేతిక సంస్థల బాధ్యత, ప్రభుత్వాల జవాబుదారీతనానికి సంబంధించిన సామాజిక అంశం.

అక్టోబర్ 15న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఈ చర్చకు కొత్త ప్రాధాన్యం కల్పించాయి. పిల్లలకు ఇంటర్నెట్ వినియోగ హక్కు ఉందని పేర్కొంటూనే, పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించడంలో ప్రభుత్వాలు, సామాజిక మాధ్యమ సంస్థలు మరింత సమర్థంగా పనిచేయాలని ధర్మాసనం సూచించింది. పిల్లలను రక్షించాలనే పేరుతో ఇంటర్నెట్‌కు పూర్తిగా దూరం చేయడం పరిష్కారం కాదని, అదే సమయంలో వయసుకు తగిన రక్షణ చర్యలు అవసరమని స్పష్టం చేసింది.

పిల్లలను డిజిటల్ ప్రపంచం నుంచి దూరం చేయడం కాదు.. ఆ ప్రపంచాన్ని పిల్లలకు సురక్షితంగా మార్చడమే అసలు లక్ష్యం!

రాజ్యాంగంలోని 21వ అధికరణం జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ కు రక్షణ కల్పిస్తుండగా, 19(1)(ఎ) అధికరణం భావప్రకటన స్వేచ్ఛను గుర్తిస్తుంది. ఇంటర్నెట్ విద్య, సమాచార సేకరణ, భావప్రకటన, ప్రపంచంతో అనుసంధానానికి కీలక వేదికగా మారింది. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు, డిజిటల్ గ్రంథాలయాలు, పోటీ పరీక్షల సమాచారం అందుబాటులోకి వస్తున్నాయి. దివ్యాంగు లు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకూ ఇది ఉపయోగపడుతోంది.

అందువల్ల ఇంటర్నెట్‌ను పూర్తిగా నిషేధించడం పిల్లల విద్యా, సమాచార అవకాశాలను దెబ్బతీయవచ్చు. అయితే హక్కు ఉందని ఎలాంటి నియంత్రణా అవసరం లేదని భావించడమూ సరికాదు. సెప్టెంబరులో మైనర్ల సామాజిక మాధ్యమ ఖాతాలపై వయసు ఆధారిత నియంత్రణలు, తల్లిదండ్రుల సమ్మతి వంటి అంశాలపై చర్చ జరగగా, అక్టోబర్ 15నాటి ఆదేశాలు పిల్లల హక్కులు, భద్రత రెండింటినీ సమతుల్యం చేయాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చాయి. ఈ అంశాలపై విధాన రూపకల్పనలో స్పష్టత, గోప్యతకు రక్షణ, అమలు సాధ్యత కీలకం.

### డిజిటల్ తెర వెనుక ప్రమాదాలు

పిల్లలతో స్నేహం చేస్తున్నట్లు నటించి వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇంటి చిరునామా సేకరించే వ్యక్తులు ఉండవచ్చు. నమ్మకం సంపాదించిన తర్వాత బెదిరింపులు, డబ్బు డిమాండ్లు, అనుచిత చిత్రాల కోసం ఒత్తిళ్లకు దిగవచ్చు. తోటి విద్యార్థుల నుంచి వచ్చే సైబర్ వేధింపులు, అవమానకర సందేశాలు, మార్ఫింగ్ చిత్రాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపవచ్చు. వ్యక్తిగత సమాచారం తెలియకుండానే పంచుకోవడం గోప్యతకు ముప్పు కలిగిస్తుంది.

పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన చిత్రాలు, వీడియోలు వ్యాప్తి చెందడం అత్యంత తీవ్రమైన సమస్య. ఒకసారి ఆన్‌లైన్‌లోకి వెళ్లిన కంటెంట్‌ను పూర్తిగా తొలగించడం కష్టమవుతుంది. బాధిత పిల్లలు భయం, అవమానభావం, మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు రాత్రివేళల వరకు ఫోన్ వినియోగించడం, నిద్ర, చదువు, శారీరక ఆటలు, కుటుంబ సంభాషణలకు సమయం తగ్గడం వంటి సమస్యలనూ తల్లిదండ్రులు గమనించాలి.

ఈ ప్రమాదాలన్నింటికీ ఒకే నిషేధం పరిష్కారం కాదు. గోప్యతకు ప్రత్యేక రక్షణ, సైబర్ వేధింపులకు ఫిర్యాదు వ్యవస్థ, లైంగిక దోపిడీకి కఠిన చట్టం అమలు, అధిక వినియోగానికి కుటుంబ క్రమశిక్షణ, డిజిటల్ అవగాహన అవసరం.

### సాంకేతిక సంస్థల బాధ్యత

సుప్రీంకోర్టు ఆదేశాల్లో పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌ను గుర్తించి తొలగించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒక వేదికలో తొలగించిన కంటెంట్ మరో వేదికలో మళ్లీ ప్రత్యక్షమవడం, బాహ్య లింకుల ద్వారా వ్యాప్తి చెందడం సమస్యను సంక్లిష్టం చేస్తున్నాయి. ఒకే చిత్రాన్ని లేదా వీడియోను డిజిటల్ గుర్తింపుల ద్వారా గుర్తించే సాంకేతిక పద్ధతులు, హానికర కంటెంట్‌కు సంబంధించిన వెబ్ చిరునామాలను గుర్తించి నిరోధించే చర్యలు ఉపయోగపడవచ్చు.

సామాజిక మాధ్యమ సంస్థలు ఫిర్యాదుల కోసం సులభమైన మార్గాలు కల్పించాలి. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను వేగంగా తొలగించాలి. బాధితుల గోప్యతను కాపాడాలి. పునరావృత వ్యాప్తిని అరికట్టే సాంకేతిక వ్యవస్థలను బలోపేతం చేయాలి. అయితే పర్యవేక్షణ పేరుతో ప్రతి పౌరుడి వ్యక్తిగత సమాచారాన్ని అపరిమితంగా సేకరించడం కూడా సరి కాదు. చట్టబద్ధమైన సమాచారాన్ని తప్పుగా తొలగించకుండా, గోప్యతను కాపాడుతూ చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఈ అంశాలపై పురోగతి నివేదిక సమర్పించాల్సి ఉండగా, తదుపరి విచారణ డిసెంబరు 10, 2026న జరగనుంది.

తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్ ఇచ్చి, వారు ఏమి చూస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఏ సమస్యలు ఎదుర్కొంటున్నారు అనే విషయాలను పూర్తిగా పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యం. అదే సమయంలో ప్రతి సందేశాన్ని రహస్యంగా పరిశీలించడం, నిరంతరం అనుమానించడం కూడా పరిష్కారం కాదు. వయసుకు తగిన వినియోగ నియమాలు, గోప్యతా సెట్టింగులు, తల్లిదండ్రుల నియంత్రణలు, చదువు–వినోదం–నిద్ర మధ్య సమతుల్యత అవసరం.

పిల్లలు ఆన్‌లైన్ వేధింపుల గురించి చెప్పినప్పుడు వారిని నిందించకూడదు. నీ తప్పే అని మందలిస్తే వారు సమస్యలను దాచిపెట్టే ప్రమాదం ఉంది. అపరిచితులు వ్యక్తిగత వివరాలు అడిగినా, రహస్యంగా మాట్లాడాలని ఒత్తిడి చేసినా, అనుచిత చిత్రా లు కోరినా వెంటనే పెద్దలకు చెప్పాలని పిల్లలకు నేర్పాలి. పిల్లలకు భయాన్ని కాదు.. సమస్యను చెప్పగల నమ్మకాన్ని కల్పించాలి.

సుప్రీంకోర్టు ప్రాథమిక స్థాయి నుంచే వయసుకు తగిన రీతిలో శరీర గౌరవం, వ్యక్తిగత హద్దులు, సమ్మతి, ఆరోగ్యకరమైన సంబంధాలు, డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించింది. పిల్లలకు మోసపూరిత పరిచయాలను గుర్తించడం, వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవడం, వేధింపులు ఎదురైతే సహాయం కోరడం నేర్పాలి. ఉపాధ్యాయులకు బాధిత పిల్లలతో ఎలా వ్యవహరించాలి, వారి గోప్యతను ఎలా కాపాడాలి, ఎప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలి అనే అంశాలపై శిక్షణ అవసరం.

విద్యాసంస్థల్లో బాలల సహాయవాణి 1098, సైబర్ నేరాల హెల్ప్ లైన్ 1930, జాతీయ సైబర్ నేరాల నివేదిక పోర్టల్ వివరాలు అందుబాటులో ఉంచాలి. తెలంగాణలో పాఠశాల విద్యాశాఖ, పోలీసు శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల హక్కుల కమిషన్ సమన్వయంతో గ్రామీణ ప్రాంతాలకూ తెలుగు భాషలో డిజిటల్ భద్రతా అవగాహన కార్యక్రమాలు విస్తరించాలి.

### పిల్లల భవిష్యత్తుకు రక్షణ కవచం నిర్మించాలి



మైనర్ల సామాజిక మాధ్యమ వినియోగంపై పూర్తి నిషేధం విధిస్తే పిల్లలు ప్రత్యామ్నాయ ఖాతాలు లేదా ఇతర మార్గాల ద్వారా ప్రవేశించే అవకాశం ఉంది. వయసు ధ్రువీకరణను తప్పనిసరి చేస్తే వ్యక్తిగత సమాచార సేకరణ, దుర్వినియోగంపై ప్రశ్నలు తలెత్తవచ్చు. అందువల్ల వయసుకు తగిన పరిమితు లు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వం, పిల్లలకు ప్రత్యే క భద్రతా సెట్టింగులు, హానికర కంటెంట్‌పై కఠిన చర్యలు, డిజిట ల్ విద్య సమన్వయంతో అమలవ్వాలి.

ప్రభుత్వాలు చట్టాలను సమర్థంగా అమలు చేయాలి. సామాజిక మాధ్యమ సంస్థలు పిల్లల భద్రతను వ్యాపార ప్రయోజనాల కంటే తక్కువగా చూడకూడదు. పాఠశాలలు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలతో సంభాషించాలి. పోలీసులు బాధితులను నిందించకుండా స్పందించా లి. సమాజం బాధిత పిల్లలపై అపవాదు వేయకుండా అండగా నిలవాలి.

సాంకేతికతను వెనక్కి తిప్పడం సాధ్యం కాదు. పిల్లలను ఇంటర్నెట్ నుంచి పూర్తిగా వేరుచేయడం వాస్తవిక పరిష్కారం కాదు. అయితే రక్షణ లేకుండా డిజిటల్ ప్రపంచంలోకి నెట్టివేయడం మరింత ప్రమాదకరం. హక్కులు ఉండి రక్షణ లేకపోతే పిల్లలు ప్రమాదంలో పడతారు; రక్షణ పేరుతో హక్కులనే తొలగిస్తే వారి విద్య, సమాచార అవకాశాలు దెబ్బతింటాయి. పిల్లల భద్రతకు తాళం వేయడం పరిష్కారం కాదు.. ప్రమాదాలకు తలుపులు మూసి, జ్ఞానానికి మార్గాలు తెరవడమే నిజమైన పరిష్కారం. పిల్లలు స్వేచ్ఛగా నేర్చుకోవాలి, సురక్షితంగా ఎదగాలి, భయం లేకుండా సమస్యలను చెప్పగలగాలి. ఆ బాధ్యత పిల్లలపై మాత్రమే కాదు.. వారి భవిష్యత్తు ను నిర్మిస్తున్న తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, సమాజం అందరిపైనా ఉంది.

# నవజీవన్‌తో గాంధీజీ నవభారత నిర్మాణం

ఒక దినపత్రిక ద్వారా దాస్యశృంఖలాల నుండి ఒక దేశానికి ఎలా స్వేచ్ఛ ప్రసాదించవచ్చో, 'నవజీవన్' పత్రిక ద్వారా మహాత్మా గాంధీ ప్రపంచానికి చాటి చెప్పారు... 'ఒక అణా' తో ఎనిమిది పేజీల వార పత్రిక సెప్టెంబర్ 7వ తేదీన 1919 లో గాంధీజీ ప్రారంభించిన నవజీవన్ పత్రిక మొత్తం దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చింది.. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించింది.. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన సంఘటనలు, తదుపరి బ్రిటిష్ వారి ఆంక్షలు గాంధీజీ స్వాతంత్ర్య పోరాటానికి తరచూ ఆటంకాలు కలిగిస్తున్న సమయంలో, తన ఆశయాలైన అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, వ్యవసాయ అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన, స్వయం సమృద్ధి, చేనేత వంటి అంశాలను ప్రజల చెంతకు చేర్చడానికి, తద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి ఒక ఆయుధంగా పత్రికను ప్రారంభించాడు.. తన ఆశయాలతో పాటు తన సిద్ధాంతాలను పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలలో ఉండే సామాన్య ప్రజలకు చేరువ చేయడానికి నవజీవన్, యంగ్ ఇండియా వంటి పత్రికలు ద్వారా చైతన్య పరచడం ప్రారంభించారు. ముఖ్యంగా పేపరులో తాను రాసే విషయాలను చదవడం తద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా, పాఠకుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించే నూతన పత్రికా విలువలకు పునాది వేయడం ద్వారా స్వాతంత్ర్య పోరాటం మరింత బలోపేతం అవడానికి, ఎక్కువ మంది అవగాహనతో భాగస్వామ్యం అవడానికి వీలు కలిగింది...ఈ సందర్భంగా బ్రిటిష్ వారు అనేక ఆటంకాలు కలిగించేవారు.. నవజీవన్ పత్రిక ప్రచురించడానికి కూడా పబ్లిషర్స్ భయపడేటట్లు బ్రిటిష్ వారు ఆంక్షలు విధించేవారు.. అయినప్పటికీ నవజీవన్ పత్రిక ప్రజలకు సకాలంలో చేరవేయడం ద్వారా దేశం నుంచి బ్రిటిష్ పాలకులను పారద్రోలడానికి చక్కటి ఆయుధంగా మారింది..

నేడు కూడా పాలకులకు వ్యతిరేకంగా ఏ పత్రికైనా వార్తలు రాసినా, ఆంక్షలు విధించడం చూస్తూనే ఉన్నాం.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా, నిజాన్ని నిర్భయంగా స్వేచ్ఛగా ప్రజలకు చేరువ చేయడానికి 'ప్రెస్' కు ప్రముఖ స్థానం కల్పించారు... అయితే నేడు మనదేశంలో పత్రిక స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది.. దాదాపు దేశంలో చాలా పత్రికలు, ఛానెల్స్ ప్రభుత్వ అనుకూలంగా మారిపోవడం బాధాకరమైన విషయం... దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే.. దేశంలో చాలా పత్రికలు ఛానెల్స్ ప్రైవేటు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్ళిపోవడం జరిగింది... అందుచేతనే ప్రభుత్వ అనుకూల వార్తలు, వ్యాపార ప్రకటనలు, ఎడిటోరియల్ పేజీలో ఆర్టికల్స్ వివిధ అంశాలు అన్నియు ఆయా రాష్ట్రాల, కేంద్ర ప్రభుత్వాలకు అనుకూలంగా ఉండుట జరుగుతుంది.. అక్కడ అక్కడ దేశంలో కొన్ని పత్రికలు, ఛానెల్స్ నిర్భయంగా వాస్తవానికి దగ్గరగా వార్తలు రాసినా, ప్రసారం చేసినా ప్రభుత్వాలు ఆంక్షలు విధిస్తున్న పరిస్థితి ఏర్పడింది.. అదే, నాటి పత్రిక చైతన్యానికి, నేటి పత్రికా విలువలకు ఎంత తేడాయో కదా అని అనిపిస్తుంది..

పత్రికలు సమాజ చైతన్యానికి నడుం బిగించాలి.. పాలకులు, పార్టీలు మంచి చేస్తే పొగడాలి... తప్పులు చేస్తే సరిదిద్దే విధంగా సందేశం ఇవ్వాలి.. వాస్తవాలు ప్రజలకు తెలియపరచాలి.. పత్రికలు, ఛానెల్స్ అంటే సమాజానికి సేవ చేసే ఆయుధాలు... అవినీతిని చీల్చే అంకుశం... తప్పు చేసేవారిని గాడిలో పెట్టే గైడ్. ఒక సమాజ అభివృద్ధిలో, ఒక దేశ నిర్మాణంలో పత్రికలు ఛానెల్స్, సామాజిక మాధ్యమాలు పాత్ర చాలా కీలకం అని గ్రహించాలి.. అంతేగానీ, ప్రభుత్వ విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతి మార్గంలో నిరసనలను వ్యక్తం చేసేవారిపై, రాతలు రాసే వారిపై ప్రభుత్వాలు ఆంక్షలు విధించరాదు.. ఆయా సమస్యలకు పత్రికలు సూచించే పరిష్కారాలను స్వీకరించి తదనుగుణంగా ప్రభుత్వాలు కృషి చేయాలి.. పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాలి... అదే సమయంలో జర్నలిజం కూడా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.. గాంధీజీ ఏ విలువలతో తన పత్రికలు నడిపించారో, ప్రజలను చైతన్యవంతులను చేసారో, దేశానికి స్వాతంత్ర్యం సాధించారో, .. బ్రిటిష్ సామ్రాజ్య వాద ఆంక్షలను ఎదిరించారో... అదే రీతిలో నేడు కూడా పత్రికలు నిర్భయంగా స్వేచ్ఛగా ప్రజలకు సేవ చేయాలి.. పాలనలో పారదర్శకత పెంచే విధంగా పత్రికలు తమ తమ పాత్ర పోషించాలి.. పాలకులు, ఉద్యోగస్తులు తమ విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించే విధంగా పత్రికలు మార్గదర్శకంగా నిలవాలి.. ప్రజాస్వామ్య వ్యవస్థ పది కాలాల పాటు పారదర్శకంగా పనిచేయాలి అంటే పత్రికలే పునాదులు...ప్రజల హక్కులను కాపాడటం కోసం, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించవలసిన ప్రధాన ఆయుధాలు పత్రికలు, ఛానెల్స్, సామాజిక మాధ్యమాలే... అందుకే పత్రిక స్వేచ్ఛ కాపాడేందుకు అందరూ భాగస్వాములు కావాలి.. దేశ ప్రధాని కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా పత్రికా విలేకరులతో సమావేశం నిర్వహించి, వారితో మాట్లాడకపోవటానికి కారణం మేం తప్పు చేయం అనే ధోరణి మరియు మమ్మల్ని ప్రశ్నిస్తారా... అనే ధోరణి ప్రబలటమే!.. ఇటువంటి పరిస్థితుల్లో పత్రికలు పాత్ర మరింత కీలకం.. దేశాన్ని వెంటాడుతున్న పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అవినీతి, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు, కార్పొరేటీకరణ, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, అనారోగ్యం, వివక్షతలు, మహిళలపై అఘాయిత్యాలు, డ్రగ్స్, సైబర్ క్రైమ్ ఇలా పలు సమస్యలు పరిష్కారం కోసం, పాలకుల్లో పారదర్శకత పెంచే విధంగా పత్రికలు, మీడియా పనిచేయాలి. ఈ సమస్యలు పరిష్కారం కానిదే వికసిత్ భారత్‌కు అర్థం ఉండదు.

ఐ.ప్రసాదరావు,
9390509791

# న్యాయవాదుల సమస్యలపై సిఎంతో చర్చలు

● టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్

● న్యాయవాదుల సంక్షేమం, కార్పస్ ఫండ్ పెంపు, జిపి, ఎజిపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుల భర్తీపై సిఎం కసరత్తు: మంత్రి శ్రీధర్‌బాబు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అవసరమైన చర్యలపై నవంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. న్యాయవాదులకు స్టైఫండ్ పెంపుతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకొచ్చామని తెలిపారు. టిపిసిసి లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం లీగల్ సెల్ చైర్మన్ అశోక్ గౌడ్ అధ్యక్షతన శనివారం గాంధీభవన్‌లోని ఇందిరాభవన్‌లో జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, ఎఐపిసి చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జి.వివేక్ వెంకట్ స్వామి, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ బద్ధ సంస్థలు నిర్వీర్యమవుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు. ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని, సిబిఐ, ఈడి వంటి దర్యాప్తు సంస్థలను కూడా కేంద్రం ఇష్టానుసారంగా వినియోగిస్తోందని విమర్శించారు. న్యాయవాద వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, అదే సమయంలో ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. న్యాయవాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన అనేక మంది నాయకులు రాణించారన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ న్యాయశాఖ కూడా ముఖ్యమంత్రి పరిధిలోనే ఉన్నందున, న్యాయవాదుల సంక్షేమం, కార్పస్ ఫండ్ పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే మంత్రులు, అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సిఎంతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. జిపి, ఎజిపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుల భర్తీపై సిఎం కసరత్తు చేస్తున్నారని, వారి పనితీరుపై 'పెర్ఫార్మెన్స్ ఆడిట్' పారామీటర్లు పెట్టి సమీక్షించాలని ఆలోచిస్తున్నారని, ఈ నియామకాల్లో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అసోసియేషన్ సహకారం అవసరమన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్షకు సంబంధించిన కటాఫ్ మార్కుల అంశాన్ని న్యాయశాఖ సెక్రటరీ, సిఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయపరంగా పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులందరికీ వర్తించేలా ఇందిరమ్మ ప్రమాద బీమా అమలు చేస్తామని, హెల్త్ ఇన్సూరెన్స్ పరిమితిని రూ.2 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. గతంలో వామన్‌రావు దంపతుల హత్య జరిగినప్పుడు ఇచ్చిన హామీ మేరకు, న్యాయవాదుల భద్రత కోసం అసెంబ్లీలో 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో న్యాయవాదుల పాత్ర మరువలేనిదని, 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారన్నారు. న్యాయవాదులకు సంబంధించి సముచిత న్యాయం జరగాల్సి ఉందన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై కూడా పార్టీ లీగల్ సెల్ అండగా ఉండాలన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం, వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చే ఆలోచనపై కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చాలా సమస్యలు కోర్టుకు వెళ్తున్నాయని, చాలా నిర్ణయాలు కోర్టు తీర్పుల ద్వారానే వస్తున్నందున న్యాయవాదుల పాత్ర కీలకమైందన్నారు.




# 'సర్' రద్దు చేయాలి.. ఓటు హక్కు కాపాడాలి

● ట్యాంక్‌బండ్‌పై 2 వేల మందితో భారీ మానవహారం

● జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి.. సిఈసి చట్టం–2023ను ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపును నిలిపివేసి, ప్రజల రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై శనివారం రెండు వేల మందికిపైగా పౌరులు భారీ మానవహారం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, సిఇసి చట్టం–2023ను ఉపసంహరించుకోవాలని నినదించారు. తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. టివిఆర్ఎఫ్, టిపిఎఫ్, ఎన్ఎపిఎం, ఆర్ఎస్‌వి, ఎఐపిఎం, ఎపిసిఆర్, డబ్ల్యూటిజెఎసి, బిజెఎ, అలీఫా, టిడిడబ్ల్యూయూ, హెచ్ఆర్ఎఫ్, టిపిజెఎసి, ఎంపిజెలతో పాటు విద్యార్థి సంఘాలైన ఎఐఎస్ఎఫ్, బార్క్, ఎస్ఎఫ్ఐ, ఐసా, ఎఐడిఎస్ఒ, ఎఎస్ఎ, పిడిఎస్‌యు, ఎన్ఎస్‌యుఐ, ఎంఎస్ఎఫ్, అన్సామానా, ఎఐఓబిసిఎస్ఎ, పౌర సమాజం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతాకాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా భారీగా ఓటర్లను తొలగిస్తున్నారని, ఇది ఓటర్ల ధృవీకరణ ప్రక్రియ కాదని, సామూహిక ఓటర్ల తొలగింపునకు దారితీస్తోందని నిర్వాహకులు ఆరోపించారు. తెలంగాణలోనూ ఓటర్ల పేర్ల తొలగింపు, అనుమానాస్పద ఓటర్లకు నోటీసుల జారీపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, పరకాల ప్రభాకర్, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, వసంత లక్ష్మి, రిటైర్డ్ ఐఎఎస్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్ పద్మజా షా, కల్పనా కన్నభిరాన్, రుబీనా నఫీస్, రవి కన్నెగంటి, సౌమ్య కిదాంబి, సజయ కాకర్ల, ఝాన్సీ, సంధ్య, సిస్టర్ లిస్సీ, కిరణ్ విస్సా, మారియా తబస్సుమ్, పి. శంకర్, సునీత ఎమేరీ దయాస్, వెంకట్ రెడ్డి, ఖలీదా పర్వీన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్ నెల్లి సత్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అనిల్, ఎండి అన్వర్, నాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్‌తో పాటు ప్రముఖ పౌరులు, కార్యకర్తలతో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో ప్రతిజ్ఞ చేసి, ఎస్ఐఆర్ రద్దయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని ప్రకటించారు.

# 'ఉమ్రా' యాత్రికులకు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయాలి

● కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సౌదీ అరేబియాలో చిక్కుకుపోయిన సుమారు 4 వేల మంది భారత ఉమ్రా యాత్రికులను తక్షణమే స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గత 20 రోజులుగా విమాన సర్వీసులు నిలిచిపోవడంతో మక్కా, మదీనా, జెడ్డా ప్రాంతాల్లో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తిరుగు ప్రయాణ ఏర్పాట్ల విషయంలో ఏజెంట్లు చేతులెత్తేయడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన తెలిపారు. అధిక ధరలతో ప్రత్యామ్నాయ విమాన టికెట్లు కొనుగోలు చేయలేని పేద, మధ్యతరగతి కుటుంబాల యాత్రికులను ఆదుకోవాలని కోరారు. ప్రధాని మోదీ తక్షణమే స్పందించి సంబంధిత కేంద్ర మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించి, యాత్రికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు చెందిన సుమారు 600 మంది యాత్రికులు అక్కడ చిక్కుకుపోయినందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేంద్రంతో సమన్వయం చేసుకుని వారిని తిరిగి రప్పించాలని కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో కోరారు.

# విద్యుత్, నీరు పొదుపు చేయాల్సిందే

● మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎల్ నినోతో రానున్న ఎనిమిది మాసాల కాలంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనున్నామని ఇందుకు ప్రజలు సంసిద్ధులై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉందని ఇప్పటికే అనేక దేశాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఉన్నాయని తెలంగాణ రాష్ట్రం కూడా ఇప్పటికే ఎల్ నినోను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు చోట్ల రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా కోదుమూరు గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్ నినో కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. రానున్న ఏడెనిమిది మాసాలు వర్షాలు కురిసే అవకాశం లేదని ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇప్పటికే లండన్ లాంటి మహా నగరాలు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాయని ఆయన తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చెరువులు పూర్తిగా ఎండిపోయాయని మరి కొన్ని ప్రాంతాల్లో 25శాతం నీరు మాత్రమే ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44,340 చెరువులు, కుంటలు ఉంటే వాటి ద్వారా 470 టిఎంసిల నీరు లభ్యమయ్యేదని కానీ ఇప్పుడు దాదాపు మూడొంతుల చెరువుల్లో 20 శాతాని కంటే నీరు తక్కువగా ఉందని విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల పంపుసెట్లు ఉంటే అందులో సగం పంపుసెట్లకు అంటే 15 లక్షల పంపుసెట్లు భూగర్భ జలం ఇంకిపోయి పనిచేయడం లేదన్నారు. బాధ్యతగా వ్యవహరించకపోతే ఈ సమాజానికి నష్టం చేసినట్లేనని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చర్యలు తీసుకుంటున్నామని దీనికి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. కరోనా విపత్తును నేను అసెంబ్లీలో ముందే హెచ్చరిస్తే అనాటి ప్రభుత్వం పట్టించుకోలేదని కానీ చివరకు పట్టించుకోక తప్పలేదని ఈ సందర్భంగా భట్టి గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆహార పదార్థాల కొరత లేదని మరో ఏడాది వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహార ధాన్యాలను అందిస్తామని ఆయన తెలిపారు. తాగునీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రజల తాగునీటితో పాటు పశు పక్షాదులను కూడా రక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని విక్రమార్క గుర్తు చేశారు. విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో ఉందని ఈ అక్టోబర్ మాసంలో 20018 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. 2014లో విద్యుత్ వినియోగం 6648 మెగావాట్లు ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందని ఇంకా కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 2026లో 335.05 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతుందని గతేడాదితో పోల్చినప్పుడు ఇది 37 శాతం ఎక్కువ అని విక్రమార్క తెలిపారు. ట్రాన్స్‌కో పరిధిలో 11 సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని డిస్కమ్‌ల పరిధిలో 177 సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని ఇంకో 267 సబ్ స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. గతంలో యుపిఎ ప్రభుత్వం రూపొందించిన ఈజిఎస్ పనుల్లో కేంద్రం భరించేదని కానీ ఇప్పుడు 40 శాతం రాష్ట్రాలపై భారం మోపిందని అయినా రాష్ట్రం వెనుకాడకుండా పనులు చేపడుతుందన్నారు. ఎల్ నినోను రాజకీయ అవసరాలకు వాడుకోకుండా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉందని విక్రమార్క స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ట్రాన్స్‌కో సిఎండి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



# శాశ్వత కరువు నివారణకు రూ.150 కోట్లు

● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఎప్పుడు తలెత్తినా ప్రజలు, రైతులు ధైర్యంగా తట్టుకునేలా మూడు మండలాల్లో రూ.150 కోట్ల వ్యయంతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, రైతు కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చారిత్రకంగా కరువు ప్రభావానికి గురవుతున్న ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలు, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, రైతు కుటుంబాల జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట్ జిల్లా మఖ్తల్ మండలాలను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసినట్లు మంత్రి చెప్పారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) సహకారంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర సచివాలయంలో శనివారం వ్యవసాయ, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ ప్రాజెక్ట్‌కు ప్రకృతి విపత్తుల శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. ప్రాజెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన మండలాల్లోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి, ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగానే సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని, లక్ష్యాన్ని చేరుకునేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, డైరెక్టర్ ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు.

# కన్నెపల్లి పంప్‌హౌస్ నుండి గోదావరి జలాలను ఎత్తిపోయాలి

● హైదరాబాద్‌కు నీళ్లు ఇవ్వకుంటే సిఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తాం

● కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం :** హైదరాబాద్ మహానగరంలో తలెత్తుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోసుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నా, వాటిని ప్రజల అవసరాలకు వినియోగించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. తక్షణమే నీటి సమస్యను పరిష్కరించకపోతే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, కన్నెపల్లి పంప్ హౌస్‌ను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కె.పి.వివేకానందగౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సందర్శించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. జూన్ నుంచి ఇప్పటివరకు సుమారు 750 టిఎంసిలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయని వారు పేర్కొన్నారు. కనీసం 250 టిఎంసిల నీటిని ఎత్తిపోసినా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగి, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు తాగునీటి సమస్యకు కొంత ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రజలను తాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్ మాట్లాడుతూ, జూలై 5న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి గోదావరి జలాలు సముద్రంలోకి వృథాగా వెళ్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. హైదరాబాద్‌కు ఏడాది పాటు తాగునీరు అందించేందుకు సుమారు 10 టిఎంసిల నీరు సరిపోతుందని పేర్కొంటూ, కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని తన నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయని వాటర్‌బోర్డు అధికారులు చెబుతున్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని, అక్టోబర్ నెలలో రోజుకు సుమారు 7,000 ట్యాంకర్ బుకింగ్స్ నమోదవుతున్నాయని పేర్కొన్నారు. సాధారణంగా వేసవిలో కనిపించే పరిస్థితులు ఇప్పుడే ఏర్పడటం నగరంలో నీటి కొరత తీవ్రతకు నిదర్శనమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాజకీయ విమర్శలతో పక్కదారి పట్టించలేరని అన్నారు. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, మరోవైపు హైదరాబాద్ తాగునీటి సంక్షోభం దిశగా వెళ్లడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి హైదరాబాద్ ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిని రాకేష్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగపల్లి శ్రీనివాస్ రావు, టిఆర్ఎస్ నాయకులు గండ్ర హరీష్ రెడ్డి, కటకం జనార్ధన్, సెగ్గం సిద్ధు, మాడ హరీష్ రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కరువుపై ముందస్తు హెచ్చరికలు ఇస్తే తప్పేంటి? : మంత్రి అడ్లూరి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని ప్రజలను ముందుగానే అప్రమత్తం చేస్తే తప్పేంటని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును ప్రశ్నించారు. ఎల్ నినో ప్రపంచవ్యాప్త వాతావరణ పరిణామమని, కరువు వచ్చిన తర్వాత హడావుడి పడటం కంటే ముందుగానే తాగునీరు, సాగునీరు, పశువులకు నీరు, పశుగ్రాసం, వ్యవసాయం, ఉపాధి రంగాలపై ప్రణాళిక రూపొందించడం బాధ్యతాయుత పాలన అని స్పష్టం చేశారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆస్పత్రుల్లో బెడ్లు, ఆక్సిజన్, మందుల కోసం ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తుచేస్తూ, అప్పటి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ముందస్తు సన్నద్ధత చేపట్టడాన్ని తప్పుబట్టడం సరికాదన్నారు. కాళేశ్వరం ఒక్కటే తెలంగాణ సాగునీటికి ఆధారం కాదని, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, వరద కాలువలు, చెరువులు, భూగర్భ జలాలు, బోర్ల ద్వారా కూడా రైతులు సాగు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమస్యలకు నిపుణుల నివేదికల ఆధారంగా సాంకేతిక పరిష్కారాలు చేపడుతున్నామని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం, డిజైన్, నాణ్యత, నిర్వహణ, వ్యయాలు, సాగునీటి ప్రయోజనాలపై గత పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా రైతులు, పేదల సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక సూచనలు చేయాలని, కరువు ముప్పును ముందుగానే ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి సహకరించాలని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు.

# కేంద్ర నిధుల సాధనకు ప్రత్యేక కార్యాచరణ



● పెండింగ్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలి

● శాఖల కార్యదర్శులకు సిఎస్ సంజయ్ జాజు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను త్వరితగతిన సాధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. నిధుల విడుదలకు అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, నిధుల విడుదలకు సంబంధించిన ప్రక్రియలు, వ్యయ వివరాల నమోదు, సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఎ) ఖాతాల ముగింపు తదితర అంశాలపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్ర పథకాల కింద రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంపై శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, ఉపకార వేతనాలు, గృహ నిర్మాణం, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, రవాణా, పశుసంవర్ధక, మత్స్య తదితర శాఖలకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై సమీక్షించారు. నిధుల విడుదలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలు, వ్యయ వివరాల నమోదుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**సిఎం ఆదేశాల మేరకు నిరంతర పర్యవేక్షణ..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర నిధుల సాధనకు అన్ని శాఖల కార్యదర్శులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిఎస్ సూచించారు. సిఎం రివ్యూ కార్యక్రమం, సిఎం డ్యాష్‌బోర్డు ద్వారా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కేంద్ర స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే తాను కూడా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర నిధులు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కీలకమని పేర్కొంటూ, నిధుల సాధనలో ఎలాంటి జాప్యం జరగకుండా శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి భూముల స్వాధీనానికి యత్నించడం అన్యాయం: ఎన్ఎంయు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి భూముల స్వాధీనానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జిఒను తక్షణమే వెనక్కి తీసుకోవాలని టిజిఎస్ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) డిమాండ్ చేసింది. ఆర్‌టిసి సంస్థను, కార్మికుల హక్కులను కాపాడుతామని చెబుతున్న ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని యూనియన్ నాయకులు విమర్శించారు. ఆర్‌టిసికి చెందిన ఆరున్నర ఎకరాల భూమి వేల కోట్ల రూపాయల విలువ చేస్తుందని, అలాంటి భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం జిఓ జారీ చేయడం ఆర్‌టిసి ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. షీలా భిడే కమిటీ నిర్ణయాల ప్రకారం ఆర్‌టిసి విభజన ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ఆస్తుల పంపకాలు కూడా జరగలేదని యూనియన్ నాయకులు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి భూములను ప్రభుత్వం ఎలా స్వాధీనం చేసుకుంటుందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎన్ఎంయు అధ్యక్షుడు పి.కమల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ మర్రి, ప్రధాన కార్యదర్శి ఎం.డి.మౌలానా, ఎజిఎస్ కామ్రేడ్ సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


## గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: శంషాబాద్ సర్కిల్-18

తేది: 23.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ (రూ.లక్షలలో) | బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| టెండర్ నోటీసు NIT No. 21/ EEC-18/ SHBD/ GHMC/ 2026-27, తేది: 23.10. 2026 | 01 పని కొరకు "జిహెచ్ఎంసి పరిధిలోని శంషాబాద్ వార్డ్ నెం. 118, కొత్వాల్‌గూడ వార్డ్ నెం. 119, శంషాబాద్ సర్కిల్-18 పరిధిలోని వివిధ ప్రదేశాలలో సిసి ప్యాచ్లు వేయడం ద్వారా తీవ్రంగా దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణ". | 11.50 లక్షలు | 02.11.2026 సా.4.30గం.ల వరకు | శ్రీ డి.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 12376-PP/CL/ADVT/2026-27, Date: 24-10-2026

## మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: మల్కాజ్‌గిరి జోన్

| NIT No. | పని పేరు | అంచనా విలువ లక్షల రూ.లలో | బిడ్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 80/EE-I/ MKJZ/ MMC/ 2026-27 | నిర్వహణ పనులు ఇతరాలు-3 | 24.90 | 26.10.2026 మ.3.00 గం.ల నుండి, 29.10.2026 మ.3.00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 12382-PP/CL/ADVT/2026-27, Date: 24-10-2026

## పురపాలక సంఘం కార్యాలయం – ఆలేరు,

జిల్లా: యాదాద్రి భువనగిరి

E1/6/1/2026-27 Dt.24.10.2026; E1/6/2/2026-27 Dt.24.10.2026
E1/6/3/2026-27 Dt.24.10.2026; E1/6/4/2026-27 Dt.24.10.2026
E1/6/5/2026-27 Dt.24.10.2026; E1/6/6/2026-27 Dt.24.10.2026
E1/6/7/2026-27 Dt.24.10.2026; E1/6/8/2026-27 Dt.24.10.2026
E1/6/9/2026-27 Dt.24.10.2026;

**E-PROCURMENT TENDER NOTICE**

పురపాలక సంఘం, ఆలేరు కమిషనర్ గారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్ పిలవడం జరిగినది.

| | | |
|---|---|---|
| > మొత్తం పనులు | : | (9) |
| > అంచనా విలువ | : | రూ. 18.00 లక్షలు |
| > బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేదీ & సమయం | : | తేది: 27-10-2026 @02:00PM |
| > బిడ్ డౌన్ లోడ్ ముగింపు తేదీ & సమయం | : | తేది: 29-10-2026 @4:00 PM |
| > బిడ్ తెరచు తేదీ & సమయం | : | తేది: 29-10-2026 @4:30 PM |

ఇతర వివరముల కొరకు WWW.TENDER.TELANGANA.GOV.IN వెబ్‌సైట్‌ను సంప్రదించగలరు.

సం/- కమిషనర్
పురపాలక సంఘం, ఆలేరు

DIPR R.O. No. : 12394-PP/CL/ADVT/2026-27, Date: 24-10-2026

## ధర్మపురిలో నేడు పొన్నం ప్రభాకర్ పర్యటన

**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసిసంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేడు జగిత్యాల జిల్లా ధర్మపురిలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా ఉదయం 6:30 గంటలకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.అనంతరం ఉదయం 10 గంటలకు ధర్మపురి పట్టణంలోని టిజిఎస్‌ఆర్‌టిసి బస్‌స్టేషన్ ఆధునీకరణ,అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

## హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిమెంటు కంపెనీల గోదాం, డీలర్ షాప్స్ హమాలి కార్మిక సంఘం (ఎఐటియుసి అనుబంధం) నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య తెలిపారు. బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన రాష్ట్ర సదస్సు అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడిగా జంగం తిరుపతి యాదవ్(కరీంనగర్ జిల్లా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బోరిగం కుమారస్వామి,(వరంగల్ జిల్లా), కేతుమల్ల వెంకటప్పయ్య(హన్మకొండ జిల్లా), చిట్టవేణి లక్ష్మణ్ యాదవ్ ( మంచిర్యాల), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య (కరీంనగర్ జిల్లా), రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా పొట్యాల లక్ష్మయ్య( సిరిసిల్ల జిల్లా), బొరిగం రాజు ( వరంగల్ జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా గంగుల అంజయ్య ( జగిత్యాల జిల్లా ), రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నన్నవేని కొమరయ్య, బోడకుంటి రామచందర్,బానోతు భాస్కర్,మీస శ్రీనివాస్,బాగోతం వీరయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమ్మయ్య తెలిపారు.

## బతుకమ్మలతో ఎఎన్‌ఎంహెచ్‌ల నిరసన

**ప్రజాపక్షం/ముత్తారం :** ఉద్యోగ భద్రత కల్పించాలని,సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఎన్‌ఎంహెచ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారంతో పదో రోజుకు చేరింది. ముత్తారం మండల కేంద్రం నుండి అధిక సంఖ్యలో పెద్దపల్లి జిల్లా కేంద్రానికి తరలి వెళ్లారు. కాగా పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు బతుకమ్మలతో వినూత్నంగా నిరసన తెలిపారు. ముత్తారం మండల ఎఎన్‌ఎంహెచ్‌లు సైతం పూర్తి స్థాయిలో ఈ సమ్మెలో పాల్గొనడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

## సైబర్ నేరగాళ్ల మ్యూల్ ఖాతాలపై పోలీస్‌ల కొరడా

**ప్రజాపక్షం/కరీంనగర్:** సైబర్ మోసాలకు వినియోగించే మ్యూల్ బ్యాంక్ ఖాతాలపై పోలీస్‌లు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి నమోదైన వివరాలను సిపి గౌష్ ఆలం వెల్లడించారు. జిల్లాలోని మొత్తం 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 29 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, వీటిలో మొత్తం 122 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 89 మందికి సంబంధించి అరెస్ట్‌లు, చట్టపరమైన నోటీసులు జారీ చేయడం పూర్తి కాగా, మిగిలిన 33 మంది నిందితుల అరెస్ట్ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని సిపితెలిపారు. తమ బ్యాంక్ ఖాతాలను, ఎటిఎం కార్డులను, లేదా ఒటిపిలను ఇతరులకు అద్దెకు ఇవ్వడం గానీ, కమీషన్‌ల ఆశ చూపి చేసే లావాదేవీలకు వినియోగించడానికి ఇవ్వడం గానీ నేరమని పోలీస్‌లు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లకు సహకరించే ఖాతాదారులను కూడా చట్టపరంగా నేరంలో భాగస్వాములుగానే పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు.

## సజావుగా 30 గ్రామాల్లో రీ సర్వే



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** జిల్లాలో వివిధ మండలాల్లో 30 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ సజావుగా జరుగుతుందని, ఎన్ఒపిలో ఎలాంటి ఇబ్బందు లు లేవని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం భూభారతీ రీస ర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో భూ రీ స ర్వేను పకడ్బందీగా పూర్తి చేస్తామన్నారు. నాన్ రెసిడెన్సిలో ఉన్న వాళ్లతో సంప్రదించటం ఇబ్బందిగా ఉంటుందన్నారు. గ్రామాల్లో వ్యవసాయాధికారులు ఫార్మసి, రిజిస్ట్రి, రైతు భరోసా తదితర కార్యక్రమాలతో టచ్‌లో ఉంటామన్నారు. వ్యవసాయాధికారులతో కలసి నాన్ రెసిడెన్సి సంప్రదించి రీ సర్వే చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎడి సర్వేల్యాండ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకునూర్ పంచాయతీలో డిఎల్‌పిఒ తనిఖీ



**ప్రజాపక్షం/చేర్యాల :** చేర్యాల మండలం ఆకునూర్ గ్రామ పంచాయితీకి సంబంధించిన నిధులు వినియోగంపై, రికార్డులు, అలాగే నర్సరీ, పారిశుద్ధ్య సముదాయ పరిశీలనను స్థానిక ఎంపిఒ సుధీర్, స్థానిక సర్పంచ్ కొమ్ము రవితో కలసి డిఎల్‌పిఒ చందన తనిఖీ నిర్వహించారు. జిపి నిధులకు సంబందించిన, బిల్లులు, వౌచర్లు ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ మస్టర్ రోల్స్‌ను పరిశీలించి, పనులపై స్థలపరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కరీముద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ మంతపురి లక్ష్మన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

**ప్రజాపక్షం /హుజురాబాద్:** హుజురాబాద్ మండలం రంగాపూర్ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి జిల్లా రామగుండం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పలువురు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుని ఎర్టికా కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో హుజురాబాద్ మండలం రంగాపూర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీస్‌లు క్షతగాత్రులను బయటకు తీసి చికిత్స నిమిత్తం 108 ఆంబులెన్స్‌లో వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారంతా రామగుండం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వారిగా గుర్తించారు. సిఐ కరుణాకర్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# డ్రోన్ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** డ్రోన్ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన డ్రోన్‌ను జగిత్యాల శాసనసభ్యుడు సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో ముందుండాలని ఆకాంక్షించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో డ్రోన్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. డ్రోన్ ద్వారా పంటలకు పిచికారీ చేయడం వల్ల రైతులకు శారీరక శ్రమ తగ్గడంతో పాటు ఆరోగ్యపరంగా కూడా ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో ఆధునిక సాంకేతికతను వినియోగించుకునేలా పిఎసిఎస్ ఆధ్వర్యంలో డ్రోన్ సేవలను అందించడం ఆనందదాయకమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ సబ్సిడీ అందిస్తోందని, రైతులు, సహకార సంఘాలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు . జగిత్యాల పిఎసిఎస్‌కు అనుభవం ఉన్న పాలకవర్గం ఉందని, రైతుల పక్షాన నిలిచి వారికి మరింత మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. జగిత్యాల వ్యవసాయ రంగానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉం దని ఎమ్మెల్యే గుర్తుచేశారు. గతంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో నాలుగు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన నీటి పారుదల శాఖ అధికారులు వివిధ అంశాలపై చర్చించేవారని, కీలకమైన కార్యాలయాలకు జగిత్యాల కేంద్రం గా ఉండేదన్నారు. 1980 సంవత్సరానికి ముందే చల్లిగల్, పొలాస వ్యవసాయ క్షేత్రాలు, అగ్రోస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. లస్కర్ స్థాయి నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి వరకు అధికారులు జగిత్యాలలో నివాసం ఉండేందుకు క్వార్టర్స్ కూడా ఉండేవని గుర్తుచేశారు. అయితే గత ప్రభుత్వాల నిర్ల క్ష్యం కారణంగా జగిత్యాలలోని పలు కీలక కార్యాలయా లు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయని అన్నారు. కేం ద్ర ప్రభుత్వం సహకార సంఘాలకు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు నిధుల మంజూరు ప్రకటనలకే పరిమితమైందని ఎమ్మెల్యే విమర్శించారు. దేశంలో కంప్యూటరీకరణ జరిగిన సహకార సంఘాలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని, దేశానికే తెలంగాణ సహకార సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ ఆధునీకరణ కోసం సహకార సంఘాలు మరింత చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, పిఎసిఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కాంగ్రెస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్,ఉన్నారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

### కెజిబివిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల :** హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం కిచెన్ ఆవరణ, ఫ్రీజర్, సరుకులు తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే కంప్లైంట్స్ బాక్స్ పరిశీలించి ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. కంప్లైంట్స్ బాక్స్‌లో వచ్చే ఫిర్యాదులపై స్పందించాలని ఆయా సమస్యలు రాకుండా ముందస్తుగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**రీ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష : రెవెన్యూ శాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్**

భూ రీ సర్వే మొదటి దశను వేగవంతం చేసి ఎంపిక చేసిన గ్రామాల్లో త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్ ఆదేశించారు. భూ రీ సర్వే పనుల పురోగతిపై రెవెన్యూ శాఖ కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్‌తో కలిసి హాజరయ్యారు.

**నిబంధనలకు అనుగుణంగా రీ సర్వే**

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రీ సర్వేపై అటవీ శాఖ, నీటి పారుదల శాఖ, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డిఒలు శ్రీధర్ బాబు, కెఎస్‌బి కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## సైనికుడిపై దాడి

### 14 మంది అరెస్ట్




**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్‌లో ఆర్మీ సైనికుడు తిగుర్ల స్వామిపై దాడి చేసిన ఘటనలో 14 మంది నిందితులను పోలీస్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి నట్లు మెట్‌పల్లి సిఐ సురేష్ బాబు, ఎస్ఐ జి. నవీన్ కుమారులు పేర్కొన్నారు. సిఐ సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి నవీ న్ కుమార్ సిఐ కార్యాలయంలో వెల్లడించిన వివరాల మేరకు ఈ నెల 22న రాత్రి వెల్లుల్ల గ్రామానికి చెందిన వన్నెల వికాస్‌పై దాడి జరిగిందనే కారణంతో అతని స్నేహితులు సుమారు 30 మంది ద్విచక్ర వాహనాలపై బండలింగాపూర్‌కు వెళ్లారు .ఈ క్రమంలో ఈనెల 23 శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో హనుమాన్ ఆలయం సమీపంలో బతుకమ్మ ఆడుతున్న వారి పక్కనుంచి వేగంగా వెళ్తున్న వారిని సైనికుడు తిగుర్ల స్వామి ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగి, ఆయనపై దాడి చేశారు. స్టీల్ కడియంతో ముఖంపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డ స్వామి అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం మేడిపల్లి గ్రామ శివారులో 14 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, 14 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు, ఒక స్టీల్ కడియాన్ని స్వాధీనం చేసుకోగ,ఈ ఘటనలో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు.

## యువతకు ఉపయోగపడే కార్యక్రమాలకు ప్రాధాన్యత

### కలెక్టర్ కోయ శ్రీహర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలో యువతకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను వెలుగులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం,సైన్యం, పారామిలిటరీ దళాల్లో ఉద్యోగాలు సాధించేందుకు అభ్యర్థులకు అవసరమైన సన్నద్ధత కల్పించడం, జిల్లాలోని చారిత్రక ప్రదేశాల విశిష్టతను ప్రజలకు తెలియజేయడం వంటి లక్ష్యాలతో చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని (ఐడిఒసి) తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అగ్నివీర్, ఎస్ఎస్‌సి జిడి అభ్యర్థుల కోసం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం, 'మన జిల్లా – మన ఖిల్లా' కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న సీతమ్మ లోద్ది ట్రెక్కింగ్‌కు సంబంధించిన రెండు పోస్టర్లను ఆవిష్కరించారు.

**అగ్నివీర్,ఎస్ఎస్‌సి జిడి అభ్యర్థులకు ఉచిత వైద్య శిబిరం:** అగ్నివీర్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో, నవంబర్ 12 నుంచి ప్రారంభం కానున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఎస్ఎస్‌సి జిడి అభ్యర్థులకు ప్రయోజనం కల్పించేలా యువశక్తి – పెద్దపల్లి ఆధ్వర్యంలో అక్టోబర్ 31న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు.పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ ఉచిత వైద్య శి బిరాన్ని నిర్వహించనున్నట్లు, శిబిరంలో పాల్గొనదలచిన అభ్యర్థులు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాల కోసం 7780543055, 9182691655 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

**నవంబర్ 1న సీతమ్మలోద్ది ట్రెక్కింగ్ :** జిల్లాలోని చారిత్రక, ప్రకృతి ప్రదేశాల విశిష్టతను ప్రజలకు పరిచయం చేయడంతో పాటు యువతలో ఫిట్‌నెస్, పర్యావరణ పరిరక్షణపై ఆసక్తిని పెంపొందించేందుకు "మన జిల్లా – మన ఖిల్లా" కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న సీతమ్మలోద్ది ప్రాంతంలో ట్రెక్కింగ్ నిర్వహించనున్నారు.

**మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతలో చైతన్యం :** సీతమ్మలోద్ది ట్రెక్కింగ్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించనున్నారు. "ఎస్ ఫర్ లైఫ్ – సే నో టు డ్రగ్స్" నినాదంతో యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నిర్వాహకులు పిలుపునిస్తున్నారు.ఈ కార్యక్రమంలో డిఎంఒ ప్రవీణ్ రెడ్డి,మాజీ సైనికుడు,అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి,ఫొటోగ్రాఫర్లు రవీందర్ రెడ్డి,శీలం అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## పోలీసింగ్ వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలి: సిపి గౌష్ ఆలం



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వార్షిక తనిఖీ ల్లో భాగంగా శనివారం సందర్శించారు. స్టేషన్‌కు విచ్చేసిన కమిషనర్‌కు హు జురాబాద్ ఎసిపి మాధవి, ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ పూలమొక్కను అందజేసి సాదర స్వా గతం పలికారు. అనంతరం సాయుధ బలగాల గౌరవ వందనాన్ని సిపి స్వీకరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌లోని పలు విభాగాలను, రికార్డులను కమిషనర్ సమగ్రంగా పరిశీలించారు. సిబ్బంది వారి విధులు, క్షేత్రస్థాయి పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, కేస్ ప్రాపర్టీ భద్రత, రికార్డుల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలమకమని పేర్కొంటూ స్టేషన్ పరిధిలోని అన్ని నిఘా కెమెరాలు నిరంతరం పని చేసేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి ఒక్కరు బాధ్యాతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎసిపి మాధవి, ఇన్స్‌పెక్టర్ కరుణాకర్, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కాపూర్ సూర్య అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 41వ డివిజన్లో కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన మంచినీటి సమస్యకు శనివారం రోజున శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తూ శిశు మందిర్ మెయిన్ లైన్ నుండి వెనుక లైన్‌లోకి ఇంటర్ లింకు ద్వారా నూతన మున్సిపల్ పైప్‌లైన్ చేయడానికి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య హాజరై మాట్లాడుతూ 41వ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల వాగ్దానాలు చేయడమే కాకుండా ఎన్నికల అనంతరం ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, డివిజన్లో ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే శక్తి వంచన లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బస్తీ పెద్దలు కొండపర్తి సంజీవ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, పల్లే ఐలయ్య, ఆనందం, పరశురాములు,వెంకన్న, కొమురయ్య, వంశీ మున్సిపల్ లైన్‌మెన్ సమ్మయ్య, పాల్గొన్నారు.

## భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/కరీంనగర్:** నూతనంగా నిర్మించిన వరంగల్ – కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 563)పై ప్రయాణికుల భద్రత, ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన హైవే పెట్రోలింగ్ యూనిట్, టోల్ ప్లాజా అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ అమర్చిన సిసికెమెరాల పనితీరు, నిఘా వ్యవస్థ, కంట్రోల్ రూమ్ ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షించే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారిపై ఏవైనా రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సమాచారం అందుకునే వ్యవస్థ కంట్రోల్ రూమ్ నుంచి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకునే విధానం, బాధితులకు వేగంగా వైద్య సహాయం అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే క్షతగాత్రులను కాపాడేందుకు 'గోల్డెన్ అవర్'లో తక్షణమే స్పందించి, ఆసుపత్రులకు తరలించే సమన్వయ వ్యవస్థ పక్కాగా ఉండాలన్నారు. సిసి కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షిస్తూ, మితిమీరిన వేగం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నిఘా ఉంచాలని సూచించారు.హైవేపై ప్రయాణించే వాహనదారులు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో హుజురాబాద్ ఎసిపి మాధవి, రూరల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, కేశవపట్నం ఎస్ఐ శేఖర్ హైవే అథారిటీ ప్రతినిధులు, టోల్ గేట్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో 'ఆల్ఫోర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ '

### నైపుణ్య విద్యకు పెద్దపీట వేయాలి

### ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** వచ్చే ఏడాది నుంచి ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించబోతున్నట్లు ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి వెల్లడించారు. భారతీయ విద్యా వ్యవస్థ అకాడమిక్స్ పరంగా ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నప్పటికీ, నైపుణ్య (స్కిల్) ఆధారిత విద్యలో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈనెల17 నుంచి 22 వరకు పశ్చిమ ఆస్ట్రేలియాలో పర్యటించి, పలు యూనివర్సిటీలు, పాఠశాలలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. కరీంనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 12 మంది ఎడ్యుకేషన్ లీడర్లతో కలిసి అక్కడి విద్యా విధానం, కరిక్యులం, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు తెలిపారు.

**ఒకేషనల్, టెక్నికల్ విద్యపై దృష్టి అవసరం**

మన దేశంలో విద్య కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, డాక్టర్లను తయారు చేసే దిశగానే సాగుతోందని, దీనివల్ల అందరూ ఆ స్థాయికి చేరలేక నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, టెక్నికల్, ఒకేషనల్, స్కిల్ బేస్డ్ కోర్సుల్లో వెనుకబడిపోతున్నామన్నారు. చిన్నపాటి సాంకేతిక పనులకు సైతం ఇతరులపై ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆస్ట్రేలియాలో మాత్రం బైపిసి, ఎంపిసిలతో పాటు సిఇసి, ఎంఇసి, వెటర్నరీ, ఆర్ట్స్, మ్యూజిక్, స్పోర్ట్స్ తదితర అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, అక్కడ విద్యార్థుల్లో ఎలాంటి ఒత్తిడి కనిపించదని పేర్కొన్నారు.

**పాఠశాల స్థాయిలో ఒకే విద్యా విధానం**

అక్కడ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం అమల్లో ఉందని, మధ్యలో బోర్డు పరీక్షల ఒత్తిడి లేకుండా ఇంటర్నల్ ఎగ్జామ్స్‌కు 50 శాతం మార్కులు కేటాయిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూనియర్ కళాశాలను పాఠశాల స్థాయిలో విలీనం చేసే అంశంపై స్పష్టతనిచ్చిన నేపథ్యంలో, ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే 8వ తరగతి నుంచే విద్యార్థులకు నచ్చిన సబ్జెక్టులు (బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, అగ్రికల్చర్ సైన్స్, స్పోర్ట్స్) ఎంచుకునే స్వేచ్ఛ ఉందని వివరించారు. మైనర్ పిల్లల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని అక్కడ చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారని చెప్పారు.

**ఆల్ఫోర్స్‌లో ఇంటర్నేషనల్ కరిక్యులం**

తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల్లో త్వరలో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్లు నరేందర్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆమోద ప్రక్రియ తుది దశకు చేరిందని, రాబోయే విద్యా సంవత్సరంలో నర్సరీ నుంచి రెండో తరగతి వరకు ఈ కరిక్యులంతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. విద్యాసంస్థల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిజిటల్ బోర్డులు, లేబరేటరీలను మరింత ఆధునీకరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు వాహనాలకు నిలయంగా బస్టాండ్!



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ప్రజాప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పాఠకులకందరికి విధితమే కానీ రద్దీ బస్సుతో రాజన్నసిరిసిల్లా లోని ఎల్లారెడ్డిపేట మండలంలోని బస్టాండ్ వద్ద ప్రయాణీకులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. నో పార్కింగ్ ఉన్నచోటే ద్విచక్ర,నాలుగు చక్రాల వాహనాలు కార్లు, ఆటోలు సైతం ప్రయాణీకులను ఆశ్రయించాల్సి వస్తోంది. బస్సులు నిలుపు స్థలం వద్ద మరో బస్సు రాలేని ఇరుకుగా ఉన్న బస్టాండ్ విస్తరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఇష్టానుసారంగా మలుపులతో ప్రయాణీకులు ఇబ్బంది పడవలసిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రేంగన్నావాడీలో పారిశుద్ధ్య పనులు పూర్తి




**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని మారుమూల బోందిడి గ్రామ పంచాయతీ పరిధిలోని రేంగన్నావాడీ గ్రామంలో నెలకొన్న తీవ్ర అపరిశుభ్రత, తాగు నీటి సమస్యలపై ప్రజాపక్షం దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు. ఎంపిడిఓ గంగాసాగర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పూడిక పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్న మురికి కాలువలను సిబ్బందితో శుభ్రం చేయించారు. అలాగే తాగునీటి బావుల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి శానిటైజేషన్ చేసి తాగునీటి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపారు. ప్రజాపక్షం పత్రిక ద్వారా తమ గ్రామం సమస్యలను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన పత్రికా యాజమాన్యానికి, వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న మండల అధికారులకు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గిరిజనుల కుల ధ్రువీకరణ సమస్య పరిష్కరించాలి :ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా గిరిజన కుల ధ్రువీకరణ పత్రాల సమస్యల పరిష్కారంపై హైదరాబాద్ సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై సర్టిఫికెట్లు రాక గిరిజన విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా, డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్, వేణుగోపాలచారి, రాములు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా భూ సర్వే పనులు

అదనపు కలెక్టర్ డేవిడ్



**ప్రజాపక్షం/కౌటాల:** మండలంలోని చందారం శివారులో జరుగుతున్న భూ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అధికారులను ఆదేశించారు. శనివారం చందారం శివారులోని భూములను ఆయన పరిశీలించారు.భూముల హద్దులు, మ్యాప్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే పనుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఏళ్లుగా ఉన్న హద్దుల వివాదాల పరిష్కారానికి రీసర్వే ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. అధికారులు సర్వే ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా పూర్తి జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడి వినయ్ కుమార్, భూ భారతి జిల్లా కోఆర్డినేటర్ రాము, తహసీల్దార్ ప్రమోద్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నేడు చేయూత పింఛన్ల పంపిణీ

**ప్రజాపక్షం/మంచిర్యాల:** ఆరవ డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు ఆదివారం చేయూత పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్ మేకల దాసు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 4:30 గంటలకు కటిక దుకాణం సమీపంలోని జయ మెడికల్ వద్ద గల గణేష్ మండపం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆరవ డివిజన్ పరిధిలోని చేయూత పింఛన్ లబ్ధిదారులు నిర్ణీత సమయానికి హాజరై తమ పింఛన్లు తీసుకోవాలని కోరారు.

## ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి :ఎంపిడిఓ రమేష్



**ప్రజాపక్షం/బోథ్ :** ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఇళ్లల్లో వాడిన నీటిని వృధాగా పోనీయకుండా ఇంకుడు గుంతలోకి మళ్లించి భూగర్భజలాలను పెంపొందించడం ద్వారా రాబోయే రోజుల్లో నీటి ఎద్దడిని తట్టుకునే అవకాశం ఉందని ప్రజలకు సూచించడం జరిగింది. బోథ్ పట్టణంలోని వాటర్ ప్లాంట్‌ల దగ్గర సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలని యజమానులకు సూచించడం జరిగింది.ఎల్ నినో పరిస్థితుల దృశ ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని పొదుపుగా వాడుకుంటూ, వాడిన నీటిని వృధాగా పోనీయకుండా ఇంకుడు గుంతలోకి మళ్లించాలని సూచించడం జరిగింది.ఈ విధంగా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఇంకుడు గుంతలనిర్మాణంలోపాలుపంచుకుంటే రాబోయే రోజుల్లో నీటి ఎద్దడినిసమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.అలాగే ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన కుటుంబానికి 6500 రూపాయలను ప్రభుత్వం ప్రతీ వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణానికి అందిస్తుందని తెలిపారు.ఎంపి రాజ్ కుమార్,మిషన్ భగీరథ ఎఈ కళ్యాణ్ చక్రవర్తి,ఎపిఓ జగదేరావు,ఈసి మధుకర్,నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## అటవీ విస్తీర్ణం పెంపు, స్మగ్లింగ్ అరికట్టడమే లక్ష్యం

కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్:** అటవీ విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అటవీ భూములు ఆక్రమణకు గురికాకుండా కఠిన నిఘా ఏర్పాటు చేయాలని, అటవీ సరిహద్దులను జియో ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. పోడు భూముల సమస్యల పరిష్కారంతోపాటు అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట నియంత్రణకు అటవీ, పోలీసు శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ తెలిపారు.డిఆర్ఓ రాజేశ్వర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, డిఎస్పి ప్రసన్న కుమార్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

రూ.2 వేల కోట్లతో ఆలయాలు, ఘాట్ల అభివృద్ధి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/మంచిర్యాల:** గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ అభివృద్ధి పనులను, కాలేజ్ రోడ్డులోని గోదావరి తీరంలో పుష్కర ఘాట్ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్కరాల్లో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.2 వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పుష్కర ఘాట్లు, ప్రధాన దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బాసర ఆలయానికి రూ.354 కోట్లు, భద్రాచలానికి రూ.276 కోట్లు, కాళేశ్వరానికి రూ.198 కోట్లు, మంచిర్యాల జిల్లాలోని గూడెం గుట్ట ఆలయానికి రూ.58 కోట్లు, ధర్మపురి క్షేత్రానికి రూ.10 కోట్లు కేటాయించామన్నారు. ఆలయాల్లో ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి తీరంలోని 67 ఘాట్లకు సుమారు 5 నుంచి 6 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా టెంట్ సిటీలు, పార్కింగ్, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న పుష్కరాలకు ప్రభుత్వం పూర్తి స్థా యిలో సన్నద్ధమవుతోందని పేర్కొన్నారు. చెన్నూర్ పట్టణంలోని గోదావరి తీరంలో జరుగుతున్న ఘాట్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాజస్వ మండల అధికారి శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, తహసీల్దార్లు రఫతుల్లా, మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్, మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, దేవాదాయ అధికారి రవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అజ్మత్ అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐడి బాండ్ల వెరిఫికేషన్ సెంటర్ ఏర్పాటు, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పశ్య పద్మ డిమాండ్



**ప్రజాపక్షం/మంచిర్యాల:** అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శనివారం మంచిర్యాలలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 32 లక్షల మంది బాధితులు రూ.6 వేల కోట్లకు పైగా డిపాజిట్లు చేసి మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ మూసివేతతో ఎంతోమంది ఖాతాదారులు, ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆకుటుంబాలను ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో సిఐడి ద్వారా ఏడు బాండ్ల వెరిఫికేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, తెలంగాణలో సుమారు 3 లక్షల మంది బాధితులు ఉన్నప్పటికీ కేవలం హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో మాత్రమే కేంద్రాలు తెరిచారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పరిధిలో దాదాపు 80 వేల మంది బాధితులు ఉన్నందున మంచిర్యాల జిల్లా కేంద్రంలో సిఐడి వెరిఫికేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రామడుగు లక్ష్మణ్, అధ్యక్షుడిగా ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాస్, ఉపాధ్యక్షుడిగా తిరుపతి రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.రామారావు, సహాయ కార్యదర్శిగా జీవన్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కిషన్, ఎల్.విజయ, ఎం.శశికళ, ఎ.చంద్రకళ, పి.జంగు ఎన్నికయ్యారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న పాల్గొన్నారు.

## 'విబి—జి. రామ్ జీ' పథకాన్ని జాబ్ కార్డుదారు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**ప్రజా పక్షం/ఖానాపూర్ :** విబిజి రామ్ జీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉపాధి పనులు పొందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలం కొండుకూరు గ్రామంలోని ఎస్కే ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జోన్1 స్థాయి విబిజి రామ్ జీ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం పంటల దిగుబడి తగ్గడం,వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితులు నెలకొన్నాయని,ఇలాంటి సమయంలో ఈ పథకం గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందుకే జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజుల పని దినాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పథకం కింద చేపట్టే పనులకు కూలీ డబ్బులు సకాలంలో,ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామాల్లో నీటి సంరక్షణ,జలవనరుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ వంటి పనులను చేపట్టడం ద్వారా ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు.డిఆర్‌డిఓ విజయలక్ష్మి ,డిపిఓ శ్రీనివాస్,ఇంజినీరింగ్ అధికారులు సందీప్, తుకారాం, అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

## మెనూకు తూట్లు.. అన్నం, పప్పుతోనే సరి!



**ప్రజాపక్షం/వాంకిడి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు నిర్దేశించిన రోజువారీ మెనూ అమలు తీరుపై క్షేత్రస్థాయి లో తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాంకిడి మండలంలోని ఖిరిడి ఎంపిపిఎస్ పాఠశాలలో నిబంధనల ప్రకారం భోజనం అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు వెజిటేబుల్ బిర్యానీ అందించాల్సి ఉండగా, కేవలం తెల్ల అన్నం, పప్పు మాత్రమే వడ్డించారు. నాణ్యమైన భోజనం అం దించాల్సిన బాధ్యత యాజమాన్యం, పర్యవేక్షణ అధికారులపై ఉందని స్పష్టం చేస్తున్నారు. ఖిరిడి ఎంపిపిఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. భోజన నాణ్యతపై విచారణ జరపాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'ప్రజాపక్షం' ముమ్మాటికీ ప్రజల పక్షమే

సిపిఐ కార్యదర్శి సుధాకర్,



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాపక్షం ముమ్మాటికి ప్రజల పక్షమే అని, ప్రజల, పాఠకుల ఆరాభిమానాలను చూరగొందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా గొంతుకై కథనాలు ప్రచురిస్తూ అందరి పాఠకుల అభిమానాలను స్వంతం చేసుకుందని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పంచరెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్‌లు అన్నారు. 8వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు జర్నలిస్టులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.ప్రజాపక్షంలో వచ్చిన వార్తలు కథనాలు ఎంతో ఆదరణ పొందాయన్నారు. రానున్న కాలంలో దినదినాభివృద్ధి చెంది ప్రజలకు ఉపయోగపడే మరెన్నో వార్తలు కథనాలు ప్రచురించాలన్నారు.

# వైద్యపరమైన రికార్డులు జాగ్రత్తగా భద్రపర్చాలి

అర్థమయ్యే రీతిలో ప్రిస్క్రిప్షన్ ఉండాలి

జిల్లా జడ్జి జివిఎన్.భారతలక్ష్మీ




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారు వైద్యపరమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ వాటిని జాగ్రత్తగా భద్రపర్చాలని జిల్లా జడ్జి జివిఎన్.భారతలక్ష్మి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు వైద్యరంగ నిపుణులకు వివిధ అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి ముఖ్యఅతిథిగా విచ్చేయగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు డిసిపి శుభం నగ్రాలే తదితరులు పాల్గొన్నారు. వైద్యుల హక్కులు, వైద్య సేవల్లో చట్టపరమైన బాధ్యతలపై జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర వక్తలు ముఖ్య సూచనలు చేశారు. హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం 2025 వైద్య రికార్డుల నిర్వహణ, వాటి చట్టపరమైన ప్రాముఖ్యత, న్యాయపరమైన విచారణలో వాటి ప్రామాణికత తదితర అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. వైద్య సేవలందించే సమయంలో చట్టపరమైన నిబంధనలు పాటించడం, వైద్య రికార్డులను సక్రమంగా నిర్వహించటం, వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించటంతో వైద్యులు, రోగుల హక్కులను పరిరక్షించటంతో పాటు న్యాయ ప్రక్రియకు సహకారమందించిన వారవుతారని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. న్యాయ వ్యవస్థలో వైద్యులు భాగస్వాములుగా వ్యవహరించాల్సిన ప్రాముఖ్యతపై తెలిపారు. అదనపు జిల్లా న్యాయమూర్తి నారాయణ, అదనపు జిల్లా జడ్జి దుర్గాప్రసాద్, కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమా, ట్రేనీ కలెక్టర్ సురేష్, బార్ అసోసియేషన్ ప్ర ధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిని రాజశ్రీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ విశాల్, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, రాష్ట్ర వైద్యమండలి జిల్లా ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ రాథోడ్,రాజ్‌కుమార్ సుబేదార్, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ఎల్ నినో.. పరిస్థితులను ఎదుర్కోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం లోటు ఏర్పడి కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా వ్యవహరించనుండగా జిల్లా వ్యవసాయాధికారిని మెంబర్ కన్వీనర్‌గా, సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నీటిపారుదల శాఖ జిల్లా అధికారి, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎన్‌పిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి, జిల్లా వైద్యాధికారి, జిల్లా పంచాయతీ అధికారి, తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమీషనర్లు కమిటీ సభ్యులుగా ఉన్నారు. కరువు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించటం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించటం, కరువు నివారణ ప్రణాళిక అమలు తీరును నిశితంగా పరిశీలించటం తదితర బాధ్యతలను ఈ కమిటీ నిర్వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

# వెట్టిచాకిరి నిర్మూలనకు సమష్టి కృషి

'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ ప్రతిమా సింగ్




**ప్రజాపక్షం/మెదక్:** వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. కార్మికులకు బలవంతపు శ్రమ నుంచి విముక్తి కల్పించడంతోపాటు, వారి హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కార్మిక శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంస్థ సంయుక్తంగా వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.వెట్టిచాకిరి,బలవంతపు శ్రమకు గురవుతున్న కార్మికులను గుర్తించి, వారికి విముక్తి కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపక కేంద్రాలు, గనులు, రాతి క్వారీలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇతర అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు ఈ ప్రచార వాహనం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వెట్టిచాకిరి బాధితులు లేదా అలాంటి పరిస్థితులను గుర్తించిన ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 08069434343 కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం వెట్టిచాకిరి నిర్మూలనపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ప్రత్యేక కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు సత్యేంద్ర ప్రసాద్, తిరుపతి, సయ్యద్ కౌముద్దీన్, సిడబ్ల్యూసి చైర్మన్ ఉప్పలయ్య, మెదక్ సిఐ రాజశేఖర్, నాగరాజు, కలెక్టరేట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు నేటి నుంచి శిక్షణ

కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని తెలంగాణ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల (టిజిఆర్ఎస్,జెసి)లో స్కౌట్ మాస్టర్లు ,గైడ్ కెప్టెన్లకు రాష్ట్ర స్థాయ శిక్షణాధికారులచే ఈ నెల 25 నుండి బెసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి. మాదవరెడ్డి తెలిపారు. మొదటి విడత శిక్షణ శిభిరం అక్టోబర్ 25 నుంచి 31 వరకు రెండవ విడత శిక్షణ శిభిరం నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి రెండవ విడతలలో వివిధ జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు గైడ్ కెప్టెన్లు పాల్గొనన్నుట్లు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ,జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ అడిషనల్ ఎస్‌పి చైతన్య రెడ్డి అదనపు కలెక్టర్ పాండు బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెజరర్ సుందర్ రావు, జిల్లా కార్యదర్శిమాదవ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శోభ, జిల్లా ఆర్గనైజింగ్ కమీషనర్లు చంద్రశేఖర్ గౌడ్, వందన పాల్గొన్నారు.

## 'సిపిఐ' పునర్నిర్మాణానికి ఎస్ విలాస్ పిలుపు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** బోథ్ నియోజకవర్గానికి చెందిన తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం తాంసిలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కన్వీనర్ ఎస్ విలాస్ మాట్లాడుతూ డిసెంబర్ 26 పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి సభ్యత్వ నమోదు పూర్తి చేసి మండల, జిల్లా కమిటీల పునర్నిర్మాణానికి సిద్ధం కావాలని కోరారు. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిర్ర దేవేందర్, దేవిదాస్, అర్ధంగి రమేష్ పాల్గొన్నారు.



## సైబర్ నేరాల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో పోలీస్ అధికారులు తక్షణమే స్పందించాలని ఎస్‌పి రోహిత్‌రాజ్ అన్నారు. శనివారం సైబర్ వారియర్స్ సమావేశంలో భాగంగా పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సైబర్ నేరాల బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని తెలిపారు. సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సైబర్ వారియర్స్ తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పెండింగ్ ఫిర్యాదులు కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌పి సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ సిఐ నరేష్, ఎస్ఐ జుబేదా బేగం, డిఫోర్స్ సిబ్బంది, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ ఆరోగ్య సూత్రాలు వివరించాలి: డిఎంహెచ్ఒ

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా పని చేసే సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆరోగ్యసూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డా.తుకారామ్ అన్నారు. శనివారం పాల్వంచ డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లతో గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికీ తప్పనిసరిగా ఆర్‌డిటి లేదా మైక్రోస్కోపీ ద్వారా మలేరియా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత మాసానికి సంబంధించిన అన్ని రోగ నిరోధక టీకాల కార్యక్రమాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. మీజిల్స్, రూబెల్లా టీకాల కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని టీకాలు తీసుకోకుండా మిగిలిపోయిన పిల్లలు మధ్యలోటీకాలు ఆపివేసిన పిల్లలను గుర్తించి వారికి టీకాలు అందేలా చూడాలన్నారు. 24న జ రిగే ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటిసిఒ డా.ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీధర్, పిఒడిటి డా. రామ్‌దాస్, ఎఎంఒ రాందాస్ తదితరులున్నారు.

## విద్యార్థులు కెటిపిఎస్, కిన్నెరసాని సందర్శన




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని పిఎంశ్రీ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు పారిశ్రామిక, పర్యావరణ విజ్ఞాన యాత్రలో భాగంగా పాల్వంచ కెటిపిఎస్, కిన్నెరసాని ప్రాంతాలను సందర్శించారు. శనివారం పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు కెటిపిఎస్‌లోని ఒ అండ్ పి విభాగాన్ని, కిన్నెరసాని డ్యామ్‌తో పాటు అక్కడి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కెటిపిఎస్ సిబ్బంది విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను, అందులో ఉపయోగించే సాంకేతిక పరికరాలు, ఉత్పత్తి జరిగే విధానాన్ని విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కిన్నెరసాని డ్యామ్‌తో పాటు పరిసర అటవీ ప్రాంతాన్ని విద్యార్థులు సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఆహ్లాదకర వాతావరణంలో సందడిగా గడిపారు. జలవనరుల ప్రాముఖ్యత, అటవీ సంపద విలువ, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ఈ యాత్రలో ప్రత్యక్షంగా విద్యార్థులు తెలుసుకున్నారు. పుస్తకాల్లో చదువుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించే అవకాశం లభించడంతో విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి క్షేత్ర సందర్శన విద్యార్థుల్లో శాస్త్రీయ ధృక్పథం, పర్యావరణ స్పృహ పెంపొందుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. యాత్రకు సహకరించిన కెటిపిఎస్ సిబ్బందికి, అటవీ శాఖ సిబ్బందికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముందస్తు నిర్ధారణతోనే అసంక్రమిత వ్యాధులకు అడ్డుకట్ట

డిఎంహెచ్ఒ డాక్టర్ రామారావు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** అసంక్రమిత వ్యాధులను ముందస్తుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయాన్ని నివారించి సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు అన్నారు. బిపి, మధుమేహం, వివిధ రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం నగరంలోని ఐడిఒసి ప్రాంగణంలో ఉన్న ప్రజ్ఞ సమావేశ మందిరంలో శనివారం ఎన్‌సిడి(అసంక్రమిత వ్యాధులు) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. హైదరాబాద్ సిహెచ్‌ఎఫ్‌డబ్ల్యు కార్యాలయానికి చెందిన రాష్ట్ర ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ కరుణశ్రీ, డబ్ల్యూహెచ్ఒ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ రామారావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యాధుల లక్షణాలు తీవ్రరూపం దాల్చే వరకు వేచి చూడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కరుణశ్రీ, డబ్ల్యూహెచ్ఒ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్‌సిడి స్క్రీనింగ్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పరీక్షల నిర్వహణ, రికార్డుల నమోదు, మందుల పంపిణీ, రోగుల నిరంతర పర్యవేక్షణ పక్కాగా చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణాదేవి, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వివిధ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యతతో పనులు చేపట్టాలి

విద్యుత్‌ను అక్రమంగా వినియోగించొద్దు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'సుడా' నిధులు రూ. 1.30కోట్లతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి రెండు మూడు వారాలకు ఒకసారి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. ఎవరు అక్రమంగా విద్యుత్‌ను వినియోగించకూడదన్నారు. వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికీ నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేందుకు విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రాలు కూడా అందించాలన్నారు. కాలనీలో నివసించే వారు నిబంధనల ప్రకారం విద్యుత్ సేవలను వినియోగించుకోవాలన్నారు. 2023లో మంజూరైన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తిం చి వాటిని సాధ్యమైనంత త్వ రగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం కార్పొరేషన్ క మిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ మా జీ చైర్మన్ రాధాకిషోర్, మాజీ కార్పొరేటర్లు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, చంద్రం, శ్రావణ్, నాయకులు పాల్గొన్నారు

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం

సిపి సునీల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే ప్రాణదానంతో సమానమని పోలీసు కమిషన్ సునీల్‌దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో సిపి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశరక్షణ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమన్నారు. వారి త్యాగాలు స్మరించుకుంటూ సేవకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అత్యవసర సమయంలో రక్తం అందక ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తం దానం చేసేందుకు ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 150 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని వారిని ఈ సందర్భంగా సిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి భోజా రామానుజం, ఎఆర్ డిసిపి కుమారస్వామి, టౌన్ ఎసిపి ఎస్ వెంకటరమణమూర్తి, ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాసులు, ఎఆర్ ఎసిపిలు సునీల్‌సింగ్, నర్సయ్య, డాక్టర్ కార్తిక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు, సిఐలు షాదీక్ పాషా, రామకృష్ణ, చిట్టిబాబు, నాగరాజు, కరుణాకర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'మెప్మా' వేతనాలు చెల్లించకపోతే ఆందోళన తప్పదు: ఎఐటియుసి



**ప్రజాపక్షం/కల్లూరు:** మెప్మా రిసోర్స్ పర్సన్ లకు గత మూడు నెలలుగా వేతనాలు అందక అష్ట కష్టాలు పడుతున్నామని, ప్రభుత్వం చెల్లించినా కూడా ఖాతాలలో జమ కానందున మెప్మా ఆర్‌పిల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్‌కు ఎఐటియుసి ఆధ్వర్యంలో లేఖ ఇచ్చారు. జిల్లా అధికారులు చెక్కు తప్పుడు అక్షరాలతో రాయడం వలన వేతనాలు జమ కాలేదని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వేము రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, మహిళా సంఘం నాయకురాలు బేగం.. కమిషనర్ సాయి కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కమిషనర్ వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించి వేతనాలు ఖాతాలలో జమ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లేనిచో సోమవారం ఆందోళన చేస్తామని ఎఐటియుసి నాయకులు హెచ్చరించారు.

# విద్యారంగానికి 20 శాతం నిధులివ్వాలి

సాదిక్ ఫౌండేషన్ ప్రతినిధి సాదిక్ అలీ




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవి నుండి వైదొలగాలని, విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 శాతం నిధులను కేటాయించాలని సాదిక్ ఫౌండేషన్ ప్రతినిధి సాదిక్ అలీ డిమాండ్ చేశారు. తెలంగాణవ్యాప్తంగా సాదిక్ ఫౌండేషన్ చేపట్టిన ప్రజాయాత్ర శనివారం భద్రాద్రి కొత్తగూడెం కేంద్రానికి చేరుకున్న సందర్భంగా ఎఐఎస్ఎఫ్ ఘన స్వాగతం పలికింది. అనంతరం సాదిక ఫౌండేషన్ , ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, విద్యారంగ సమస్యలపై విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సాదిక్ అలీ మాట్లాడుతూ దేశంలో ఓటుహక్కు పరిరక్షణ అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను తొలగించారన్న ఆరోపణలపై పారదర్శకంగా దర్యాప్తు జరపాలని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించడంలో ఇసి విఫలమైందన్నారు. విద్యకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో 20శాతం నిధులను కేటాయించాలని, నిధుల సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. షాదిక్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ దేశ ప్రజాస్వామ్య మనుగడ ఓటు హక్కు పరిరక్షణతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అవకతవకలపై ఎన్నికల సంఘం జవాబుదారీతో వ్యవహరించాలన్నారు. జిల్లా కార్యదర్శి అజిత్ మాట్లాడుతూ ఢిల్లీ జరుగుతున్న నిరసనలకు సంఘీభావంగా రాష్ట్రంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ఉందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఏసి చైర్మన్ మల్లెల రామనాథం, తెలంగాణ జనసమితి నాయకులు దేవదానం, నభి, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు, కళాబృందం సభ్యులు స్వామి, శ్రీనివాస్, యాకూబ్ పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

టిడిపి జిల్లా అడహాక్ కమిటీ సభ్యుడు కొండబాల కరుణాకర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో ఖమ్మం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అడహాక్ కమిటీ సభ్యుడు కొండబాల కరుణాకర్ తెలిపారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండబాల కరుణాకర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో పాలేరు చెరువులో, వైరా ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా ప్రభుత్వ అసమర్థత వల్ల పంటలు ఎండిపోతున్నాయన్నారు. మంత్రులు ప్రకటనలకే పరిమితం అవుతున్నారన్నారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం రైతాంగానికి కన్నీరు మిగిల్చిందన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు చేతికందే దశలో నీళ్లు లేక ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వం ఎండిపోయిన పంట పొలాలను, ఇతర పంటలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి ఎకరానికి రూ.50వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలు నెలకొన్నాయన్నారు. రైతుల పంటలను కాపాడడంతో పాటు ఖమ్మంజిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు.ఈ సమావేశంలో నాయకులు మల్లెంపాటి అప్పారావు, నాగార్జున శ్రీనివాస్, వాసిరెడ్డి భాస్కర్‌రావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, రాయల కోటేశ్వరరావు, చావా రామారావు, కామినేని శ్రీనివాస్, దామాల శివ పాల్గొన్నారు.

## విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కాంగ్రెస్ వైఫల్యం

యూత్ డిక్లరేషన్ యూస్‌లెస్ డిక్లరేషన్‌గా మారింది

బిఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో విఫలమైందని బిఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం భద్రాచలం హరిత హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు విడుదల కాక విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఫీజుల కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, జాబ్‌క్యాలెండర్, మెగా డిఎస్‌సి, నిరుద్యోగ భృతి హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై యువత ఆశలు నిరాశగా మారాయని పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలపై బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావులపల్లి రామ్‌ప్రసాద్, మానె రామకృష్ణ కోటగిరి ప్రబోద్‌కుమార్ దొడ్డి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఓటు నమోదు కార్యక్రమం

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం– నల్గొండ– వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, తల్లాడ మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ పిలుపునిచ్చారు. సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో శనివారం తల్లాడ మండలంలోని ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కుర్నవల్లి కేంద్ర పరిధిలో ఉన్న గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల ఓట్లను చేర్పించారు. ఈ సందర్భంగా వీలైనంత త్వరగా పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. గడువు సమీపిస్తున్నందున పట్టభద్రుల ఓట్లు ఇంకా త్వరగా నమోదు చేసేవిధంగా కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుర్నవల్లి, బస్వాపురం, కలకొడిమ, కేశవాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

# పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

సిపిఐ నేత సలాం డిమాండ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. అసలే కరువు కాలంలో ఉపాధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలను బతకనివ్వని స్థితికి నెట్టివేస్తున్నాయన్నారు. ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అంటున్నారే తప్ప ఇంత వరకు ఎటువంటి పనులు చేపట్టలేదన్నారు. ఎల్ నినో ప్రభావం గడిచిన రెండు నెలలుగా కనిపిస్తున్నా ఇంత వరకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని సలాం తెలిపారు. ప్రభుత్వం కరువు పాట పాడుతుంటే వ్యాపారులు నిత్యావసరాలను బ్లాక్ మార్కెట్లకు తరలించి ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. తక్షణం రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. బియ్యం ధర కేవలం బ్లాక్ మార్కెట్ కారణంగానే పెరుగుతుందని దీనిని నివారించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ సందర్భంగా త్రీటౌన్‌లో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోలో సిపిఐ నాయకులు భూక్యా రవీందర్, చిర్రా వెంకన్న, లింగయ్య, సురేష్, నక్కా లింగయ్య, జనార్ధన్, కృష్ణ, సాయి, దుర్గారావు పాల్గొన్నారు.

# సహకార సమరం!

కాంగ్రెస్‌లో అంతర్గత లొల్లి

చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల కోసం పోటాపోటీ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఎసిఎస్) పాలకవర్గాల నియామక ప్రక్రియ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత లొల్లి మొదలైంది. పాత, కొత్తతరం నాయకుల మధ్య చైర్మన్ పదవుల కోసం పోటీ నెలకొంది. ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్ చార్జ్ (పిఐసి) కమిటీలను నియమించాలని నిర్ణయించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో ఆధిపత్య పోరు సాగుతుంది. గ్రామీణ ఆర్థిక, రాజకీయ ముఖచిత్రంలో అత్యంత కీలకమైన సొసైటీ చైర్మన్, డైరెక్టర్ల పదవులను దక్కించుకునేందుకు నాయకులు ఎవరికి వారు పోటా పోటీ లాబింగ్ చేస్తున్నారు. సొసైటీలో బాధ్యతలు చేపట్టేందుకు మండల స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకు అధిక సంఖ్యలో ఆశావాహులు తమ ప్రయత్నాలు చేపట్టారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ల పోస్టుల కోసం నేతలు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి క్యాంపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సామాజికవర్గ బలం, పార్టీకి అందించిన సేవలను గుర్తు చేస్తూ పైరవీలను ముమ్మరం చేశారు. పలుచోట్ల సొసైటీ చైర్మన్ పదవి కోసం నలుగురైదుగురు పోటీ పడుతుండడంతో ఎవరి పేరు ఖరారు చేయాలో ప్రజా ప్రతినిధులకు కూడా అర్థం కానీ పరిస్థితి నెలకొంది. సొసైటీ పదవులకు సంబంధించి కాంగ్రెస్‌లో కొత్త, పాత తరం అంటూ విభేధాలు నెలకొంటున్నాయి. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులను ఎదుర్కొని సొంత జేబుల నుంచి ఖర్చు చేసి పార్టీని నిలబెట్టిన పాత కాంగ్రెస్ నేతలు తమకే తొలి ప్రాధాన్యతనివ్వాలని పట్టుబడుతున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారిని గుర్తించాలని కోరుతున్నారు. ఎన్నికల ముందు ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన కొత్త నేతలు కూడా తమకే పదవులు కట్టబెట్టాలని కోరడంతో పదవుల నియామకం మరింత ఇబ్బందికరంగా మారింది. ఖమ్మం నియోజకవర్గ పరిధిలో వి. వెంకటాయపాలెం, మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీలతో పాటు ఆంధ్రాబ్యాంకు సహకార సంఘం ఉంది. ఈ నాలుగు సొసైటీలను విభజించేందుకు ప్రతిపాదనలు కూడా ప్రభుత్వానికి పంపించారు. వి. వెంకటాయపాలెం సొసైటీ పరిధిలో మరో రెండు వేపకుంట్ల, అల్లిపురం, మంచుకొండ సొసైటీ పరిధిలో మరొకటి ఈర్లపుడి సొసైటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అదేవిధంగా సొసైటీని విభజించి నూతనంగా గువ్వలగూడెం, మద్దులపల్లి సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ విభజన పూర్తయితే ఖమ్మం నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు సొసైటీలు అందుబాటులోకి రానున్నాయి. వాటికి పాలక వర్గాలను నామినేటెడ్ పద్ధతిలో నియమించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. ప్రతి సొసైటీ నుంచి నలుగురైదుగురు అభ్యర్థులు చైర్మన్ పదవి కోసం పోటీపడుతుండడంతో వారిని బుజ్జగించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. మరో వారం రోజుల్లో సొసైటీలకు పాలకవర్గాల నియామక ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం. దీనితో ఆశావాహులు ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆశావాహులను బుజ్జగిస్తూ ఇతరత్రా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామంటూ హామీ ఇస్తున్నట్లు సమాచారం.

## 'డిఎల్ఎస్ఎ' మెగా డ్రైవ్ విజయవంతం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గిరిజన కుటుంబాలకు న్యాయ సేవలు చేరువ చేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) చేపట్టిన 60 రోజుల మెగాడ్రైవ్ విజయవంతంగా ముగిసింది. నాల్సా మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి డిఎల్ఎస్ఎ చైర్మన్ ఎం. నాగరాజు ఆధ్వర్యంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి పి. దేవిమానస పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన జనాభా అధికంగా ఉన్న సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేసుకుని క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించారు. 20 మంది పారాలీగల్ వాలంటీర్లు, డిఎల్ఎస్ఎ సిబ్బంది సమన్వయంతో గ్రామస్తులకు అధికారిక ప్రక్రియలపై అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించారు. న్యాయం అంటే కేవలం కోర్టు కేసుల పరిష్కారమే కాదని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతను అందించడం కూడా అందులో భాగమేనని డిఎల్ఎస్ఎ నిరూపించింది. ఈ మెగాడ్రైవ్‌లో 122 మందికి కార్మిక కార్డులను నమోదు చేయించారు. తొమ్మిది కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. 37 మందికి ఆధార్ సవరణలు చేపట్టారు. ఇద్దరు దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో వీల్ చైర్‌లతో పాటు ఒకరికి జైపూర్ ఫుట్ (కృత్రిమ కాలు) అందించారు. నలుగురు లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించారు. 17న జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సూర్యపల్లి నంద చేతుల మీదుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందజేశారు. చట్టపరమైన రక్షణలు, సంక్షేమ ఫలాలను అణగారిన వర్గాల గడపవద్దకు చేర్చడంలో డిఎల్ఎస్ఎ ఖమ్మం యంత్రాంగానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచిందని పలువురు ప్రశంసించారు. 60 రోజుల పాటు నిర్వహించిన ఈ డ్రైవ్ 23న ముగిసినట్లు డిఎల్ఎస్ఎ బాధ్యులు తెలిపారు.

# ఓటర్ల జాబితాపై నిష్పక్షపాత విచారణ జరపాలి

- యుపి ఎమ్మెల్యే ఎన్నికల్లో లోపాలు 'సర్' నిలిపివేయాలని కాంగ్రెస్ డిమాండ్ : బిజెపికి సహాయపడేందుకు పన్నిన ముందస్తు కుట్రకు సాఫ్ట్‌వేర్‌ను ఇసి నిందించొద్దని హితవు



**న్యూఢిల్లీ :** ఉత్తర ప్రదేశ్ శాసన మండలి ఎన్నికల ఓటర్ల జాబితాలో తప్పులు బయటపడిన నేపథ్యంలో, దేశ ఓటర్ల జాబితాలపై నిష్పక్షపాత విచారణ జరపాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని కాంగ్రెస్ శనివారం డిమాండ్ చేసింది. బిజెపికి సహాయపడేందుకు పన్నిన ముందస్తు కుట్రకు సాఫ్ట్‌వేర్‌ను ఎన్నికల సంఘం (ఇసి) నిందించకూడదని, ఇది ఆమోదయోగ్యం కాదని, ఎందుకంటే ఓటర్ల జాబితాల సమగ్రతను సాఫ్ట్‌వేర్ దయాదాక్షిణ్యాలకు వదిలేస్తున్నారని కూడా ఆ పార్టీ పేర్కొంది. బిజెపి, ఇసితో కుమ్మక్కై 2024 సార్వత్రిక ఎన్నికలతో పాటు పలు అసెంబ్లీ ఎన్నికలను దొంగిలించిందని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, బిజెపికి లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో నడుపుతున్న ఈ నకిలీ 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని తమ స్పష్టమైన డిమాండ్ అని పేర్కొంది. 'ఓటర్ల జాబితాపై నిష్పక్షపాత విచారణ జరపాలి, పూర్తి మెషిన్ రీడబుల్ డేటాను బహిరంగపరచాలి, ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కులకు రక్షణ కల్పించాలి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఒక మీడియా నివేదికను పంచుకుంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు. బిజెపికి సహాయం చేయడానికి పన్నిన ముందస్తు కుట్రకు సంబంధించిన నిందను సాఫ్ట్‌వేర్‌పై మోపడానికి జాతీయ ఎన్నికల సంఘం ప్రయత్నిస్తోందని ఇది ఆమోదయోగ్యం కాదని ఆయన అన్నారు. 'రామ్ నే యాదవ్ కో మారా', 'మూర్ఖ్ చంద్ర యాదవ్', 'బి. 'కామ్'— ఉత్తర ప్రదేశ్ శాసన మండలి ఎన్నికల్లోనే ఇలాంటి లోపాలు బయటపడితే, ఇతర ఎన్నికల్లో అవి జరగలేదని ఎలా చెప్పగలరని ఆయన ప్రశ్నించారు. 'భారత ప్రజాస్వామ్య సమగ్రతను, ఓటర్ల జాబితాను పూర్తిగా సాఫ్ట్‌వేర్, ఇసిఐ నెట్ దయాదాక్షిణ్యాలకు వదిలేశారా?, బాధ్యత ఎన్నికల సంఘందే కానీ, సాఫ్ట్‌వేర్‌ది కాదు అని రమేశ్ తన పోస్ట్‌లో స్పష్టం చేశారు. ఎన్నికల అధికారి చేసిన ఈ ప్రకటన, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేవనెత్తిన ప్రశ్నలను, అలాగే ఎన్నికల సంఘం రాజ్యాంగ విరుద్ధంగా నడుస్తోందన్న ప్రతిపక్షాల గట్టి నమ్మకాన్ని బలపరుస్తోంది అని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. గతంలో పిలిభిత్‌లో ఓట్ల దొంగతనం కేసు వెలుగులోకి వచ్చిందని రమేశ్ గుర్తుచేశారు. అక్కడ, మార్పులను సమర్థించడానికి ఎలాంటి ఆధారాలు అందుబాటులో లేనప్పటికీ, ఇసి ఫారం 8 ద్వారా 10,470 మంది ఓటర్ల వివరాలను మార్చారు. నమోదైన ఓటర్లు తమ చిరునామా లేదా పేరు వంటి రికార్డులను నవీకరించమని లేదా మార్చమని ఇసిని అభ్యర్థించడానికి ఫారం 8ను ఉపయోగిస్తారు. మార్చబడిన ఓటర్లలో ఎక్కువ మంది ఒక నిర్దిష్ట వర్గానికి చెందినవారని, ఆ వర్గాన్ని బిజెపి నిరంతరం వేధిస్తోందని ఆయన ఆరోపించారు. 'ఇలాంటి వ్యత్యాసాలు, పోలింగ్ సమయంలో వారి ఓటు హక్కును హరించడానికి జరుగుతున్న కుట్రపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. అంతేకాకుండా, ఎస్ఐఆర్ తర్వాత జారీ చేసిన ఓటర్ల జాబితా నుంచి పేర్లు గల్లంతవడం, ఆన్‌లైన్‌లో ఇపిఐసి నంబర్ల కోసం వెతికినప్పుడు తప్పుడు వివరాలు కనిపించడంపై కూడా ఫిర్యాదులు అందాయి అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. కాంగ్రెస్, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేసిన విధంగా ఎన్నికల సంఘం ఇప్పటివరకు మెషిన్‌రీడబుల్ డేటాను అందించలేదని ఆయన అన్నారు. పూర్తి డేటా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ఓటర్ల జాబితాలోని అవకతవకల పరిధిపైనా, జవాబుదారీతనంపైనా స్పష్టమైన దర్యాప్తు జరపగలం అని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొన్ని నెలలు మాత్రమే మిగిలి ఉన్నాయని గుర్తుచేస్తూ, కొత్తగా వెలుగులోకి వస్తున్న ఈ కేసులు ఓటర్ల హక్కులు, ఎన్నికల పారదర్శకతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రమేశ్ అన్నారు. 'ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడమే తన లక్ష్యమని ప్రకటించిన అదే సర్, దానికి బదులుగా వాటి విశ్వసనీయతపైనే సందేహాలు వ్యక్తం చేశారు. గత లోక్‌సభ ఎన్నికలలోనూ, హర్యానా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలోనూ ఎన్నికల దొంగతనం జరిగిందన్న దేశ ప్రజల అనుమానం ఇప్పుడు దృఢ విశ్వాసంగా మారుతోంది. ఎన్నికలను దొంగిలించడానికి ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బిజెపి గెలిచిందని మేము గట్టిగా నమ్ముతున్నాము' అని రమేశ్ పేర్కొన్నారు.

## ఎవరి శాంతిని కాపాడాలని అడుగుతున్నారు?

శాంతి ఒప్పందంపై సంతకం చేసేందుకు నిరాకరించిన నేహా బోరా



**న్యూఢిల్లీ:** ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ ముందు శాంతి ఒప్పందంపై సంతకం చేయబోనని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరా తెలిపారు. పూచీకత్తుతో రూ. 10,000 వ్యక్తిగత హామీని ఇవ్వాలని ఆదేశిస్తూ పోలీసులు జారీ చేసిన నోటీసును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసిన మరుసటి రోజున ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ నోటీసు వెనుక ఉన్న హేతుబద్ధతను ప్రశ్నిస్తూ, నేను ఎవరి శాంతిని కాపాడాలని అడుగుతున్నారు? అని బోరా ప్రశ్నించారు. బిఎన్ఎస్ఎస్ చట్టంలోని సెక్షన్ 126 కింద అక్టోబర్ 17న జారీ చేసిన పోలీసు నోటీసులో, విచారణ జరిగేంత కాలం శాంతి భద్రతలను కాపేడందుకు పూచీకత్తుతో రూ. 10,000 వ్యక్తిగత హామీ పత్రంపై ఎందుకు సంతకం చేయకూడదో కారణాలు చూపడానికి అక్టోబర్ 19న ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఇఎం) ముందు హాజరు కావాలని ఆ విద్యార్థి నాయకురాలిని కోరారు. ఢిల్లీలోని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్లమెంటరీ కార్యాలయంలో శనివారం బోరా విలేకరులతో మాట్లాడారు. వీధుల్లో శాంతియుతంగా ప్రదర్శనలు చేయడం ప్రజాస్వామ్య హక్కు అని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు వ్యక్తం చేయడాన్ని శాంతికి ముప్పుగా ఎలా పరిగణిస్తారని బోరా ప్రశ్నించారు. మనం ప్రభుత్వాన్ని ఏ ప్రశ్నలూ అడగకపోతే, ఎవరి శాంతిని కాపాడుతున్నాం అని ఆమె ప్రశ్నించారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే, అసమ్మతిని వ్యక్తం చేసే హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాథమికమైనదని ఆమె నొక్కి చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పోరాటం ఏ దిశలో సాగినా, అసమ్మతి హక్కును శాంతికి ముప్పుగా ముద్ర వేసే విధంగా ఉండకూడదని బోరా స్పష్టం చేశారు. రాజధానిలో 'లెహ్రా దో త్రివర్ణ' మార్చ్‌లో పాల్గొన్న బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న మరుసటిరోజు అక్టోబర్ 17న ఈ నోటీసు జారీ చేశారు. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో జరిగిన అవకతవకలపై జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనలలో ఈ ప్రదర్శన కూడా ఒక భాగం. ఈ నివారణా చర్యలు శాంతియుత అసమ్మతిని అణచివేసే ప్రయత్నమని పేర్కొంటూ, శాంతిభంగం జరిగే అవకాశం ఉందని నోటీసులో తగినంతగా రుజువు చేయలేదని బోరా ఢిల్లీ హైకోర్టులో ఈ నోటీసును సవాలు చేశారు. శాంతియుత నిరసనలు, ప్రజాస్వామ్యయుత వ్యతిరేకతను ప్రజా భద్రతకు భంగం కలిగించే చర్యలుగా పరిగణించకూడదని, భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచే హక్కును తప్పక పరిరక్షించాలని ఆమె నొక్కిచెప్పారు.

# ఆరు రాష్ట్రాల సిఎస్‌లపై చర్యలు తీసుకోండి

లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లాకు పిఎసి చైర్మన్ కెసి వేణుగోపాల్ లేఖ



**న్యూఢిల్లీ :** షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల స్కాలర్‌షిప్ పథకాలలో అవకతవకలను పరిశీలిస్తున్న కమిటీ ముందు హాజరుకావడంలో విఫలమైనందుకు, కర్ణాటకతో సహా ఆరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) ఛైర్‌పర్సన్ కె.సి. వేణుగోపాల్ హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈనెల 22న, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పంజాబ్, ఒడిశా, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని వేణుగోపాల్ కోరారు. వారి గైర్హాజరును కమిటీ ఏకగ్రీవంగా పార్లమెంటరీ హక్కుల ఉల్లంఘనగా పరిగణించిందని ఆయన పేర్కొన్నారు. 'పార్లమెంటుకు తమ జవాబుదారీతనాన్ని పూర్తిగా విస్మరించి, మినహాయింపులు ఇవ్వనప్పటికీ ఏ ప్రధాన కార్యదర్శి కూడా కమిటీ ముందు హాజరుకాలేదని నేను చెప్పక తప్పడం లేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు. కమిటీ ముందు హాజరుకావడంలో విఫలమైనందుకు ఉత్తర ప్రదేశ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శులపై కూడా చర్యలు తీసుకోవాలని వేణుగోపాల్ కోరారు. 2025 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలోని అన్వేషణల ఆధారంగా, ఎస్‌సి విద్యార్థుల కోసం ఉద్దేశించిన ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాల అమలును ఈ కమిటీ పరిశీలిస్తోంది. రాష్ట్ర స్థాయిలో పథకాల అమలు, లబ్ధిదారుల ధృవీకరణ, స్కాలర్‌షిప్ పంపిణీ వంటి అంశాలను ఇది తన పరిశీలనలో ఉంచుకుంది. ప్రధాన కార్యదర్శులు హాజరుకాకపోవడాన్ని హాజరైన సభ్యులందరూ ఏకగ్రీవంగా తీవ్రంగా పరిగణించారని, ఇది పార్లమెంటరీ హక్కుల ఉల్లంఘనకు సమానమని భావించారని వేణుగోపాల్ తెలిపారు. సెప్టెంబర్‌లో కమిటీ జైపూర్‌లో జరిపిన అధ్యయన పర్యటన సందర్భంగా గుర్తించిన ఆందోళనల నేపథ్యంలో అధికారులను పిలిపించాలని నిర్ణయం తీసుకున్నారు. జాతీయ స్కాలర్‌షిప్ పోర్టల్‌లోకి రాష్ట్రాలను తీసుకురావడంలో జాప్యం, కేంద్రరాష్ట్రాల మధ్య సమన్వయంలో లోపాలు, స్కాలర్‌షిప్ పంపిణీలో సమస్యలు వంటివి వీటిలో ఉన్నాయి. ఈ పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలే అమలు చేస్తున్నందున, ఆడిట్ ఫలితాలపై ఇతర రాష్ట్రాలను, వాటి సంక్షేమ శాఖలను కూడా పరిశీలించడం అవసరమని కమిటీ భావించిందని వేణుగోపాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల నుండి లిఖితపూర్వక సమాచారాన్ని పొందడానికి, మౌఖిక సాక్ష్యాలను స్వీకరించడానికి కమిటీకి స్పీకర్ అనుమతి ఇచ్చారు. అక్టోబర్ 8, 9 తేదీలలో జారీ చేసిన ఆదేశాలలో, పథకాలను అమలు చేసే బాధ్యత గల శాఖల అధికారులతో పాటు ఆరుగురు ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని ఆదేశించారు. ప్రధాన కార్యదర్శులెవరూ హాజరు కానప్పటికీ, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాల సాంఘిక సంక్షేమ కార్యదర్శులు, బిహార్ విద్యా కార్యదర్శి హాజరై, కేంద్ర సాంఘిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో పాటు సాక్ష్యం ఇచ్చారని ఆ లేఖలో పేర్కొన్నారు. సమావేశం అసలు షెడ్యూల్ ప్రకారం, మధ్యప్రదేశ్ నుండి ఒక కార్యదర్శి మధ్యాహ్నం 2 గంటలకు వచ్చారు. ఆ రాష్ట్ర ప్రతినిధులను మరో తేదీన మళ్లీ పిలవాలని కమిటీ నిర్ణయించిందని ఆ లేఖలో తెలిపారు. హాజరు కాకపోవడం ద్వారా కమిటీ హక్కులను ఉల్లంఘించిన ఆరుగురు ప్రధాన కార్యదర్శులు, ఉత్తరప్రదేశ్, బిహార్, ఒడిశా రాష్ట్రాల సాంఘిక సంక్షేమ కార్యదర్శులపై తగిన చర్యలు తీసుకునేలా చూడాలని వేణుగోపాల్ బిర్లాను కోరారు.

## జంతర్ మంతర్ వద్ద హింసపై 29, 30 తేదీల్లో 'సుప్రీం' హెచ్‌పిఇసి సాక్ష్యాధారాలు నమోదు



**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్ వద్ద జులైలో జరిగిన హింసాత్మక ఘటనలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు నియమించిన ఉన్నత స్థాయి విచారణ కమిటీ (హెచ్‌పిఇసి) అక్టోబరు 29, 30 తేదీలలో ఇక్కడ రెండు రోజులపాటు సమావేశం కానుంది. ఈ సందర్భంగాఉన్నత స్థాయి విచారణ కమిటీ బాధితుల వాదనలను వినడంతో పాటు, పెల్లెట్ గన్‌ల వినియోగం, మహిళా నిరసనకారుల వేధింపులకు సంబంధించిన సాక్ష్యాధారాలను నమోదు చేయనుందని శనివారం అధికారులు తెలిపారు. శిక్షాసదన్, 17 రౌస్ అవెన్యూ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియాలోని తమ కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి కమిటీ తన విచారణను నిర్వహిస్తుందని అధికారులు చెప్పారు. ప్రజలు, హింసవల్ల ప్రభావితమైన వారు ఎవరైనా, చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలను తమ వెంట తెచ్చుకోవాలన్నారు. అక్టోబరు 29, 30 తేదీలలో ఉదయం 11–30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల సమయం మధ్య వచ్చి ఫిర్యాదులు లేదా వినతులు సమర్పించవచ్చు లేదా సాక్ష్యాలు చూపించవచ్చని వివరించారు. పెల్లెట్ గనుల వాడకం, మహిళా నిరసనకారులపై లక్షిత హింస, వేధింపులు, అలాగే, ఇరుపక్షాల తరపున జరిగిన అధిక బలప్రయోగం, ఆస్తి నష్టం వంటి ఆరోపణలను కమిటీ ప్రత్యేకంగా పరిశీలిస్తుందని అధికారులు తెలిపారు. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలోజరిగిన ఆందోళన సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై, పోలీసులు దురాగతాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ దాఖలైన పలు పిటిషన్లపై, అలాగే, పోలీస్ సిబ్బందిపై హింసకు పాల్పడ్డారన్న ఎదురు ఆరోపణలపై విచారణ జరుగుతున్నప్పుడు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి అధ్యక్షతన ఐదుగురు సభ్యుల కమిటీని అత్యున్నత న్యాయస్థానం ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవిశంకర్ ఝా, మాజీ ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ శాలిందర్ కౌర్, మాజీ సిబిఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, విశ్రాంత మేఘాలయ డిజిపి ఎల్ఆర్. బిష్ణోయ్ కూడా ఉన్నారు. విస్తృత భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి, బలహీన సాక్షులను రక్షించడానికి కమిటీ hpec.nic.in అనే ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. బాధితులే, సాక్షులు, భాగస్వాములు ఈ పోర్టల్‌లో నిర్దేశించిన ఫార్మాట్‌లను ఉపయోగించి వాంగ్మూలాలు, వినతులు వాటికి మద్దతుగా డాక్యుమెంటరీ ఎవిడెన్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. బలహీనసాక్షులకు పూర్తి రక్షణ కల్పించాలని, వారి గుర్తింపులు గోప్యంగా ఉండేలా చూడాలని, అదే సమయంలో, వారు సమర్పించిన వాంగ్మూలాలు, సాక్షాల విషయంలో అత్యంత గోప్యతను పాటించాలని సుప్రీం కోర్టు హెచ్‌పిఇసిని ఆదేశించింది. జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో పార్లమెంట్ వరకు జరిగిన మార్చ్ సందర్భంగా భద్రతా సిబ్బందికి, ప్రదర్శనకారులకు మధ్య హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల సమయంలో గుంపును చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. పలు మార్లు లాఠీఛార్జీలు చేశారు. పెల్లెట్ గనుల వాడకం వల్ల సంభవించి ఉండవచ్చని భావిస్తున్న గాయాలతో కొంతమంది విద్యార్థులు ఆసుపత్రులలో చేరారు. జూన్ 20న జంతర్ మంతర్ వద్ద ప్రారంభమై పలు నగరాలకు విస్తరించిన విద్యార్థుల నేతృత్వంలోని ఆందోళన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో జులై 25న విరమించబడింది.

## ఓట్ చోర్‌ను అధికారం నుంచి తరిమికొట్టేందుకు ఏకతాటిపైకి...

నవంబరు 1న ఇండియా కూటమి ర్యాలీకి కాంగ్రెస్ సన్నాహాలు

**న్యూఢిల్లీ :** ఓటు దొంగలకు వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి ర్యాలీ చేపట్టనుంది. అయితే ఈ ర్యాలీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో, ఓటు దొంగలను అధికారం నుంచి తరిమికొట్టడంలో తామంతా ఐక్యంగా ఉన్నాం అనే బలమైన సందేశాన్ని పంపడానికి ఉపయోగపడుతుందని కాంగ్రెస్ స్పష్టం చేసింది. రామ్‌లీలా మైదాన్‌లో జరగనున్న ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించేందుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్ ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఉత్తరప్రదేశ్, హర్యానా పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఉత్తరప్రదేశ్ నాయకులతో జరిగిన ఈ సమావేశానికి ఎఐసిసి రాష్ట్ర ఇన్‌చార్జి రాజేంద్ర పాల్ గౌతమ్, యుపిసిసి మాజీ అధ్యక్షుడు అజయ్ రాయ్, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ మసూద్, సీనియర్ నాయకులు సల్మాన్ ఖుర్షీద్, అజయ్ లల్లు తదితరులు హాజరయ్యారు. హర్యానా నాయకులతో జరిగిన సమావేశానికి ఎఐసిసి ఇన్‌చార్జి సంజయ్ దత్, పిసిసి అధ్యక్షుడు రావు నరేందర్ సింగ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా, ఎంపి దీపేందర్ హూడా తదితరులు హాజరయ్యారు. నవంబర్ 1న జాతీయ రాజధానిని చేరుకోనున్న భారీ 'ఢిల్లీ చలో మార్చ్'కు రామ్‌లీలా మైదాన్‌లో జరిగే ఈ ర్యాలీ పరాకాష్టగా నిలుస్తుందని, 10 లక్షల మంది పౌరులు ఈ ఉద్యమం కోసం కవాతు చేస్తారని అంచనా వేస్తున్నట్లు వేణుగోపాల్ తెలిపారు. 'మోదీషా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ అండ్ కో పన్నాగం పన్నిన నేరపూరిత ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా తమ కార్యక్రమాలు చారిత్రాత్మకంగా నిలుస్తాయి అని ఆయన పేర్కొన్నారు. ఈ ఓటు ఎంపికదారులను అధికారం నుండి తరిమికొట్టడంలో తామంతా ఐక్యంగా ఉన్నాము అనే బలమైన సందేశాన్ని ఇది భారతదేశంలోని ప్రతి మూలకు పంపుతుంది అని వేణుగోపాల్ అన్నారు.

# ర్యాలీని వాయిదా వేయండి

- రాహుల్‌గాంధీకి వ్యాపారులు లేఖ
- రూ.10 వేలకోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన




**న్యూఢిల్లీ :** దీపావళి పండుగకు ముందు ఢిల్లీలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీని వాయిదా వేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సిటిఐ) విజ్ఞప్తి చేసింది. నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లో జరగనున్న ఈ సభ వల్ల పండుగ సీజన్‌లో వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ర్యాలీ కారణంగా సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నవంబర్ 10 తర్వాత సభ నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని కోరింది. సిఇసి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1న రాంలీలా మైదాన్‌లో ఇండియా కూటమి భారీ ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలోనే రాహుల్‌కు సిటిఐ చైర్మన్ బ్రిజేశ్ గోయల్ లేఖ రాశారు. 'దేశ రాజధానిలో ధన్‌తేరస్, దీపావళి, భాయ్‌దూజ్ పండుగల సందర్భంగా వ్యాపార లావాదేవీలు భారీగా జరుగుతాయి. బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, పాత్రలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తులు, బహుమతుల విక్రయాలు ఈ సమయంలో ఊపందుకుంటాయి. పండుగలకు వారం రోజుల ముందే మార్కెట్లలో కొనుగోళ్లు పెరుగుతాయి. ఈ కీలక సమయంలో భారీ ర్యాలీ నిర్వహిస్తే వినియోగదారుల రాక తగ్గడంతో పాటు సరుకుల రవాణా కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ధన్‌తేరస్ సందర్భంగా ఢిల్లీలో వివిధ రంగాల్లో కలిపి సుమారు రూ.25 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇలాంటి సమయంలో రహదారులపై రద్దీ, భద్రతా ఏర్పాట్లు, రవాణా ఆంక్షలు వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తాయి. అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు, రహదారుల మూసివేతల వల్ల వ్యాపారులు ఇప్పటికే సుమారు రూ.3 వేల కోట్ల మేర నష్టపోయారు. కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్, ఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లో ర్యాలీలు, ట్రాఫిక్ ఆంక్షల కారణంగా హోల్‌సేల్ మార్కెట్లకు సరుకుల తరలింపు కష్టమైంది. రిటైల్ దుకాణాలకు వినియోగదారుల రాక తగ్గింది. పండుగల సమయంలో ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే వ్యాపారంపై మరింత ప్రభావం పడుతుంది' అని సిటిఐ చైర్మన్ బ్రిజేశ్ గోయల్ పేర్కొన్నారు.

**ఐదు కిలోమీటర్ల పరిధిలో 20 మార్కెట్లు**

రాంలీలా మైదాన్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో సుమారు 20 ప్రధాన హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని సిటిఐ వివరించింది. వీటిలో చాందినీ చౌక్, సదర్ బజార్, చావ్రీ బజార్, భాగీరథ్ ప్యాలెస్, ఖారీ బావోలీ, కశ్మీరీ గేట్, నయా సడక్, మోరీ గేట్, కినారీ బజార్, దరీబా, దర్యాగంజ్, అజ్మేరీ గేట్, జామా మసీదు, కరోల్‌బాగ్, ఆజాద్ మార్కెట్ వంటి కీలక వాణిజ్య కేంద్రాలున్నాయి. ఈ మార్కెట్ల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరుకులు సరఫరా అవుతుంటాయి. ర్యాలీ సందర్భంగా బారికేడ్ల ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టడం, ప్రజా రవాణాపై పరిమితులు విధించడం వంటివి జరిగితే వ్యాపార కార్యకలాపాలు దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొంది. ఇతర రాష్ట్రాల నుంచి దిల్లీకి వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు ఢిల్లీ రైల్వే స్టేషన్ల ద్వారా ప్రయాణిస్తుంటారని గుర్తు చేసింది. భారీ జనసమూహాలు, రహదారులపై ఆంక్షలు ఉంటే వారు మార్కెట్లకు చేరుకోవడం కష్టమవుతుందని, పండుగల సమయంలో ఢిల్లీకి వచ్చేందుకు వెనుకాడే ప్రమాదం ఉందని తెలిపింది

**'ప్రజాస్వామ్య హక్కును గౌరవిస్తూనే'**

శాంతియుత నిరసనలు చేపట్టడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం రాజకీయ పార్టీల హక్కేనని సిటిఐ అంగీకరించింది. అయితే, కీలక వాణిజ్య ప్రాంతాల్లో పండుగల సమయంలో భారీ ర్యాలీలు నిర్వహించకుండా ప్రత్యామ్నాయ తేదీలను పరిశీలించాలని కోరింది. ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని లేఖలో పేర్కొంది. నవంబర్ 10 తర్వాత ర్యాలీ నిర్వహిస్తే పండుగల సమయంలో వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం తగ్గుతుందని తెలిపింది.

## భౌతిక శాస్త్రవేత్త అశోక్‌సేన్‌కు... 2026 సంవత్సరం 'ఆస్కార్ క్లైన్' పతకం



ఈ గౌరవాన్ని అందుకున్న తొలి భారతీయుడు సేన్

**న్యూఢిల్లీ:** భారతీయ భౌతికశాస్త్రవేత్త అశోక్‌సేన్‌కు 2026 ఆస్కార్ క్లైన్ పతకం లభించింది. ఈ గౌరవాన్ని అందుకున్న తొలి భారతీయ భౌతిక శాస్త్రవేత్తగా ఆయన నిలిచారు. బెంగళూరులోని ఇంటర్నేషనల్ థియరిటికల్ సెంటర్ ఫర్ థియరిటికల్ సైన్సెస్ (ఐసిటిఎస్), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టిఐఎఫ్ఆర్), ఇన్ఫోసిస్ మాధవ చైర్ ప్రొఫెసర్ అయిన సేన్‌ను ఆధునిక స్ట్రింగ్ థియరీ రూపశిల్పిగా విస్తృతంగా పరిగణిస్తారు. ఈ సిద్ధాంతం ప్రకారం, పదార్థంలోని ప్రాథమిక అంశాలు, బిందు కణాలు కాకుండా, సూక్ష్మ మైన, ఏకమితీయ, తీగలల వంటి వస్తువులు, తద్వారా ఇది పదార్థానికి, వాటి మధ్య ఉండే బలాలకు ఒక ఏకీకృత వివరణను అందించడానికి ప్రయత్నిస్తుంది. 1988లో స్థాపించబడి, స్వీడిష్ సైద్ధాంతిక భౌతిక శాస్తవేత ఓస్కార్ క్లైన్ పేరు మీద పెట్టబడిన ఈ పతకాన్ని స్టాక్‌హోం విశ్వవిద్యాలయం, రాయల్ స్వీడిష్ అకాడమీ సైన్సెస్ యొక్క భౌతిక శాస్త్ర నోబెల్ కమిటీ ఏటా ప్రదానం చేస్తాయి. క్లైన్ జ్ఞాపకార్థం, ఆస్కార్ క్లైన్ మెమోరియల్ లెక్చర్స్ నిర్వాహక కమిటీ ప్రతీ సంవత్సరం ఒక విశిష్ఠ పరిశోధకుడిని స్మారక ఉపన్యాసం ఇవ్వడానికి క్లైన్ పతకాన్ని స్వీకరించడానికి ఆహ్వానిస్తుంది. సేన్ అక్టోబరు 22న స్టాక్ హోమ్‌లోని ఆల్బానోవా యూనివర్సిటీ సెంటర్‌లో 'తీగల నుండి గురుత్వాకర్షణ మరియు గురుత్వాకర్షణ నుండి తీగలు' అనే శీర్షికతో ఉపన్యాసం ఇచ్చారు. ఈ ప్రసంగం, స్ట్రింగ్ సిద్ధాంతం గురుత్వాకర్షణ యొక్క స్థిరమైన క్వాంటమ్ సిద్ధాంతానికి ఎలా దారితీస్తుందో వివరించింది.అంతేకాకుండా, బ్లాక్‌హోల్స్ యొక్క క్వాంటమ్ సిద్ధాంతానికి సంబంధించిన పరిష్కారంకానీ చిక్కుముడులను పరిష్కరించింది. పద్మశ్రీ (2001), పద్మభూషణ్ (2013) పురస్కార గ్రహీత చేసిన కృషి, ఆకర్షణల ద్వారా పరిశోధనా రంగానికి ఒక రూపాన్ని ఇవ్వడంలో సహాయపడింది.

## ద్వైపాక్షిక వాణిజ్య విస్తరణకు మోదీ–పుతిన్ ఆదేశాలు



**మాస్కో:** భారత్–రష్యా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ,అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ఆదేశాలు జారీ చేశారని రష్యాలోని భారత రాయబారి వినయ్‌కుమార్ చెప్పారు.టాస్ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ,రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించడానికి బ్రిక్స్ సమావేశం ఇద్దరు నాయకులకు మంచి అవకాశాన్ని ఇచ్చిందన్నారు. సెప్టెంబరు 12,13 తేదీలలో న్యూఢిల్లీ వేదికగా జరిగిన ఈ సమావేశంలో సహకార విస్తరణపై క్షుణ్ణంగా వారు చర్చించారని చెప్పారు .రెండు దేశాలూ 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని నిర్ణయించుకున్న తర్వాత మోదీ–పుతిన్ ఇద్దరూ తమ తమ ప్రభుత్వాలకు ఆ దిశగా ఆదేశాలు జారీ చేశారన్నారు.బ్రిక్స్ వ్యాపార సదస్సులో పాల్గొనడమేకాకుండా,రష్యా వాణిజ్య ప్రదర్శన ఇన్నోప్రోమ్–ఇండియా ఎగ్జిబిషన్‌కు కూడా వారు సందర్శించడం మంచి ఫలితాలు ఇచ్చిందని చెప్పారు.ఈనెల 15,16 తేదీలలో కజాన్‌లో రష్యా 2 టైమ్ బిజినెస్ ఫోరం సమావేశం తర్వాత వినయ్ కుమార్ ఈ ఇంటర్వ్యూ ఇచ్చారు.ఇరు దేశాలమధ్యా పెట్టుబడులను 50 బిలియన్ డాలర్లకు పైగా పెంచేందుకు కృషి జరుగుతున్నట్లు చెప్పారు.రష్యా అవసరాలకు అనుగుణంగా నైపుణ్యంగల కార్మికులను సరఫరా చేయడమే భారత్ లక్ష్యమని ఆయన చెప్పారు.దాదాపు 150 కోట్ల జనాభాగల భారతదేశం నైపుణ్యంగల కార్మికుల సరఫరాకు పెద్ద కేంద్రంగా మారబోతోందని చెప్పారు.భారత కార్మికుడి సగటు వయసు 29 సంవత్సరాలుగా ఉందని,భారత జనాభాలో కార్మికులు 69 శాతం ఉన్నారని చెప్పారు.భారత్ తనదేశ అవసరాలకోసం మాత్రమే కాకుండా విదేశాలలో కూడా ఉపాధి అవసరాల నిమిత్తం నైపుణ్య శిక్షణలు ఇస్తోందని చెప్పారు. రష్యాలో నైపుణ్య శిక్షణకు,భారత్‌లో విద్యాసంస్థలతో కలిసి పనిచేయడానికి భారత్ ఇప్పటికే రష్యాకు ఒక ప్రతిపాదన చేసిందని చెప్పారు.

## 60 వేలమంది వలంటీర్లతో.. 12 రాష్ట్రాలు, యూటీలల్లో పౌరరక్షణ నెట్‌వర్క్

**న్యూఢిల్లీ:** పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా, 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో (యుటి) సుమారు 60,000 మంది వలంటీర్లతో కూడిన పౌర రక్షణ నెట్‌వర్క్‌ను నిర్మించడానికి హోంమంత్రిత్వ శాఖ, సైన్యంతో కలిసి మొట్టమొదటిసారిగా ఒక సంయుక్త శిక్షణను నిర్వహించనుంది. మొదటి దశలో, పాల్గొనే రాష్ట్రాలు, యుటిల నుండి వచ్చిన సివిల్ డిఫెన్స్ మాస్టర్ ట్రైనర్లకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని హోంవ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో, కొత్తగా తలెత్తుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి ఆధునిక వ్యవస్థలు, సాంకేతికతలు, సమకాలీన సంసిద్ధతా సామర్థ్యాలతో కూడిన శక్తివంతమైన పౌర రక్షణ నెట్‌వర్క్ అనే తన దార్శనికతను ప్రకటించారు. ఆ ప్రసంగం నుండే ఈ కార్యక్రమం మొదలైంది. 'ఈ దార్శనికతను ముందుకు తీసుకువెళ్లే క్రమంలో, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ అండ్ హోమ్ గార్డ్స్, భారత సైన్యం ద్వారా సివిల్ డిఫెన్స్ మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా పౌర రక్షణ సంసిద్ధతను బలోపేతం చేయడానికి మొట్టమొదటి పైలట్ కార్యక్రమాన్ని చేపడుతోంది' అని ఆ ప్రకటనలో పేర్కొంది. కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నుండి 50 మంది చొప్పున, మొత్తం 600 మంది సివిల్ డిఫెన్స్ మాస్టర్ ట్రైనర్లకు, నిర్దేశిత భారత సైనిక శిక్షణా కేంద్రాలలో మూడు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ద్వారా 2026 నవంబర్ రెండవ వారం నాటికి శిక్షణ ఇవ్వబడుతుంది. జమ్ము,కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీ, మేఘాలయ, సిక్కిం, అసోం, ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు పాల్గొంటాయని ఆ ప్రకటన తెలిపింది. సమకాలీన భద్రతాపరమైన ముప్పులు, ప్రతికూల పరిస్థితులు, అత్యవసర పరిస్థితులకు సమర్థవంతంగా స్పందించేందుకు సివిల్ డిఫెన్స్ సిబ్బంది సంసిద్ధతను పెంచడమే ఈ కార్యక్రమం యొక్క లక్ష్యమని అది పేర్కొంది. ఈ సిబ్బందికి మూడు ప్రధాన రంగాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. ముప్పుపై అవగాహన, రక్షణ, అత్యవసర ప్రతిస్పందన, సమాచార ప్రసారం, సమన్వయం. ప్రతి మాస్టర్ ట్రైనర్ తమ తమ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంలో 100 మంది సివిల్ డిఫెన్స్ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
ఆదివారం
25-10-2026
www.prajapaksham.in


# సముద్రగర్భ కేబుళ్ళు ధ్వంసం చేస్తాం

- దాడి వార్తలపై అమెరికాకు ఇరాన్ హెచ్చరిక
- అదే జరిగితే భారత్ సహా పలుదేశాలకు నష్టం

**టెహ్రాన్:** అమెరికా–ఇజ్రాయెల్ ఈసారి దాడిచేస్తే సముద్ర గర్భంలో ఉండే అంతర్జాతీస్థాయా ఇంటర్నెంట్ అనుసంధాన కేబుళ్ళను ధ్వంసం చేస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. మరోసారి పశ్చిమాసియాలో యుద్ధం ప్రజ్వరిల్లే అవకాశం ఉందని ట్రంప్ ఇటీవల సంకేతాలు ఇచ్చిన తర్వాత ఇరాన్ పైవిధంగా స్పందించింది. రాయిటర్స్ వార్తాసంస్థ కథనం ప్రకారం, ఇప్పటికే దెబ్బతిన్న కేబుల్స్ మరమ్మతుచేసే ప్రక్రియను కూడా అడ్డుకుంటామని ఇరాన్‌కు చెందిన భద్రతాధికారులు స్పష్టం చేశారు. భారత్, శ్రీలంకసహా ఆసియాదేశాలు, ఆఫ్రికాదేశాలు, గల్ఫ్ దేశాలకు చెందిన డేటా సెంటర్లకు ఉపయోగపడే కేబుల్ వ్యవస్థలు ఈ యుద్ధ మార్గంలో ఉన్నాయి. ఈ మార్గంలో కేబుల్స్‌ను గనుక ఇరాన్ ఐఆర్‌జిసి కట్ చేసి ధ్వంసంచేస్తే ముఖ్యంగా గల్ఫ్ దేశాలు ఎక్కువ నష్టపోతాయి. ఇంటర్నెట్ సేవల వేగం తగ్గిపోతుంది. ఆన్‌సేవలు, చెల్లింపులు స్తంభిస్తాయి. భారత్‌కు కూడా నష్టంవాటిల్లుతుంది. అంతర్జాతీయస్థాయిలో ఇంటర్నెట్ అనుసంధానం, డేటా సమాచార మార్పిడి దేశాలమధ్య 99 శాతం మేరకు సముద్రగర్భంలో ఉన్న కేబుల్స్ వ్యవస్థల ద్వారానే జరుగుతాయి. 2024లో ఇదేవిధంగా భూగర్భ కేబుళ్ళకు నష్టం వాటిల్లినప్పుడు మరమ్మతులకు 51 రోజులు పట్టిందని అమెరికా నౌకాదళ అధికారుల సమాచారం.

ఇదిలాఉండగా, అమెరికన్ యుద్ధ నౌకలను పర్షియన్ గల్ఫ్‌లోకి తిరిగి ప్రవేశించేందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని, అడ్డుకుంటామనని ఇరాన్ సాయుధ బలగాల ప్రధానాధిపతి మేజర్ జనరల్ అలీ అబ్దుల్లాహీ శనివారం ప్రతిజ్ఞ చేశారు.ఆ ప్రాంత జలాలలోకి అమెరికా నౌకలు ప్రవేశించే సాహసం చేయనీయబోమన్నారు. డోనాల్డ్ ట్రంప్ ఇతర అధికారులు ఇరాన్ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయని పదే పదే చెబుతూనే, మరోవైపు ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని పట్టుబడుతున్నారని విమర్శించారు. “మీరు అన్నీ ధ్వంసం చేస్తే, ఇలా పదే పదే ఎందుకు అర్థంలేని ప్రకటనలు చేస్తున్నారు?” అని ప్రశ్నించారు. అమెరికా ప్రజలను తప్పుతోవ పట్టించేందుకే ఈ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తే ఇరాన్ భూ సరిహద్దులను, సముద్ర సరిహద్దులను సమీపించే సాహసం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సుదీర్ఘ ఘర్షణతో తమ శత్రువులను బలహీనపరచడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

**ఇరాన్‌తో సంప్రదింపులకు జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ రెడీ**

ఇరాన్‌తో సంప్రదింపులు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు ప్రకటించాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, ఇరాన్ అణ్వాయుధాలు పొందకుండా నిరోధించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఈ మూడు దేశాల తరపున జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెఫుల్ ఒక ప్రకటనలో శనివారం చెప్పారు. అదేవిధంగా హౌతీలతో సంప్రదింపులు చేసేందుకు, సౌదీఅరేబియా, యెమెన్ దేశాలు తమను తాము రక్షించుకునేందుకు కూడా మద్దతుఇస్తామని అన్నారు. ఇదిలా ఉండగా, అంతర్జాతీయస్థాయిలో శాంతియుత ప్రయోజనాలకోసం ఉపయోగించే ఐఎఇఎ రక్షణలతో నడిచే అణు వ్యవస్థలపై దాడుల హెచ్చరికలను ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ సమావేశం(నిరాయుధీకరణ, భద్రతపై తొలి కమిటీ)లో 12 దేశాలు మూకుమ్మడిగా ఖండించాయి. రష్యా, చైనా, ఇరాన్, పాకిస్థాన్, క్యూబా, ఎరిత్రియా, బెలారస్, నికరాగువా, నిగర్, తజికిస్థాన్ వంటి దేశాలు ఈ హెచ్చరికలను ఖండించిన దేశాల జాబితాలో ఉన్నాయి.

# ఐక్యరాజ్యసమితిని పశ్చిమదేశాల నుండి విముక్తి చేయాలి

- యుఎన్‌ఓ దినోత్సవం సందర్భంగా రష్యా ప్రతినిధి పిలుపు



**మాస్కో:** ఐక్యరాజ్యసమితి సచివాలయ కార్యాలయాన్ని పాశ్చాత్యదేశాల ఆధిపత్యం నుండి విముక్తి చేయాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ పూనుకోవాలని రష్యా పిలుపు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా రష్యా విదేశీమంత్రిత్వశాఖలోని అంతర్జాతీయ విభాగం డైరెక్టర్ కిరిల్ లాగ్వినోవ్ శనివారం ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. డిసెంబరు నెలాఖరునాటికి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ పదవీ విరమణ చేయనున్నారు. కొత్తగా ఎన్నికయ్యే ప్రధాన కార్యదర్శి ఐక్యరాజ్యసమితి సచివాలయాన్ని పాశ్చాత్యదేశాల రహస్య ఒప్పందాల నుండి, ఆధిపత్యం నుండి విముక్తి చేసి బహుముఖ కేంద్రంగా తీర్చిదిద్దగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. “ఐక్యరాజ్యసమితి పరిధిలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయి, వాటిని మనం విస్మరించలేం, ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌ను సంపూర్ణస్థాయిలో పాటించేవిధంగా చర్యలు అమలు చేయాలి, బహుళకేంద్ర యంత్రాంగంగా ఐక్యరాజ్యసమితిని తీర్చిదిద్దాలి, ఐక్యరాజ్యసమితిలో రహస్య ఒప్పందాలను వదిలిపెట్టి, పరస్పర గౌరవంతో కూడిన సంభాషణలను, నిజాయతీని ప్రోత్సహించేట్టు చేయాలి, ఈ విషయంలో కొత్తగా ఎన్నికయ్యే ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శిపై మేం ఎన్నో ఆశలు పెట్టుకున్నాం అని కిరిల్ లాగ్వినోవ్ టెలిగ్రామ్ ఛానల్‌లో రాశారు.

1971లో ఐక్యరాజ్యమితి తన 2782 తీర్మానం ద్వారా యుఎన్‌ఓ దినోత్సవాన్ని (అక్టోబరు 24) ప్రకటించింది. ఆ రోజు సెలవుదినంగా పాటించాలని, ప్రపంచవ్యాప్తంగా చర్చలు, సంభాషణలు జరగాలని తీర్మానంలో పేర్కొంది. ఐక్యరాజ్యసమితి ఈనాడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, ఐక్యరాజ్యసమితి సచివాలయం కార్యకలాపాలను రాజకీయాకరణ చేశారని, బడ్జెట్‌ను అసమానంగా ఖర్చుచేస్తున్నారని, దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం, నయా ఉదారవాద ఎజెండాను ప్రోత్సహించడం, తమ సంకుచిత ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవాలనే ధోరణి పెరిగిపోవడం వంటి అనేక సంక్షోభాలను ఐక్యరాజ్యసమితి ఎదుర్కొంటున్నదని ఆయన రాశారు. ఐక్యరాజ్యసమితి అధికారాన్ని, దాని స్థాయిని పునరుద్ధరించడానికి తాము నిరంతరం పరిశ్రమిస్తూనే ఉంటామని కిరిల్ లాగ్వినోవ్ పేర్కొన్నారు. ఆంటోనీ గుటెర్రెస్ 2017 నుండి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శిగా నాయకత్వం వహిస్తున్నారు. ఆయన పదవీకాలం ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీతో ముగిసిపోతుంది. ప్రస్తుతం మొదటిసారి ఒక మహిళ సహా ఇద్దరు అభ్యర్థులు ప్రధానంగా ఈ పదవికోసం పోటీ పడుతున్నారు. ఈ పదవి చేపట్టే అభ్యర్థికి నిష్పక్షపాతం,వృత్తి నైపుణ్యం ఉండాలని రష్యా కోరుతున్నది.

# ట్రంప్ భార్య మెలానియా మధ్యవర్తిత్వం..

## అలియోష్కీ నగరంలో రష్యా–ఉక్రేన్ కాల్పుల విరమణ

## ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్ హర్షం



**న్యూయార్క్:** అలియోష్కీ నగరంలో అక్టోబరు 27వ తేదీ (మంగళవారం) తెల్లవారుజాము నుండీ పూర్తిస్థాయిలో కాల్పుల విరమణకు రష్యా–ఉక్రేన్ దేశాలు అంగీకరించాయి. ప్రాంతీయస్థాయిలో ప్రజల బాధలు తగ్గించేందుకు కుదిరిన ఈ ఒప్పందాన్ని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఆహ్వానించారు. ఒక ప్రకటనలో ఆయన హర్షం ప్రకటిస్తూ, దక్షిణ ఉక్రేన్ ఖేర్సన్ ప్రాంత నగరమైన అలియోష్కీలో ప్రజలు ఆహారం, నీరు, విద్యుత్, ఔషధాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని అన్నారు. అమెరికా ప్రథమ మహిళ, డోనాల్డ్ ట్రంప్ సతీమణి మెలోనీ ట్రంప్ ఈ ఒప్పందం కుదిరేందుకు మధ్యవర్తిగా వ్యవహరించారు. ఈ నగరం నుండే ఉక్రేన్‌లో శాంతిసాధన ప్రారంభమవుతుందని ఆమె చేసిన ప్రకటనను గుటెర్రెస్ స్వాగతించారని ఆయన ప్రతినిధి స్టెఫాన్ దుజారిక్ తెలియజేశారు. అమెరికాకు చెందిన ఒక స్వతంత్ర మీడియా సంస్థ ఈ శాంతి ప్రక్రియను పర్యవేక్షించి నమోదు చేస్తుంది.

2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత మొట్టమొదటిసారి ఈ విధంగా ఒక ప్రాంతీయస్థాయిలో ప్రజల బాధలు పరిష్కరించేందుకు కాల్పుల విరమణకు అంగీకరించడం ఇదే మొదటిసారి. అమెరికాసహా ఉక్రేన్–రష్యా మధ్య త్రైపాక్షిక చర్చలకు వ్లాదిమీర్ పుతిన్ నాలుగు రోజులక్రితం అమెరికా ప్రతినిధి విట్‌కాఫ్‌తో జరిగిన సంప్రదింపుల్లో సుముఖత వ్యక్తం చేసిన పూర్వరంగంలో ఈ ప్రాంతీయస్థాయి కాల్పుల విరమణకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. రాబోయేరోజుల్లో ఇదేవిధంగా ప్రాంతీయస్థాయిలో మరిన్ని నగరాలు, గ్రామీణ ప్రాంతాలలో ప్రజల బాధలు, సమస్యలు అర్థం చేసుకుని కాల్పుల విరమణ ప్రక్రియ చేపట్టడానికి అలియోష్కీ నగరంలో అమలులోకి రానున్న ఒప్పందం ఒక ఆదర్శనమూనాగా ఉంటుందని అంతర్జాతీయ నిపుణులు అంచనావేస్తున్నారు.

ఒప్పందం కింద అలియోష్కీ నగరంలోని సమస్యాత్మకమైన ప్రదేశాలలో చిక్కుకుపోయిన వృద్ధులు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందకు ఒక సురక్షితమైన మార్గాన్ని ఏర్పాటు చేస్తారు. సహాయ సామాగ్రిని ఓలేష్కి నగరంలోకి తరలించేముందుగా అక్కడి రహదారుల్లో అడ్డంగా ఏర్పాటు చేసిన మందుపాతరలను తొలగిస్తారు. ఈ కాల్పుల విరమణ ఒప్పందం కొన్ని రోజులపాటు అమలులో ఉంటుందని రెండు దేశాల సైనికవర్గాలకు చెందిన ఉన్నతాధికారులు ప్రకటించారు.

# తప్పిదం

(మొదటి పేజీ తరువాయి)



కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోసుకోవాలని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేసిన నేపథ్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్‌బిసి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే ప్రస్తుత ఎల్ నినో ప్రభావిత కరువు పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్ర సాగునీటి రంగానికి, రైతాంగానికి నష్టం జరిగిందని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు నిర్దిష్ట గడువులతో కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాథమిక డిజైన్లు సిద్ధమయ్యాయని, అక్టోబరు నెలాఖరులోగా అంచనాలు, ప్రభుత్వ ఆమోదాలు పొందడం, నవంబరు నెలాఖరులోగా పనుల ఏజెన్సీల సన్నద్ధత పూర్తి చేసి, డిసెంబరు చివరి నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సాంకేతిక అనుమతులు, పనుల పురోగతికి అనుగుణంగా 2027 వర్షాకాలానికి ముందే పునరుద్ధరణ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సహకారంతో పాటు ఐఐటీ బాంబే, కేంద్ర జల, విద్యుత్ పరిశోధన కేంద్రం తదితర సంస్థల సాంకేతిక సహకారం తీసుకుంటున్నామని వివరించారు. బ్యారేజీల భద్రత, నిర్మాణాల పటిష్టతను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ రెడ్డి, బాలు నాయక్, మందుల సామ్యేల్, సంజీవ్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ సలహాదారు పరిక్షిత్ మెహ్రా, ఈఎన్‌సీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్

# ఆపరేషన్ సిందూర్ ప్రచారం



**వాషింగ్టన్:** డోనాల్డ్ ట్రంప్ భవిష్యత్‌ను తేల్చిచెప్పే మధ్యంతర ఎన్నికలకు ఇంకా పది రోజులే గడువు మిగలడంతో అమెరికాలో ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. ట్రంప్ ఎన్నికల ప్రచార సభల్లో భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని అడ్డుకున్నానని పదే పదే ప్రచారం చేసుకుంటున్నారు. ఫ్లోరిడాలో శనివారం నాడు డోనాల్డ్ ట్రంప్ ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ, భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధం విస్తరించకుండా అడ్డుకున్నఘనత తనకే దక్కుతుందని చెప్పారు. అదేవిధంగా నోబెల్ శాంతి బహుమతి తనకు రాలేదని బహిరంగసభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 250 శాతం మేరకు భారీ సుంకాలు విధిస్తానని ఇరు దేశాలకు తాను చేసిన హెచ్చరికలతో రెండు దేశాలూ చాలా ఆగ్రహం చెందాయని, కానీ చివరకు కాల్పులు ఆపేశారని అన్నారు. ఈ యుద్ధాన్ని నివారించడంలో ఐక్యరాజ్యసమితి నుండి తనకు ఎలాంటి సహాయం లభించలేదన్నారు. “నేను ఎనిమిది యుద్ధాలు ఆపేశాను, నాకు నోబెల్ శాంతి బహుమతి రావాలా?వద్దా? రాకూడదా?” అని ప్రజలను ప్రశ్నించారు. ఐతే భారతదేశం మాత్రం ఈ యుద్ధాన్ని తానే ఆపానని, మధ్యవర్తిత్వం చేశానని ట్రంప్ చెప్పడాన్ని ప్రతిసారీ తిరస్కరించింది.

ఈ ఎన్నికల్లో ట్రంప్‌కు దీటుగా ప్రచారం చేసేందుకు డెమోక్రాట్స్ తరపున బరాక్ ఒబామా కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. డోనాల్డ్ ట్రంప్ ఈ ఎన్నికలను తన వ్యక్తిగత ఇమేజ్‌ను ప్రతిబింబించే ఎన్నికలుగా అంచనావేసుకుంటున్నారు. తీవ్రమైన వ్యతిరేక పరిస్థితులు ఉన్నప్పటికీ ఆయన ఇమేజ్ ఈ ఎన్నికలకు ప్రధానమని ఆయన భావిస్తున్నారు. అణ్వాయుధాలు కలిగి ఉన్న భారత్–పాకిస్థాన్ మధ్య తాను యుద్ధం అడ్డుకున్నానని, తద్వారా కోట్లాదిమంది ప్రాణాలు కాపాడానని ప్రచార సభలో ఆయన చెప్పుకుంటున్నారు. 2025 మేనెలలో భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో పాకిస్థాన్ కూడా స్పందించింది. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి తర్వాత ఆక్రమిత జమ్మూ కశ్మీరులో, పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో వ్యూహాత్మకంగా ధ్వంసం చేసింది. యుద్ధంలో మొత్తం 11 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయని ఆయన ఎన్నికల సభలో చెప్పారు. ఈ రెండు దేశాలపైన భారీగా సుంకాలు విధిస్తానని, వెంటనే యుద్ధం ఆపాలని తాను హెచ్చరించి అదుపు చేశానన్నారు.“మీరు యుద్ధం కొనసాగిస్తే అమెరికాతో వాణిజ్యం చేసే అవకాశాన్ని కోల్పోతారని,భారీ సుంకాలను ఎదుర్కొంటారని చెప్పానని అన్నారు. 250 శాతం మేరకు సుంకాలు విధిస్తారని హెచ్చరించానన్నారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు యూనియన్లు అవసరం

## ఉద్యోగ భద్రత కొరవడటంతో పెరుగుతున్న సవాళ్లు: గీతా శేషు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మారుతున్న మీడియా రంగంలో జర్నలిస్టుల హక్కులను కాపాడేందుకు యూనియన్లు అవసరమని సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త గీతా శేషు అన్నారు. హైదరాబాద్‌లో శనివారం ప్రారంభమైన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సులో భాగంగా ‘మారుతున్న మీడియా రంగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా జర్నలిస్టుల భద్రత, రక్షణ సవాళ్లు’ అనే అంశంపై ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి మోడరేటర్‌గా సీనియర్ పాత్రికేయురాలు సి.వనజ వ్యవహరించారు. ఈ సందర్భంగా గీతా శేషు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగాలు, తక్కువ వేతనాలు, గిగ్ వర్క్, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు జర్నలిస్టులను సంఘటితం చేసి, సమిష్టి సంప్రదింపుల శక్తిని బలోపేతం చేయాలని సూచించారు. 1984లో జర్నలిజంలోకి ప్రవేశించిన తన అనుభవాలను గుర్తు చేస్తూ గతంలో సీనియర్ జర్నలిస్టులు ఎక్కువగా యూనియన్లలో సభ్యులుగా ఉండేవారని, ప్రస్తుతం యూనియన్లలో చేరేవారి సంఖ్య తగ్గుతోందని పేర్కొన్నారు. కాంట్రాక్టు విధానం జర్నలిస్టుల హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. వేజ్ బోర్డుల రద్దు, కార్మిక రక్షణల్లో మార్పులతో న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత సాధించడం కష్టమవుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత ఒప్పందాల కారణంగా సమిష్టిగా చర్చలు జరిపే అవకాశం తగ్గుతోందని, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్సింగ్ రంగాల్లో పనిచేసే వారికి యూనియన్లు ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. మహిళా జర్నలిస్టులకు ప్రసూతి ప్రయోజనాలు, సమాన వేతనాలు అందకపోవడం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల ఫిర్యాదుల పరిష్కారంలో లోపాలు ఉండటం ఆందోళనకరమన్నారు. అనేక మీడియా సంస్థల్లో ‘పోష్’ చట్టం అమలు సమర్థవంతంగా జరగడంలేదని పేర్కొన్నారు. జర్నలిస్టులకు న్యాయమైన వేతనాలు, కార్మిక హక్కులు, సమాన అవకాశాలు కల్పించడంతోపాటు ఫ్రీలాన్సర్లు, స్వతంత్ర జర్నలిస్టుల ప్రయోజనాలను కాపాడేందుకు యూనియన్లు కొత్త కార్యాచరణ రూపొందించాలని గీతా శేషు పిలుపునిచ్చారు.

# ఫ్రాన్స్ మరో మూడు యూరప్ దేశాల్లో హై అలర్ట్

- పారిస్,ఇతర నగరాల్లో70 వేలమంది పోలీస్ మోహరింపు
- అల్లరిమూకలతో రాజీ ప్రశ్నేలేదుః- మంత్రి నూనెజ్
- ర్యాలీ పాయింట్ దగ్గరకు వస్తే 135 యూరోలు జరిమానా



**పారిస్:** ఫ్రాన్స్ ప్రభుత్వం ఆ దేశంలో శాంతి భద్రతల పరిరక్షణకు హై అలర్ట్ ప్రకటించింది. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినప్పటికీ కార్మికులు, విద్యార్థులు, ఇతర ప్రభుత్వ వ్యతిరేక గ్రూపులు శనివారంనాడు లక్షలమంది వీధుల్లోకి వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపడతారని ప్రభుత్వం ముందుగా అంచనావేసి సర్వసన్నద్ధమైంది. ప్రదర్శనలు ప్రారంభమయ్యే బాస్టిల్లే పాయింట్ వద్ద పోలీసులు మైకుల ద్వారా ప్రచారం చేస్తూ, ఈ ప్రాంతానికి రావొద్దని,ఇక్కడ గుమిగూడితే 135 యూరోలు జరిమానా చెల్లించాలని హెచ్చరికలు చేస్తున్నారు. తుది సమాచారం ప్రకారం పోలీసు ఆదేశాలు ఉల్లంఘించి వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. అనేకమందిని అరెస్టు చేశారు. వారి నుండి గ్యాస్ మాస్కులు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వెంటనే ఈ ప్రాంతం వదిలివెళ్ళిపోవాలని పోలీసులు ఆదేశాలు ఇస్తున్నారు.ఆయుధాలు ధరించడాన్ని, గ్యాస్ మాస్కులు వేసుకోవడాన్ని ప్రభుత్వం నిషేధించింది. పారిస్‌లో ప్రధానమైన మ్యూజియంలను మూసివేశారు. దుకాణాల యజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పారిస్, మార్సెయిల్లే, లియోన్, నైస్, మోంట్‌పెల్లియర్‌లలో ర్యాలీలను నిషేధించారు. అల్లర్లు, హింసాకాండ చెలరేగితే అసమర్థంగా వ్యవహరించకుండా, ఆస్తినష్టాన్ని నివారించేందుకు, మూకలను అదుపు చేసేందుకు 70,000 మంది పోలీస్‌లను మోహరించినట్లు అధ్యక్షుడు మేక్రాన్ కార్యాలయం ప్రకటించింది. అదేవిధంగా ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో కూడా శనివారం ప్రజానిరసనలకు ముందుగా ప్రభుత్వాలు అప్రమత్తమై భద్రతాదళాలను మోహరించాయి. అల్లర్లు, దోపిడీలు, పోలీసులతో ఘర్షణలు జరిగిన వారం రోజుల తర్వాత ఇటలీ ఫ్యాషన్ నగరం మిలాన్‌లో శనివారం అల్లర్లు చెలరేగుతాయన్న భయంతో ప్రధానమంత్రి జార్జియో మెలోనీ 500 మంది భద్రతా దళాలను అదనంగా మోహరించారు.ఇప్పటికే 5000 మంది పోలీసులు ఇతర సిబ్బంది అక్కడ తిష్ఠవేసి ఉన్నారు. రైల్వేస్టేషన్లు తనిఖీ చేస్తున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థలపై గట్టి నిఘా విధించారు. మిలాన్‌లో గతవారం జరిగిన లూటీలు, హింసాకాండలో 2000 మంది యువకులు పాల్గొన్నారు. వీరిలో 45 శాతం మది మైనర్లే. అదూవిధంగా రోమ్ కూడా గట్టి నిఘా పెట్టారు. అదేవిధంగా స్పెయిన్‌లో వచ్చేనెల మెరుపు ఎన్నికలు జరగనున్నాయి. స్పెయిన్ నగరాల్లో అప్రమత్తత పాటిస్తున్నారు. ఇక పోర్చుగల్ నగరం లిస్బన్‌లో హౌసింగ్ సమస్య పరిష్కారం కోరుతూ ప్రదర్శకులు శనివారం నిరసన తలపెట్టారు. దీంతో పోర్చుగల్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది.

అక్టోబరు 17వ తేదీన ఫ్రాన్స్‌లో చెలరేగిన అశాంతిని అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్న తీవ్ర ఆరోపణల మధ్య దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకార్నూ హెచ్చరికలు, ఆదేశాలమధ్య భద్రతాయంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలనైనా కఠినంగా అణచివేస్తామని పోలీసు విభాగం ప్రకటించింది. మేం ఎవ్వరినీ వదిలిపెట్టం అని ఫ్రాన్స్‌హోంమంత్రి లారెన్స్ నూనెజ్ ప్రకటించారు. విధ్వంసం, హింస, అల్లర్లకు పాల్పడే వారితో రాజీపడే ప్రశ్నేలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో హింసను ప్రేరేపించే అనేక పోస్టింగులు కనిపించాయని, ప్రణాళికాబద్ధంగా నిరసన ప్రదర్శనలకు నిరసనారులు సమాయత్తమవుతున్నారని చెప్పారు. ఇటీవలిరోజుల్లో శరవేగంగా విచారణలు జరిపి వందలమందికి శిక్షలు అమలు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఫ్రాన్స్ చుట్టుపక్కల స్కూళ్ళలో మొదట ఈ నిరసన ప్రదర్శనలు ప్రారంభమై చివరకు దేశవ్యాప్త ఉద్యమంగా అవతరించింది. దేశాధ్యక్షుడు రాజీనామా కు ప్రజలు, విద్యార్థులు, కార్మికసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. శనివారం రెండో విడత ఆందోళన ప్రారంభానికి ముందుగా మేక్రాన్ విద్యార్థి నాయకులతో సమావేశమయ్యారు. వారికి కొన్ని హామీలు ఇచ్చారు. ఐనాగానీ విద్యార్థి నాయకులు ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు.

వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఫ్రాన్స్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ హింసాకాండకు అల్ట్రా లెఫ్ట్ కారణమని ప్రభుత్వం ఆరోపిస్తుండగా, పోలీసు వ్యవస్థకు మితవాద నేషనల్ ర్యాలీ పార్టీ మద్దతు ఇస్తున్నది. ప్రజలలో ఎంతో పాపులారిటీ ఉన్న వామపక్షాలు, జీవన వ్యయాల పెరుగుదల, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి ప్రజల న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతు ఇస్తున్నాయి.





# అణచివేయలేరు

(మొదటి పేజీ తరువాయి)

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి.రాధారాణి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు డి.అమర్, ఎస్.ఎన్.సిన్హా, ఐజెయు అధ్యక్షులు బల్వీందర్ సింగ్ జమ్మూ, సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ హాజరయ్యారు. సీనియర్ జర్నలిస్టులు స్వప్న, టియుడబ్ల్యుజె మహిళా విభాగం కన్వీనర్ రాజేశ్వరి కళ్యాణం, అత్తలూరి అరుణ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సదస్సులో జస్టిస్ జి. రాధారాణి కీలక ఉపన్యాసం చేస్తూ నిజాలను నిగ్గుతేల్చడమే జర్నలిజం కర్తవ్యమని, ప్రజాస్వామ్య పరిరక్షణ, అణగారిన వర్గాల గొంతుకను బలంగా వినిపించడంలో మహిళా జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. డిజిటల్ మాధ్యమాలు విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అసత్య ప్రచారాలు, డీప్‌ఫేక్, ఎఐ సాంకేతికత వల్ల విశ్వసనీయతకు ముప్పు వాటిల్లుతోందని, వాస్తవాల పరిశీలన (ఫ్యాక్ట్ చెకింగ్) ఎంతో అవసరమని సూచించారు. కార్యాలయాల్లో పని ప్రదేశ వేధింపుల నిరోధక (పోష్) చట్టాన్ని మీడియా సంస్థలు పక్కాగా అమలు చేయాలని, మహిళా జర్నలిస్టులకు తగిన రక్షణ, వృత్తిపరమైన సమాన అవకాశాలు కల్పించాలని ఆమె పిలుపునిచ్చారు.

**న్యాయం కోసం నిలబడే శక్తి మహిళలకుంది: సిపి సుమతి**

సిపి సుమతి మాట్లాడుతూ మహిళలు ప్రతి సమస్యను సమగ్ర కోణంలో విశ్లేషించే సామర్థ్యం కలిగి ఉంటారని, వారు కేవలం డెస్క్‌లకు మాత్రమే పరిమితం కాకుండా ఫీల్డ్ రిపోర్టింగ్‌లో ముందుండి నిర్భయంగా, నేతృత్వం వహిస్తూ ప్రజాస్వామ్యానికి సరికొత్త దిశానిర్దేశం చేయాలని కోరారు. మహిళలు అన్నింటిని అధిగమిస్తేనే ముందుకు వచ్చే పరిస్థితులు వుంటాయని వివరించారు. వివిధ రంగాలలో మహిళలు రాణించడం సాధారణ విషయం కాదని, అనేక అవాంతరాలను అధిగమించాల్సి ఉంటుంది అని చెప్పారు. కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ న్యూస్‌రూమ్‌లలో మహిళా జర్నలిస్టులు తమ ప్రాధాన్యాన్ని నిరూపించుకోవాలని, సానుభూతితో కూడిన మానవీయ కథనాలను సమాజానికి అందించాలని పేర్కొన్నారు. అంతకుముందు ఐజెయు అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము ప్రారంభోపన్యాసం చేస్తూ క్షేత్రస్థాయిలో మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను వివరించారు. ఇటీవల రీతిక చోప్రా వంటి జర్నలిస్టులు ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ గురించి నిర్భయంగా కథనాలు రాసారని గుర్తు చేశారు.

**ప్రశ్నించే హక్కును ఎవరూ కాలరాయలేరు: రాష్ట్ర మంత్రి సీతక్క**

“భయంతో ఏ మహిళా తన గొంతును నొక్కేసుకోకూడదు. చేతిలో మైక్ పట్టుకున్న మహిళ శత్రువు కాదని, సమాజ హితం కోసం నిలదీసే పాత్రికేయులు వ్యవస్థకు ఎన్నటికీ ముప్పు కాబోరు” అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఉద్ఘాటించారు. ‘మహిళల ప్రగతిని బట్టే ఆ సమాజ ప్రగతి ఆధారపడి ఉంటుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఏనాడో చెప్పారు. తాము రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసమే పోరాడుతున్నామే తప్ప, ఎవరి భిక్షనూ కోరడంలేదని ఆమె పేర్కొన్నారు. విధి నిర్వహణలో మహిళా జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, వ్యక్తిత్వ హననం వంటి చర్యలు గర్హనీయమని అన్నారు. వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం మహిళా జర్నలిస్టులంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

# మహారాష్ట్రతో చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానిస్తానని మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని మహారాష్ట్రతో చర్చలకు సిద్దంగా ఉండాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే చర్చల కోసం అవసరమైన సమాచారాన్ని, డాక్యుమెంట్‌లను సిద్ధం చేసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే అవకాశాలను, 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సిఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదంలేదని, 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని అధికారులు వివరించారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకుని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో జరిగిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సిడబ్ల్యుసి కోరిన సమాచారాన్ని అందజేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

**కెఆర్ఎంబి సమావేశం మంగళవారానికి వాయిదా**

ముంబైలో సోమవారం తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరగనున్నందున సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) సమావేశం మంగళవారానికి వాయిదా పడింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల్లో వాటా, ఇతర అంశాలపై చర్చించేందుకు ఈ నెల 26న కెఆర్ఎంబి 21వ సమావేశం ఏర్పాటు చేశారు. తుమ్మిడిహెట్టి విషయమై చర్చించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదే రోజు ముంబయి వెళ్తున్నందున తాము కూడా వెళ్లాల్సి ఉంటుందని, బోర్డు సమావేశానికి హాజరు కావడం వీలు కాదని తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ కెఆర్ఎంబి యాజమాన్యానికి తెలిపారు. ఈ మేరకు ఆయన కెఆర్ఎంబికి లేఖ రాశారు. సోమవారం తలపెట్టిన సమావేశం వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ విజ్ఞప్తి మేరకు సమావేశాన్ని వాయిదా వేస్తూ తదుపరి సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు కెఆర్ఎంబి తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కెఆర్ఎంబి సమాచారం అందించింది.

# ఉత్కంఠ పోరులో గెలిచిన టీమిండియా



తిలక్ వర్మ హాఫ్ సెంచరీ..

ఇండియా– న్యూజిలాండ్ జట్ల మధ్య శనివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా విజయం సాధించింది. చివరి వరకు ఉత్కంఠ సాగిన ఈ మ్యాచ్ అభిమానులకు అసలైన మజాను అందించింది. యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ అర్ధ సెంచరీతో చెలరేగడంతో టీమిండియాకు విజయం దక్కింది. మొదట టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. అనంతరం 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు త్వరగా వికెట్లు కోల్పోయింది. 4.4వ ఓవర్‌లో, 40 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఓపెనర్ సంజూ శాంసన్ 14 పరుగులకు ఔటయ్యాడు. ఆ తర్వాత వైభవ్ సూర్యవంశీ 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. చాలా రోజుల తర్వాత టీ20లోకి ఎంట్రీ ఇచ్చిన వైభవ్ నిరాశపరిచాడు. ఆ తర్వాత జట్టు 56 పరుగుల వద్ద అభిషేక్ శర్మ (27 పరుగులు) ఔటయ్యాడు. దీంతో టీమిండియా 56 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 7 పరుగులు మాత్రమే చేసి 4వ వికెట్‌కు వెనుదిరిగాడు. అప్పటికే బ్యాటింగ్‌లో ఉన్న అక్షర్ పటేల్ కూడా వెంటనే ఔటయ్యాడు. దీంతో 71 పరుగులకే టీమిండియా 5 వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులో తిలక్ వర్మ, నమన్ ధీర్ ఉన్నారు. తిలక్ వర్మ నెమ్మదిగా ఆడుతూ వికెట్లు పడకుండా కాపాడాడు. నమన్ ధీర్ మాత్రం తనదైన దూకుడు శైలిలో ఆడుతూ జట్టు స్కోరును పరుగులెత్తించాడు. అయితే, 14.5వ ఓవర్‌లో, జట్టు స్కోరు 113 ఉన్నప్పుడు నమన్‌ధీర్ కూడా ఔటయ్యాడు. 31 పరుగులు చేసిన నమన్ ధీర్ మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో నితీష్ కుమార్ రెడ్డి బ్యాటింగ్‌కు దిగాడు. ఈ దశలో భారత జట్టు విజయానికి 30 బంతుల్లో 68 పరుగులు అసవరం. ఇప్పుడు క్రీజులో తిలక్ వర్మ, నితీష్ రెడ్డి ఉన్నారు. ఇద్దరు తెలుగువాళ్లు భారత జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. మొదట నితీష్ రెడ్డి దూకుడుగా ఆడాడు. ఆ తర్వాత తిలక్ కూడా దూకుడు పెంచుతూ లక్ష్య చేధనకు కృషి చేశారు. తిలక్ వర్మ 25 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. చివరి ఓవర్లో భారత జట్టు విజయానికి 11 పరుగులు అవసరం. అయితే, ఒక బంతి మిగిలి ఉండగానే భారత జట్టు 181 పరుగుల విజయ లక్ష్యాన్ని చేధించింది. తిలక్ వర్మ 26 బంతుల్లో 51 పరుగులు, నితీష్ రెడ్డి 13 బంతుల్లో 26 పరుగులు చేసి, జట్టుకు విజయాన్ని అందించారు. చివరి ఓవర్ వరకు మ్యాచ్ ఉత్కంఠగా సాగడంతో క్రికెట్ అభిమానులకు అసలైన మజా అందించింది.



## ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా కీరన్ పోలార్డ్



**ముంబై:** ముంబై ఇండియన్స్ టీ20 జట్టుకు హెడ్ కోచ్‌గా కీరన్ పోలార్డ్ నియమితుడయ్యాడు. ఐపిఎల్ 2027 సీజన్ నుంచి వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. గతంలో ప్లేయర్‌గా, బ్యాటింగ్ కోచ్‌గా ముంబై ఇండియన్స్‌కు పోలార్డ్ సేవలు అందించాడు. ఇక నుంచి అతను ప్రధాన కోచ్‌గా తన విధులను చేపట్టనున్నాడు. హెడ్ కోచ్ బాధ్యతల నుంచి మహేళ జయవర్ధనే తప్పుకోవడంతో.. అతని స్థానంలో పోలార్డ్‌కు పదోన్నతి కల్పించారు. ప్లేయర్ నుంచి కోచ్ స్థాయికి పోలార్డ్ ఎదిగినట్లు ముంబై జట్టు తన ప్రకటనలో పేర్కొన్నది. 2009–2010 సీజన్ నుంచి 2022 సీజన్ వరకు అతను ముంబై జట్టులో ప్లేయర్‌గా కొనసాగాడు. ఐపిఎల్‌లో ముంబై తరపున 189 మ్యాచ్‌లు ఆడిన పోలార్డ్ .. వాటిల్లో 147.32 స్ట్రయిక్ రేట్‌తో 3412 రన్స్ చేశాడు. అతని బ్యాటింగ్ యావరేజ్ 28.67గా ఉన్నది. అతని ఖాతాలో 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో అతను 69 వికెట్లు తీసుకున్నాడు. కెరీర్ బెస్ట్ 4–44గా ఉంది. 22 ఏళ్ల వయసులో పోలార్డ్ ముంబై జట్టులో చేరాడని, 16 ఏళ్లుగా అతను తమ కుటుంబంలో సభ్యుడిగా మారారని, ప్లేయర్‌గా ఎన్నో అద్భుత క్షణాలను అందించాడని, కోచ్‌గా తన అనుభవాలను పంచాడని, హెడ్‌కోచ్‌గా ఇప్పుడు పోలార్డ్ కొత్త బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని ముంబై ఇండియన్స్ జట్టు కోఓనర్ నీతా అంబానీ తన ప్రకటనలో పేర్కొన్నారు. హెడ్‌కోచ్ బాధ్యతలు అప్పగించడం గౌరవంగా భావిస్తున్నట్లు పోలార్డ్ తెలిపాడు.




# లాకర్ల నుంచి డీమ్యాట్ ఖాతాల్లోకి!



### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 74,729.27 పాయింట్లు. ముగింపు 73,123.83 పాయింట్లు. నష్టం 1,605.44 పాయింట్లు.

జాతీయ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్ఎస్‌ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 23,146.15 పాయింట్లు. ముగింపు 22,600 పాయింట్లు. నష్టం 546.15 పాయింట్లు.

**(భారత స్టాక్ మార్కెట్లలో వరుస నష్టాల నుంచి కోలుకున్నామన్న ఆనందం మదుపరులకు ఎక్కువ కాలం నిలవలేదు. గత వారం లాభాలను ఆర్జించిన స్టాక్ మార్కెట్లు ఈ వారం నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ పరిణామాలు, క్రూడ్ ఆయిల్ ధరలు, ఎల్ నినో పరిస్థితులు వంటి అంశాలు ప్రపంచ వ్యాప్తంగా, దాదాపు అన్ని దేశాలపైనా ప్రభావం చూపాయి. భారత్ స్టాక్ మార్కెట్లు కూడా ప్రభావితమయ్యాయి).**

భారతీయులకు బంగారం అంటే ఆభరణం మాత్రమే కాదు.. ఆర్థిక భద్రతకు ప్రతీక కూడా. అయితే ఈ ఏడాది బంగారం కొనుగోలు చేసే విధానంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు నగల దుకాణాలకు వెళ్లి బంగారం కొనుగోలు చేసే వారు, ఇప్పుడు గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వంటి పెట్టుబడి మార్గాలపై ఆసక్తి చూపుతున్నారు. ధరలు రికార్డు స్థాయికి చేరువవుతున్న నేపథ్యంలో ఈ మార్పు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. దేశీయ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,58,854కు చేరగా, అంతర్జాతీయ మార్కెట్లోనూ ధరలు భారీగా పెరిగాయి. అదే సమయంలో గోల్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడులు పెరిగాయి. ఆగస్టులో వీటిలోకి రూ.2,596.70 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జులైలో నమోదైన రూ.1,559 కోట్లతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. మరో వైపు, ఆగస్టులో భారత బంగారం దిగుమతులు జులైతో పోలిస్తే 45 శాతం తగ్గడం భౌతిక బంగారం కొనుగోళ్లలో మందగమనాన్ని సూచిస్తోంది. నగల కొనుగోలులో తయారీ ఖర్చులు, పన్నులు, తిరిగి విక్రయించేటప్పుడు వచ్చే కోతలు ఉంటాయి. దీనికి భిన్నంగా గోల్ ఇటిఎఫ్‌లను డీమ్యాట్ ఖాతా ద్వారా కొనుగోలు చేయవచ్చు. ధరల వివరాలు పారదర్శకంగా ఉండటం, తక్కువ మొత్తాలతో పెట్టుబడి పెట్టే అవకాశం ఉండటం వంటి అంశాలు వీటికి ప్రదాన ఆకర్షణ. అయితే యాప్ల ద్వారా కొనుగోలు చేసే డిజిటల్ గోల్డ్‌కు నియంత్రణ పరమైన రక్షణ గోల్డ్ ఇటిఎఫ్‌ల మాదిరిగా ఉండదనే విషయాన్ని గుర్తించాలి. ధరలు పెరుగుతున్నాయనే కారణంతో తొందరపడి పెట్టుబడి పెట్టడం ప్రమాదకరం. సెప్టెంబర్‌లో ధరలు తగ్గడం మార్కెట్ ఒడిదుడుకులను స్పష్టం చేసింది. బంగారం వడ్డీ లేదా డివిడెండ్ ఇవ్వదు. లాభం పూర్తిగా ధరల మార్పుపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల పెట్టుబడిదారులు తమ మొత్తం పెట్టుబడుల్లో బంగారానికి ఎంత వాటా కేటాయించాలో ముందే నిర్ణయించుకోవాలి. ఒకేసారి భారీ మొత్తాన్ని పెట్టడం కంటే విడతలవారీగా పెట్టుబడి పెట్టడం మంచిది. బంగారం కొనడం ఒక సంప్రదాయం కావచ్చు.. కానీ పెట్టుబడిగా కొనడం మాత్రం ఆర్థిక నిర్ణయం. ధరల పెరుగుదలను చూసి పరుగులు తీయకుండా, రిస్క్‌ను అర్థం చేసుకుని అడుగులు వేయడమే తెలివైన పెట్టుబడిదారుడి లక్షణం.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,42,480
22 క్యారెట్లు: రూ. 1,30,600
18 క్యారెట్లు: రూ. 1,06,860
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## జన్యుమార్పిడి సోయాబీన్ దిగుమతులపై వ్యతిరేకత



జన్యుమార్పిడి (జెనెటికల్లీ మోడిఫైడ్/ జిఎం) సోయాబీన్ దిగుమతులపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. భారత సోయాబీన్ ప్రాసెసర్ల సంఘం (సోపా) కూడా ఈ విషయంపై స్పష్టమైన ప్రకటన చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జిఎం సోయాబీన్ దిగుమతులను అనుమతించవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. చౌకగా లభించే విదేశీ సోయాబీన్ దిగుమతుల వల్ల భారత రైతులకు నష్టం కలగడమే కాకుండా, వంటనూనెలు, ప్రోటీన్ల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించింది. అమెరికా, బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాల నుంచి తక్కువ ధరలో జిఎం సోయాబీన్ వస్తే, దేశీయ రైతుల పంటను ఎవరు కొనుగోలు చేస్తారని ప్రశ్నించింది. దిగుమతులకు అనుమతిస్తే వంటనూనెలు, ప్రోటీన్ల కోసం భారత్ పూర్తిగా విదేశాలపై ఆధారపడే ప్రమాదముందని స్పష్టం చేసింది. భారత్ తన వంటనూనెల అవసరాల్లో 57 శాతం దిగుమతి చేసుకుంటోందని, సోయాబీన్ సాగును ప్రోత్సహించడం, స్థిరమైన దిగుమతి సుంకాల విధానాన్ని అమలు చేయడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చని తెలిపింది. రైతులకు మెరుగైన విత్తనాలు, ఆధునిక సాగు పద్ధతులు అందించాలని, సోయాబీన్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని ప్రాసెసర్లు కోరారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు, రవాణా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## పంటలు సాగు చేయని రైతులకూ ‘భరోసా’ అందించాలి



- తక్కువ వర్షపాతంతో రైతులకు నష్టం జరగకుండా చూడాలి
- సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎల్ నినో నేపథ్యంలో పంట సాగు చేయని రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం బైపాస్‌రోడ్డులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో షేక్ షాహిన్ అధ్యక్షతన ఖమ్మంరూరల్ మండల సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ...తక్కువ వర్షపాతం నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడం వల్ల పంటల సాగుకు ఆటంకాలు ఏర్పడే పరిస్థితుల్లో రైతు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన సహాయక చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటల సాగు చేసిన రైతులకు వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టం వాటిల్లితే పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని, సాగుకు అనుకూల పరిస్థితులు లేక పంటలు వేయలేని రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులకు అండగా నిలిచేలా రైతు భరోసా పథకం ద్వారా సాయం అందించానలి పేర్కొన్నారు. మరోవైపు, ఎల్ నినో ప్రభావంతో తాగు నీటి సమస్యలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మంచి నీటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి సరఫరాపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, పగీళ్ల వీరభద్రం, మామిండల్ల శ్రీనాథ్‌రెడ్డి, బూర నాగేశ్వరరావు, వెంపటి సురేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు రాచబాట.. కార్మికులకు హక్కుల కోత

- కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి :
- ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ :** కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక లోకం ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి ముందుండి పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. శనివారం నల్లగొండలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను సమూలంగా మార్చివేస్తూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్మికుల హక్కులను హరిస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లకు విఘాతం కలిగించే విధానాలను అవలంభిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందన్నారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని ఓట్ల తొలగింపునకు పాల్పడటం సమంజసం కాదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.

### కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలి : నరసింహ

44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా సమ్మె చేసే హక్కు, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, పోరాటాలు నిర్వహించే హక్కులను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 31న ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక సంఘాల జెండాలు ఎగురవేసి, సభలు, సమావేశాలు నిర్వహించాలని ఎం.నరసింహ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎన్. రామస్వామి అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్. రెడ్డి, జిల్లా నాయకులు దొటి వెంకన్న,నూనె వెంకటేశ్వర్లు,బరిగెల వెంకటేష్,ఎం.డి జానీ,డి.వెంకటేశ్వర్లు, బంటు రాజేశ్వరి, వి.లెనిన్, బెల్లం శివయ్య, కోట్ల శోభ, వి. రమాదేవి, సరిత, జయమ్మ, రమణ, షమీం, ఎం.నందం, బి.వెంకటయ్య,గుండె రవి, ఆర్. యాదయ్య, నరేందర్,నాగార్జున,బి.లింగం, జవహర్‌లాల్, వెంకట్రాములు,మల్లయ్య, అమీర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## నీటి వృథా అరికట్టేందుకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టాలి

సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ఏసురత్నం

**ప్రజాపక్షం/కత్బుల్లాపూర్(మేడ్చల్) :** ఎలి నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్ద డి ఏర్పడే అవకాశం ఉన్నందున నీటి వృథాను అరికట్టేందుకు వాటర్ వర్క్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చింతల్ సర్కిల్ వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్‌కు సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకుడు ఏసురత్నం మాట్లాడుతూ బస్తీల్లో మంచినీటి సరఫరా సమయంలో అధికారులు పర్యటించి నీటిని వృథా చేస్తున్న వారిని గుర్తించాలని కోరారు. అవసరమైతే జరిమానాలు విధించి, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే నీటి పొదుపుపై ప్రజలకు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో అధికారులు కూడా ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అన్నారు. అక్రమంగా నిర్వహిస్తు న్న వాటర్ ప్లాంట్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. గిరినగర్, జగద్గిరిగుట్ట పరిధిలోని పలు బస్తీల్లో నీరు వృథాగా పోతున్న ప్రాంతాల వివరాలను అధికారులకు అందజేశారు. వారం రోజుల్లోగా తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి, శాఖ కార్యదర్శి వెంకటేష్, యాకూబ్, సిపిఐ నాయకులు ఇమామ్, యాదన్న, సాగర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారధి



**ప్రజాపక్షం/తొర్రూరు :** ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు పంట పొలాలకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి డిమాండ్ చేశారు. శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. రాష్ట్రంలో సగటు వర్షపాతం కన్నా 24శాతం తక్కువగా నమోదైందని ప్రభుత్వాలు చెబుతున్నాయని, వచ్చే జూలై వరకు ఈ తొమ్మిది, పది నెలల్లో సూపర్ ఎల్ నినో ప్రభావం తీవ్రత ఎక్కువ అవుతుందని ప్రభుత్వం వెల్లడిస్తుందన్నారు. దీంతో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడి తాగునీరు కొరత కూడా ఏర్పడుతుందనే ఉద్దేశ్యంతో సాగుబడి చేయొద్దని సిఎం రేవంత్‌రెడ్డి ఇటీవల బహిరంగ సమావేశంలో చెబుతున్నారన్నారు. పంటలు వేసిన రైతులకు ఈ 15 రోజులు కీలక దశ అని అన్నారు. ఈ సమయంలో సాగునీరు లేక, నిరంతరం విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం స్పందించి కనీసం తొమ్మిది గంటల విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 320 మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తించి కేంద్రానికి నివేదిక ఇచ్చారని, కేంద్రం తీసుకునే చర్యల కోసం వేచి చూడకుండా వరి పంటలు వేసిన వారికి ఎకరానికి రూ.30వేలు, మిర్చి పంటలతో పాటు తదితర పంటలకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పేద ప్రజలను ఆదుకోవడానికి సన్న బియ్యంతో పాటు ఇతర 14 రకాల నిత్యావసర వస్తువులను అందజేయాలని డిమాండ్ చేశారు. సిఇసి జ్ఞానేశ్వర్‌ని పదవి నుండి తప్పించాలన్న విషయమై నెలల తరబడి జరుగుతున్న ఉద్యమాలను ఇండియా కూటమి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నవంబర్‌లో ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సర్ ప్రక్రియను రద్దు చేయాలని బ్యాలెట్ పద్ధతిలో ఓట్లు వేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, ఇయు డిపో కార్యదర్శి ఎం. కృష్ణారావు, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్‌కుమార్, తెలంగాణ రైతు సంఘం మండల కార్యద ర్శి కోటగిరి యాకాంతం, శాఖ కార్యదర్శి బూరు గు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజుల పని

రోజుకు రూ.700 వేతనం : బికెఎంయు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. విబి–జి రామ్‌జీ బిల్లును రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరింది. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావడంతో పాటు, 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్‌లో బికెఎంయు రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనరసింహ, బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకటరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు, మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులకు నెలకు రూ.4,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సక్రమంగా చెల్లించాలని, గ్రామసభల ద్వారా అర్హులైన పేదలను ఎంపిక చేసి ఇళ్లు కేటాయించాలని కోరారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని ప్రకటించారు. సమావేశంలో కె.సుజనకుమార్, బుద్ధుల జంగయ్య, ఎ.బాబు, సి.హెచ్. వెంకన్న, బి.నరసింహ, రేసు ఎల్లయ్య, పూర్ణ, అబ్రహం, బి.అశోక్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ త్యాగాలు మరువలేనివి

### కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు పోలీస్ ఫ్లాగేడే సందర్భంగా కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పోలీసులు విధులు, కేసుల నమోదు, దర్యాప్తు, నేరాల నియంత్రణ నేరస్తుల గుర్తింపు విధానాలను వివరించారు. కమ్యూనికేషన్ పరికరాలు, ఫింగర్ ప్రింట్ వ్యవస్థ, సిసిటివి ఫుటేజీ విశ్లేషణ, క్లూస్ టీమ్ పనితీరును ప్రత్యక్షంగా చూపించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. రాత్రి గస్తి, పెట్రోలింగ్, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, రూరల్ ఎస్ఐ యాకుబ్, ఎస్ఐ లు ఉపేందర్‌రెడ్డి, మల్సూర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యపై అనుమానంతో భర్త ఘాతుకం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యను భర్త కత్తితో హత మార్చిన దారుణ ఘటన మండలంలోని శివన్న గూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన సుంకరి ఇంద్రయ్య తన భార్య రజిత (37)ను శనివారం ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర కలకలం రేగింది.సుంకరి ఇంద్రయ్య, రజిత దంపతులకు ముగ్గురు సంతానం. రెండేళ్ల క్రితం వారి కుమారుడు పురుగుల మందు తాగి వ్యవసాయ బావి సమీపంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.శివన్నగూడెం రిజర్వాయర్ ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం నుంచి వలస వచ్చిన ఈ కుటుంబం ప్రస్తుతం శివన్న గూడెంలో నివాసం ఉంటోంది.భార్యాభర్తల మధ్య గతంలోనూ ఘర్షణలు జరిగినట్లు తెలిసింది. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న ఇంద్రయ్యే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే హత్యకు గల పూర్తి కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.ఘటనపై సమాచారం అందుకున్న నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దూది రాజు, ఎస్ఐ బి.రాంబాబు సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైతన్నలకు అండగా ప్రభుత్వం



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్))** : రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ ఉంచుకునేందుకు ప్రజా ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపడుతూ రైతున్నలకు అండగా నిలుస్తోందని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. మండల రైతులకు ఉపయోగపడేలా భారీ సామర్థ్యంతో గోదాము నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. రైతులు పండించిన ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు సరైన వసతులు లేక రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిల్వ సదుపాయాలను విస్తరిస్తున్నట్లు వివరించారు. గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేసి ఆరు నెలల్లో నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతు భాస్కర్, మొరిశెట్టి లక్షాది, ఆత్మకూర్(ఎస్) మండల పార్టీ అధ్యక్షులు ముస్కు రామచంద్రా రెడ్డి, సూర్యాపేట మండల అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, చివ్వెంల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, దండి రమేష్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

## సాగర్ ఎడమ కాల్వలో మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ఉప్పు నగేష్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని జగ్గయ్య తండా శివారు ప్రాంతంలో ప్రవహిస్తున్న సాగర్ ఎడమ కాల్వలో ఒకరి మృతదేహం కొట్టుకువస్తున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తక్షణమే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. అనంతరం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసుల విచారణలో మృతుడు మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంట ప్రాంతానికి చెందిన ఆలేటి వీరబాబు (48)గా నిర్ధారణ అయింది.మృతుడి వివరాలపై కుటుంబ సభ్యులను విచారించగా అతడు గత కొంతకాలంగా తీవ్రమైన వెరికోస్ వెయిన్స్ సమస్యతో పాటు చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలిసింది. సుమారు 6 ఏళ్ల క్రితం వెరికోస్ వెయిన్స్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ తిరిగి అదే సమస్య తిరగబెట్టడంతో తీవ్ర అనారోగ్య బాధలు అనుభవిస్తూ మనస్తాపానికి గురయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిత్యం పని నిమిత్తం బయటకు వెళ్లే వీరబాబు ఉదయం 9 గంటల సమయంలో సింధు సెలూన్‌కు వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆ తర్వాత కాల్వలో శవమై తేలాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# తాగునీటి సమస్య రాకుండా చర్యలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్))** : వర్షాభావ పరిస్థితుల నేధ్యంలో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు స్థానిక నీటి వనరులను గుర్తించి, వార్డు వారీగా తాగునీటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వారం రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసి, గ్రామసభలో ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని మిద్దనపల్లి గ్రామంలో నిర్వహించిన సమీక్షలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో తాగునీరు, ఉపాధి హామీ పనులు, భూగర్భ జలాల పెంపు తదితర అంశాలపై చర్చించారు. గ్రామంలో ప్రస్తుతం మూడు బోర్లు అందుబాటులో ఉన్నాయని, వాటి ద్వారా నీటి సరఫరా జరుగుతోందని అధికారులు వివరించారు. అయితే భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాదం ఉందన్నారు. బోర్ల నుంచి నేరుగా పైపులైన్లకు నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో అవసరమైన శుద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. మిషన్ భగీరథ సరఫరా పరిస్థితిని పరిశీలించి, నీటి వనరుల లభ్యతను అంచనా వేయాలన్నారు. ప్రధాన నీటి వనరు పనిచేయకపోతే ప్రత్యామ్నాయంగా ఎక్కడి నుంచి నీటిని సరఫరా చేయవచ్చో ముందుగానే గుర్తించాలని తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారం, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఉపాధి కల్పన, పారిశుద్ధ్య మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిఆర్‌డిఓ సన్యాసయ్య, డిఏఓ శ్రీధర్ రెడ్డి, తహశీల్దార్ అనిల్ సింగ్, ఎంపిడిఓ సత్యనారాయణ రెడ్డి, వైద్యాధికారి రమ్య, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ ప్రతినిధులు, ఏపిఓ, ఏపిఎం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు అందించాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఆత్మకూర్(ఎస్) మండలం మిద్దనపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి, వారి సందేహాలను ఎంతో ఓపిగ్గా నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం వంట గదిని, మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు.

# ఆక్రమణల తొలగింపు

### కోదాడలో ఓ ప్రముఖ వస్త్ర దుకాణం ముందు ఫుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన లగేజీ రూమ్ తొలగింపు

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, ఫుట్‌పాత్‌ల అక్రమణలపై 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురితమైన కథనం ప్రభావం చూపింది. కోదాడ ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఇటీవల ఓ సినీతారతో ప్రారంభించిన ప్రముఖ కార్పోరేట్ వస్త్ర దుకాణం వద్ద పుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన లగేజీ రూమ్‌ను తొలగించారు. దీంతో పాదచారులకు కొంతమేర మార్గం సుగుమైంది. కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారిపై రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు వాహనాదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై వాహనాల నిలుపుదలతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పుట్‌పాత్‌లు పాదచారుల కోసం ఉన్నప్పటికీ వాటిపై వివిధ వస్తువులు, ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ సమస్యలపై ప్రజాపక్షం దినపత్రికలో కోదాడలో ట్రాఫిక్ నరకం శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించినట్లు తాజా పరిణామం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ వైద్యశాల ఎదుటి వస్త్ర దుకాణం వద్ద పుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన లగేజీ రూమ్‌ను తొలగించడం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని ప్రధాన రహదారులు, పుట్‌పాత్‌లపై ఉన్న అక్రమణలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణకు అధికారులు చర్యలు కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# విస్తృతంగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ

### సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి
### ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయం (ఇందిరా భవన్)లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ గుమ్మల మోహన్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ, అర్హతలు, అవసరమైన పత్రాలు,థదరఖాస్తు విధానంపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామ, పట్టణ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు బాధ్యతలు తీసుకుని ఓటరు నమోదును ముందుకు తీసుకెళ్లాలన్నారు.నవంబర్ 6 వరకు ఓటరు నమోదు గడువు ఉందని, అర్హులైన పట్టభద్రులు ఎవరూ దూరం కాకుండా చూడాలన్నారు. యువత,నిరుద్యోగ పట్టభద్రులతో మమేకమై ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాలని కోరారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఈ ఎమ్మెల్సీ ఎన్నిక 34 నియోజకవర్గాల పరిధిలో జరుగుతుందని, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదులో కాంగ్రెస్ శ్రేణులు ముందుండాలని,మంత్రి కోమటిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ ఆమీర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల త్యాగాలు ప్రతీ విద్యార్థి, పౌరుడు గుర్తుంచుకోవాలి

### డిఎస్‌పి ప్రసన్న కుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : పోలీసుల త్యాగాలను ప్రతి విద్యార్థి, పౌరుడు గుర్తుంచుకోవాలని సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు శాఖ విధులు, కేసుల ధర్యాప్తు, నేరాల ఛేదన, నేరస్తులను గుర్తించే విధానాలు, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించడంతోపాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. నేరాలు జరిగినప్పుడు నేరస్థులను గుర్తించేందుకు పోలీసులు అనుసరించే దర్యాప్తు పద్ధతులు, సంఘటనా స్థలంలో ఆధారాల సేకరణ, క్లూస్‌టీమ్ విధులు, వేలిముద్రల సేకరణ, ఫింగర్‌ప్రింట్ పరికరాల ద్వారా పాత నేరస్తులను గుర్తించే విధానాలను అధికారులు విద్యార్థులకు వివరించారు. పోలీసు శాఖలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వివిధ విభాగాల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఫింగర్ ప్రింట్స్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, బరోసా ఎస్ఐ మౌనిక, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, షీ టీం, భరోసా టీం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా కేసుల దర్యాప్తు

### సూర్యాపేట ఎస్‌పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట** : కేసుల దర్యాప్తులో ప్రణాళిక బద్ధంగా, శాస్త్రీయంగా, చట్ట నిబంధనలకు అనుగుణంగా పని చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధించడం, తద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించడంతోపాటు కేసులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ తెలిపారు. కేసులు నమోదు, ధర్యాప్తు, సకాలంలో నేర అభియోగ పత్రాల దాఖలు, సకాలంలో ధర్యాప్తు, వాంగ్మూలం నమోదు, ఈ సాక్ష సద్వినియోగం, ఈసమన్స్ పంపించడం, ఆధారాల సేకరణ, జైలు శిక్షలు, కోర్టుల సమన్వయం, నాట్‌గ్రిడ్ యాప్ వినియోగం, సైబర్ మోసాల్లో నగదు రికవరీ, రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు సేవలు మొదలగు అంశాలపై జిల్లా పోలీస్ కార్యాలయం నందు పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫోక్సో కేసుల ధర్యాప్తులో అనుసరించాల్సిన ప్రణాళిక, లీగల్ సహాయం, కోర్టు వ్యవహారాలు, వాంగ్మూలం సేకరణ, సాక్ష్యాధారాల నమోదు మొదలగు అంశాలపై ఫోక్సో కోర్టు పిపి రఘురామయ్య అధికారులకు అవగాహన కల్పించారు. కేసుల నమోదు నుంచి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయడం వరకు ప్రతి దశలోనూ అధికారులు, సిబ్బంది నిర్ధిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. దర్యాప్తు ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, నిర్దేశిత కాలపరిమితులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, డిఎస్‌పిలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఫోక్సో కోర్టు పిపి రఘురామయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దూమ్ అలీ, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సిఐలు రాజశేఖర్, నాగేశ్వరరావు, ఉపేందర్ రావు, శివశంకర్, రామకృష్ణారెడ్డి, వెంకటయ్య, చరమందరాజు, ప్రతాప్‌లింగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎస్ఐ సాయిరాం, డిసిఆర్‌బి ఎస్ఐ ఝాన్సీ, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది, స్టేషన్ సెక్షన్ ఆఫీసర్స్, పోలీస్ స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## డీఫాల్ట్ రైస్ మిల్లర్లు 45 రోజుల్లోపు ప్రభుత్వానికి సిఎంఆర్ బియ్యం చెల్లించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : డిఫాల్ట్ మిల్లర్లు బాకీ పడిన సిఎంఆర్ బియ్యాన్ని 45 రోజుల్లోపు ప్రభుత్వానికి చెల్లించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. బియ్యాన్ని సన్న బియ్యం రూపంలో లేదా దానికి సరిపడా ధరను 25శాతం ఫెనాల్టీ, 12శాతం వడ్డీతో కలిపి చెల్లించాలన్నారు. శనివారం డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో కలెక్టరేట్ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన 45 రోజుల గడువును సద్వినియోగం చేసుకుని బాకీ ఉన్న సిఎంఆర్ బియ్యాన్ని అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. గడువులోపు చెల్లించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్, 1864 ప్రకారం వారి ఆస్తులను జప్తు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందం బకాయిలు చెల్లించని మిల్లులను ఇప్పటికే సందర్శిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ టాస్క్ ఫోర్స్ ఓఎస్‌డి ప్రభాకర్, అడిషనల్ కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వి. మోహన్ బాబు, డిప్యూటి తహశీల్దార్లు, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



## పోచంపల్లి టూరిజం అభివృద్ధికి కలెక్టర్ అనురాగ్ జయంతి కృషి అద్భుతం

### కమ్యూనైట్ స్టార్టప్ క్లబ్ యువ బృందం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి టూరిజం అభివృద్ధికి చేనేత పరిశ్రమ,కార్మికుల నైపుణ్యంతో నేసిన వస్త్రాల మార్కెటింగ్ ప్రమోటింగ్ కోసం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేస్తున్న కృషి వండర్ అని హైదరాబాద్ లోని కమ్యూనైట్ స్టార్టప్ క్లబ్ యువ బృందం కొనియాడింది. పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ వరల్డ్ వైడ్ గా విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా కలెక్టర్ చేనేత వస్త్ర ఉత్పత్తుల గురించి పర్యాటకులకు వివరించేందేందుకు గౌడ్స్ ట్రైనింగ్ ఇచ్చి మాకు కెటాయించిపైలెట్ ప్రాజెక్ట్ లో పోచంపల్లిని విజిట్ చేయమని సూచించటంతో శనివారం ఈ ప్రాంతాన్ని సందర్శించినట్లు చెప్పారు. చరిత్ర ,చారిత్రాత్మక ప్రదేశాల విశిష్టత,భౌగోళికంగా ఉన్న ప్రాశస్త్యం,ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపుల పట్ల ఆసక్తి ఉన్న ఔత్సాహికులు తమ క్లబ్‌లో చేరి క్షేత్ర పర్యటన చేస్తారని ఆయా ప్రాంత ప్రాముఖ్యతలు తెలుసుకొని కొత్త అనిభూతికి లోనయ్యి అధ్యయనాలు చేసి సోషల్ మీడియా ద్వారా ప్రమోటింగ్ చేస్తామని వివరించారు.30మంది బృందం కలిసి ఇక్కడి చేనేత వస్త్రాల తయారి కార్మికుల శ్రమ నైపుణ్యం ఎంతో బాగున్నాయని ప్రశంసించారు.జిల్లా చేనేత,జౌళి శాఖా సహాయ సంచాలకులు ఎ.శ్రీనివాస్ రావు వారి వెంట ఉండి టూరిజం పార్కు, చేనేత సహకార సంఘం, మిని ట్యాంక్ బండ్,వెదిరే రామచంద్రారెడ్డి స్మారక చిహ్నం వినోబా మందిరం లను చూపించారు.భూదానోద్యమ చరిత్రను బృందానికి వివరించారు.ఎక్స్‌ఫ్లోర్ టూర్ లో పూర్వి,ప్రజ్వల మెంటార్‌లుగా ఉన్నారు.

## పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ అండ : ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన, 1994లో అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నక్సలైట్ల దాడిలో అమరులైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పట్టణం లోని వారి నివాసంలో పరామర్శించారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు. జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో 15 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితంగానే నేడు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.అమరవీరుల కుటుంబ సభ్యులు ఏ సమస్య ఎదుర్కొన్నా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, నల్లగొండ డీఎస్‌పి శివరాం రెడ్డి, ఎబి సీఐ నాగరాజు,టూ టౌన్ సీఐ ఆదిరెడ్డి,అడ్మిన్ ఆర్ఐ సంతోష్, టౌన్ ఎస్ఐ సైదా బాబు, అమరవీరుడు ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు అత్యంత కీలకం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జాహ్నవి టౌన్‌షిప్‌లో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడుతుందని ఈ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులపై దుర్భాష : వ్యక్తి అరెస్టు



**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల** : గట్టుప్పల పోలీస్ స్టేషన్‌కు వచ్చి డ్యూటీలో ఉన్న పోలీసులపై గట్టుప్పలకు చెందిన ఖమ్మం ప్రభాకర్ దుర్భాషలాడి , వారి విధులకు ఆటంకం కలిగించిచాడని ఇట్టి విషయంపై హెచ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంపత్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి శనివారం నల్లగొండ కోర్టులో హాజరు పరచగా జడ్జి అతనికి 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించి జైలుకు పంపడం జరిగిందని తెలిపారు.

## పంచాయతీ ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేయాలి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** గ్రామ పంచాయతీలలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, పిఆర్‌సిలో గుర్తింపు కల్పించడంతోపాటు నెలకు రూ.30వేల కనీస వేతనం అందించాలని పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బచ్చన్నపేట ఎంపిడిఒ లావణ్య, ఎంపిఒ కృష్ణ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కొమురెల్లి శ్రీనివాస్, కాళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. తక్కువ వేతనాలతో గ్రామాలలో నిరంతరం సేవలందిస్తున్న పంచాయతీ కార్మికులకు తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. ఈ నెల 26న నిర్వహించనున్న ఛలో హైధరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అన్ని గ్రామాల పంచాయతీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కారోబార్లు కొండ లలిత, శ్యామల, శ్రీనివాస్, ముక్క నాగయ్య, చంద్రశేఖర్, సురేష్, బాబు గౌడ్, రాజు, రాజిరెడ్డి, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్రిమినల్ చట్టాలపై సాయుధ దళాల సిబ్బందికి శిక్షణ



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** తెలంగాణ రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ సూచన మేరకు, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సాయుధ బలగాల సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాల పట్ల అవగాహన కల్పించుటకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ కార్యాచరణ చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సాయుధ బలగాల విభాగంలో కానిస్టేబుల్ నుండి కమాండెంట్ వరకు గల మొత్తం 971 సిబ్బందిని 20 బ్యాచ్‌లు గా విభజించి, రోజుకు ఒక బ్యాచ్ చొప్పున మడికొండలోని కమిషనరేట్ పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇచ్చుటకు ప్రణాళికా రూపొందించారు. అందులో భాగంగా శనివారం మొదటి బ్యాచ్‌కి పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్, ఎసిపి రమణబాబు పర్యవేక్షణలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందికి నూతన చట్టాల పైన అవగాహన, ఎఫ్ఐఆర్ నమోదు, అరెస్టు సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నేర స్థలంలో సాక్షాదారాల సేకరణ, ధర్నాల నిర్వహణ, ముందస్తు అరెస్టులు, నేరాల విభజన, మహిళలపై జరిగే నేరాలు, టెర్రరిస్టు చట్టాలు, సైబర్ నేరాలు, నేర విచారణలో పోలీసులకు ఉన్న అధికారాలు మొదలగు అంశాల పట్ల శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లా శిక్షకులు ఇన్స్పెక్టర్ సూర్యప్రకాశ్, సహాయక లా శిక్షకులు సబ్‌ఇన్స్పెక్టర్‌లు విజయ్, దేవేందర్, ఆర్ఐ ఉదయబాస్కర్, ఆర్ ఎస్ఐ రమేష్, శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: సిఐ సతీష్



**ప్రజాపక్షం/టేకుమట్ల:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటమే వాటిని అరికట్టేందుకు ప్రధాన ఆయుధమని సిఐవై సతీష్, ఎస్ఐ అమూల్యలు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మండలం అంకుషాపూర్ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద శనివారం సైబర్ నేరాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు, యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా ఉన్నాయని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకొని మహిళలను, యువకులను మోసం చేస్తున్నారని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి బారినపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మైనర్లు వాహనాలు నడపరాదని, రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట సునీత సాగర్, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లు, రెస్టారెంట్లకు రూ.5 వేల జరిమానా



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత పరిశుభ్రత, ట్రేడ్ లైసెన్సులపై మున్సిపల్ కమిషనర్ జె సంపత్, శానిటరీ ఇన్స్పెక్టర్ టి ఉదయ్ కిరణ్ తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన శ్రీ ఆధ్య రెస్టారెంట్, అరేబియన్ మండీ యజమానులకు రూ.5వేల జరిమానా విధించారు. తనిఖీల్లో ఆహార పదార్థాల నాణ్యత, వంటగది పరిశుభ్రత, పరిసరాల పారిశుధ్యం, చెత్త నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం హోటళ్లు, రెస్టారెంట్ల యజమానుల బాధ్యతని కమిషనర్ తెలిపారు. లైసెన్సులు లేని వ్యాపారులు వెంటనే వాటిని పొందాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పుష్కర అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం క్షేత్రంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం క్షేత్రంలో శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పర్యటించిన కమిషనర్ హనుమంతరావు దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేపట్టిన అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులు కమిషనర్ క్షేత్ర స్థాయిలో ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని నిర్మాణ పనులు సమాంతరంగా చేపట్టి, అవసరమైనంత మంది కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఆలయ పునర్నిర్మాణాన్ని రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి మార్పులు, వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించాలని, గోనె సంచులు, వరిగడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం పర్యటనకు రానున్న నేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలని, నిర్మాణాలు స్పష్టమైన రూపు సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. తాగునీరు, రహదారులు, పార్కింగ్, విఐపి ఘాట్లు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలన్నారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాచ్ టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరఘాట్లకు ఇరువైపులా ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని, గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరించే భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని బండ్ల గూడెం గ్రామంలోని గల మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం సందర్శించారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు పురుగుల మందులు ఉండేలా చూడాలని సేవా కేంద్రం నిర్వాహకులు చిర్ర కిరణ్ కుమార్ రెడ్డికి సూచించారు. మహిళా శక్తి రైతు సేవ కేంద్రం నిర్వాహకులు ఇప్పటివరకు సుమారు 60 టన్నుల యూరియాతోపాటు ఇతర వ్యవసాయ ఉత్పాదకాలను విక్రయించాలని సుమారు 19 లక్షల వ్యాపార లావాదేవీలను నిర్వహించినట్లు కలెక్టర్‌కు వివరించారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు పురుగుల మందులు సకాలంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు: ఎస్‌పి



**ప్రజాపక్షం/రేగొండ:** పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును వేగవంతం చేయాలని భూపాలపల్లి జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కొత్తపల్లిగోరి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రత, రికార్డులు, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణను పరిశీలించారు. సిసిటివి కెమెరాల పనితీరును సమీక్షించి, నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలిసింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికట్టడంతో పాటు రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. సిసిటిఎన్ఎస్ 2.0 ఈ సాక్ష్య, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు వంటి ఆధునిక సాంకేతిక విధానాలపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో భూపాలపల్లి సబ్ డివిజన్ డిఎస్‌పి సంపత్‌రావు, గణపురం సిఐ కరుణాకర్‌రావు, ఎస్ఐ త్రిలోక్‌నాథ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

పిఎం రాహత్ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలి



**ప్రజాపక్షం/ములుగు:** రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో సత్వర వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. పిఎం రాహత్ పథకం కింద అర్హులకు రూ.1.50లక్షల వరకు ఉచిత చికిత్స అందించనున్నట్లు తెలిపారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌తో కలిసి జిల్లా కలెక్టర్లతో పథకం అమలుపై సమీక్షించారు. ములుగు కలెక్టరేట్ నుండి కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్‌పి కేకన్ సుధీర్ రామ్‌నాథ్ పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు పథకంలో నమోదు కావాలని, ప్రతి ప్రమాద కేసును ఈ డిఎఆర్ పోర్టల్‌లో నమోదు చేసి వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సిఎస్ సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. పథకాన్ని సమర్థంగా అమలు చేయడం ద్వారా ఏటా రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులు ఆదా అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ప్రమాద కేసును పిఎం రాహత్ పథకం కింద నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ ఆసుపత్రులను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో అనుసంధానించి, అర్హులైన బాధితులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి గోపాలరావు, ఆర్అండ్‌బి ఈఈ, జిల్లా రవాణా అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే మొదటి దశ పనులు వేగవంతం

సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్



**ప్రజాపక్షం/జనగామ :** భూ రీసర్వే మొదటి దశ పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలన్నారు. భూ రీసర్వే పనుల పురోగతిపై సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ కమీషనర్ లోకేష్‌కుమార్ మాట్లాడుతూ భూ రీసర్వే మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్వే పనులకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకొని క్షేత్రస్థాయిలో ఎదురవుతన్న సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కరిచాలన్నారు. భూ రీసర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, యంత్ర పరకరాలను సమకూర్చుకొని నిర్ణీత లక్ష్యాలను సాధించాలన్నారు. మొదటి దశలో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుంటు పనుల పురోగతికి అనుగునంగా అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజు చేపట్టిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను సమక్షించాని, సర్వే పనుల్లో వెనుకబడిన గ్రామాలను గుర్తించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వాహణకు ఆటంకాలు ఏర్పడకుండా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన చోట సంబంధిత భూ యజమానులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. భూ రీసర్వే ప్రక్రియ ద్వారా భూములకు సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు చేసేందుకు భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించేందుకు అవసరమైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యాల వారిగా త్వరగా పూర్తి చేయాలని, భూ రీసర్వే వేగవంతం చేయడం కోసం సాంకేతికను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్స్ ఏడి మన్యంకొండ, డీ సెక్షన సూపరిండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బాధిత ఎస్‌సి, ఎస్‌టిలకు పరిహారం త్వరగా అందించేలా చర్యలు

అదనపు కలెక్టర్ ఎన్. రవి



**ప్రజాపక్షం/హనుమకొండ:** బాధిత ఎస్‌సి, ఎస్‌టిలకు పరిహారం త్వరగా అందించేవిధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసులు, భూ సమస్యలు, బాధితులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలతో రూపొందించిన ఎజెండా అంశాలపై మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్‌డిఒలు, పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో తీర్మానించిన ప్రతిపాదనలను సంబంధిత ప్రభుత్వ శాఖలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్‌డేను నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు, పుట్ట రవి, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, రడపాక పరంజ్యోతి, నూనవత్ జవహర్ లాల్, ఎస్‌సి వెల్ఫేర్ డిడి నిర్మల, హనుమకొండ, వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఏసిపిలు నరసింహారావు, సతీష్ బాబు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## డ్రోన్‌ల వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనకరం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనకరం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి నియోజ కవర్గంలోని మొగుళ్లపల్లి మండల రైతు వేదికలో సీఎస్ఆర్ నిధులతో అందజేసిన వ్యవసాయ డ్రోన్ పరికరాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగం ద్వారా తక్కువ సమయంలో, తక్కువ నీటితో పంటలకు మందు లు, ఎరువులను సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చని తెలిపారు. అలాగే రైతులు నేరుగా పురుగు మందులతో సంబంధం లేకుండా పిచికారీ చేసుకునే అవకాశం ఉండటంతో ఆరోగ్యపరమైన ఇబ్బందులను కూడా తగ్గించవచ్చని చెప్పారు. ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో విస్తృతంగా వినియోగించుకోవడం ద్వారా రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి, పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్లు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జనగామ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విప్లవం



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ పట్టణాన్ని స్వచ్ఛ, సుందర, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో జనగామ మున్సిపాలిటీ మరో కీలక ముందడుగు వేసింది. పట్టణ పరిధిలోని డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆధునిక డ్రై అండ్ వెట్ వేస్ట్ సెగ్రిగేషన్ మెషిన్ (తడి, పొడి చెత్తను వేర్వేరు చేసే యంత్రం) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మహత్తర కార్యక్రమానికి సంబంధించి శనివారం జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా భూమి పూజ నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జనగామ మున్సిపాలిటీ అభివృద్ధిలో పారిశుధ్యానికి మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పట్టణ ప్రజలందరు కూడా బాధ్యతగా వ్యవహరించి, ఇంటి వద్ద నుండే తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని అపుడే స్వచ్ఛ జనగామ కల సాకారమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్, శానిటేషన్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షల ఫీజు గడువు నవంబర్ 16

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మార్చి–2027లో నిర్వహించనున్న ఎస్ఎస్‌సి, ఓఎస్ఎస్‌సి, వృత్తి విద్యా పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్షల ఫీజు చెల్లింపు గడువులను ప్రకటించినట్లు ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల ఫీజు చెల్లింపు గడువులపై అవగాహన కల్పించి, నిర్ణీత తేదీలలోగా ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల ఫీజు చెల్లింపు గడువులు ఆలస్య రుసుము లేకుండా అక్టోబర్ 30 నుండి నవంబర్16 వరకు. ప్రధానోపాధ్యాయులు సైబర్ ట్రెజరీ ద్వారా ఫీజు చెల్లింపు నవంబర్ 04 నుండి 17 వరకు. విద్యార్థుల వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో సమర్పించాల్సిన చివరి తేదీ నవంబర్ 21గా ప్రకటించారు. పాఠశాల నామినల్ రోల్ డిజిఇ కార్యాలయానికి సమర్పించాల్సిన చివరి తేదీ డిసెంబర్10 వరకూ ఉన్నట్లు ఆయన తెలిపారు.

'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్ లోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో వెంకటేష్ మాట్లాడుతూ మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్‌లో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను.

రీల్

# నెగెటివిటి చూసి బాధనిపిస్తుంది

## 'బలగం'తో సూపర్ సక్సెస్ 'ప్రజాపక్షం'తో హీరో ప్రియదర్శి



తెలుగు తెరపై వెలిగిపోవాలంటే అంత సులభమేమి కాదు. అందులో తెలంగాణ నుంచి వచ్చిన నటీనటులు ఒక స్థాయికి చేరుకోవాలంటే మామూలు కష్టాలు ఉండవు. అవన్నీ దాటి రావాలంటే ఎంతో సహనం, ఓర్పు ఉండాలి. కష్టపడే మనస్తత్వం, కృషి, పట్టుదల అన్ని ఉన్న నటుడు ప్రియదర్శి. ఇటీవల రిలీజైన 'ప్యారడైజ్' సినిమాలో కెసిఆర్ పాత్రల్లో అచ్చు గుద్దినట్టు కనిపించడంతో ప్రియదర్శికి క్రేజ్ అలా పెరిగిపోయింది. ఇటు ప్రేక్షకుల్లోనూ అటు రాజకీయ నాయకుల్లోనూ ప్రియదర్శికి మంచి పేరు వచ్చింది. అంతకు ముందు 'బలగం' సినిమా ప్రియదర్శి కెరీర్‌ను మలుపు తిప్పిన సినిమాగా చెప్పుకోవచ్చు. నటుడిగా ఎన్ని గొప్ప సినిమాలు చేసిన ఆయన కెరీర్‌లో మొదట చెప్పుకునే గొప్ప సినిమా బలగం. తనదైన శైలిలో సినిమాలు చేస్తూ తెలుగు తెరపై దూసుకొస్తున్న ప్రియదర్శి 'ప్రజాపక్షం'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

**మీ కుటుంబ నేపథ్యం ఏంటి ?**

**ప్రియదర్శి:** నేను పుట్టి పెరిగింది హైదరాబాద్. కానీ మాతాత వాళ్ళది ఖమ్మం జిల్లా మధిర దగ్గర మర్లపాడు గ్రామం. నేను మాత్రం పూర్తిగా హైదరాబాద్. చిన్నప్పుడు సంతోష్ నగర్ దగ్గరలోని సైనిక్ స్కూల్‌లో చదువుకున్న . విజ్ఞాన్ స్కూల్, డిగ్రీ ఎంఎన్ఆర్ కాలేజి, తర్వాత ఎం.ఎ హెచ్‌సి యులో చదివిన. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మాస్ కమ్యూనికేషన్స్ లో పి. జి. చేసిన. మా నాన్న పులికొండ సుబ్బాచారి ప్రొఫెసర్, జానపద సాహిత్య రంగంలో పేరు పొందిన పరిశోధకుడు. ఉస్మానియా, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ద్రావిడ విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయాలలో పనిచేశారు. ప్రాచీన సాహిత్యం ఆధునిక సాహిత్యాలపై కూడా పరిశోధన చేశారు. తెలంగాణ జీవిత నేపథ్యంలో రెండు నవలలు రాశారు. మాదిగ కొలుపు' 'రేవు తిరగబడితే' అనే ఈ నవలలు పేరు తెచ్చాయి. కవిగా మూడు కవితా సంపుటాలు ప్రచురించారు. ఐదు దేశాలకు ఆహ్వానం పైన వెళ్ళి పరిశోధన పత్రాలు చదివారు.మా అమ్మ జయలక్ష్మి పది సంవత్సరాల పాటు ఉపాధ్యాయురాలుగా పనిచేసి తర్వాత వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకోని ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నారు. మా చెల్లెలు నావికాదళంలో లెఫ్టినెంట్ కమాండర్‌గా పని చేస్తోంది. నా భార్య రిచా నవలా రచయిత్రి. ఈమె స్వస్థలం ఆగ్రా దగ్గర బృందావనం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం .

**ప్రశ్న: ఇంట్లో పెద్ద సాహిత్యకారుణ్ణి పెట్టుకుని సాహిత్యం వైపునకు వెళ్లకుండా సినిమా యాక్టింగ్ వైపునకు ఎలా వచ్చారు?**

**ప్రియదర్శి:** నాకెందుకో చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే పిచ్చి. మా తాత పులికొండ పిచ్చయాచారి... ఆ కాలంలోనే పద్య నాటకాలలో పాత్రలు పోషించేవాడు. రజాకార్ వ్యతిరేక ఉద్యమం జరిగే అప్పుడు నాటక దళంలో పనిచేసి వందల నాటక ప్రదర్శనలు ఇచ్చిండు. నాకు మా తాత లక్షణాలే వచ్చాయంటారు మా ఇంట్లో.

**ప్రశ్న: షార్ట్ ఫిలిమ్స్‌లో కూడా చేసినట్టున్నారు?**

**ప్రియదర్శి:** 2016లో టెర్రర్ అనే సినిమాలో టెర్రరిస్టుగా నటించాడు. అదే సంవత్సరంలో వచ్చిన 'పెళ్ళి చూపులు' సినిమాలో హీరో స్నేహితుడు కౌశిక్ పాత్రలో నటించిన. తెలంగాణా యాసలో చెప్పే సంభాషణలు బాగా వర్క్ అవుట్ అయ్యాయి. జూనియర్ ఎన్.టి.ఆర్ కథానాయకుడుగా వచ్చిన జై లవకుశ, మహేష్ బాబు కథానాయకుడిగా వచ్చిన 'స్పైడర్' సినిమాలో కూడా నటించిన. ఆసుయంత్రాన్ని సృష్టించిన చింతకింది మల్లేశం జీవిత చిత్రం 'మల్లేశం' సినిమాలో కథానాయకుడిగా నటించాను.

**ప్రశ్న : 'బలగం' సినిమాని కెరీర్‌లో టర్నింగ్ పాయింట్ అనుకోవచ్చా?**

**ప్రియదర్శి:** 2016లో వచ్చిన 'పెళ్ళి చూపులు' సినిమా నాకు మంచి పేరు తెచ్చింది. 'అర్జున్ రెడ్డి', 'మల్లేశం', 'జాతిరత్నాలు', సినిమాలో నటించిన ఈ సినిమాల్లో కూడా నాకు మంచి పేరు వచ్చింది. 'బలగం' సినిమాలో దిల్ రాజు నన్ను హీరోగా పెట్టడం నా జీవితంలో టర్నింగ్ పాయింట్ అయింది. ఈ సినిమాతో నాకు మంచి మంచి సినిమాలు వచ్చాయి. '35 చిన్న కథ కాదు' అనే సినిమా కూడా నాకు చాలా మంది పేరు తెచ్చి పెట్టింది.

**ప్రశ్న: 'ఇడుపు కాయితం' మీద వచ్చిన నెగెటివ్ పబ్లిసిటీ చూసి ఏమనిపించింది?**

**ప్రియదర్శి:** హీరో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఇడుపు కాయితం' సినిమా పూజా కార్యక్రమాలు చేసి వచ్చినప్పుడు సోషల్ మీడియాలో నెగిటివ్‌గా చాలా మంది స్పందించారు. ఈ సినిమాకు సబ్ టైటిల్స్ వేస్తారా, తెలుగులో డబ్ చేస్తారా అని కామెంట్స్ చేశారు. ఆ టైమ్‌లో మేము తప్పు చేస్తున్నామా అని అనిపించిది. ఈ నెగిటివిటీ చూసి బాధకు లోనయ్యాం. కానీ మీడియా నుంచి ఇండస్ట్రీ నుంచి చాలా మంది మమ్మల్ని సపోర్ట్ చేస్తూ ముందుకొచ్చారు. వారి సపోర్ట్‌తో నెగిటివ్‌ను పాజిటివ్ చేసుకోవచ్చు అనే నమ్మకం కలిగింది. ఆ నమ్మకంతోనే ఈరోజు మీ అందరినీ మా గడపలోకి ఆహ్వానిస్తున్నాం. మా అమ్మ తన ఇంటి గడప దాటి మా ఇంటికి వచ్చింది, అలాగే నా సోదరి, నా భార్య..ఇలా మన ఇంటిలో గడప గురించి చాలా జ్ఞాపకాలు ఉంటాయి. అలాంటి గడపను సెలబ్రేట్ చేసే పాట ఉంది. మీరు నేటివిటీ గురించి ఆలోచించినా మావైపు ఒకసారి చూడండి. ఈ పాట వినండి. మీరు ఆ ప్రేమను ఫీల్ అవుతారు. డిసెంబర్ 11న మా సినిమాను రిలీజ్ చేస్తున్నాం. ఏ ప్రాంతమైనా భాషైనా మీకు మా సినిమా నచ్చుతుంది. సురేష్ బొబ్బిలి మ్యూజిక్ మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తుంది అన్నారు.



## నేను చదువుకుంది రాయలసీమలోనే.. విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహించారు. రశ్మిక మందన్న హీరోయిన్‌గా నటించారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మించారు. 'రణబాలి' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తూ బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ నేపథ్యంలో అనంతపురంలో 'రణబాలి' రణభేరి ఈవెంట్ గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ తెలుగు గడ్డ ఎంతో గొప్పది, అందమైనది, ఎంతో చరిత్ర ఉన్నది. రకరకాల పండుగలు, పద్ధతులు, యాసలు, మనుషులు ఉన్న నేల మనది. నేను పుట్టిన తెలంగాణలో ఒక ఆవేశం ఉంటుంది, తిరగబడే పోరాటం ఉంటుంది, ఫోక్ సాంగ్స్‌లో మజా ఉంటుంది. ఈ రాయలసీమ నాకు ఎంతో ఇచ్చింది. నేను చదువుకుంది ఇక్కడే. నేను ప్రయాణం చేసిన అనంతపురం, కర్నూలు, కడప లోనే మా సినిమా షూటింగ్ చేశాం. చిత్రీకరణ సమయంలో చదువుకున్నప్పటి జ్ఞాపకాలన్నీ గుర్తుకొచ్చేవి. రణబాలి సినిమాను ఒక నటుడిగా చేయలేదు. ఈ నేల కథను చెప్పాలనే బాధ్యతతో చేశాను. నాకు ఎంతో ప్రేమను పంచిన రాయలసీమ రుణం తీర్చుకోవాలనే కృతజ్ఞతతో రణబాలి సినిమా చేశాను. ఈ కార్యక్రమంలో కో ప్రొడ్యూసర్ అనురాగ్ పర్వతనేని, నటి ఈశ్వరీరావు, ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని, ప్రొడ్యూసర్ రవిశంకర్, హీరోయిన్ రశ్మిక మందన్న, డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ పాల్గొన్నారు.

## కాలేజీ అమ్మాయిలతో... విక్టరీ వెంకటేష్ డ్యాన్స్



'ఆదర్శ కుటుంబం' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కళాశాలలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో వెంకటేష్ మాట్లాడుతూ మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్‌లో ఈ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మీ అద్భుతమైన స్పందన చూసి ఆనందంగా ఉంది. కాలేజ్ లైఫ్‌లో నాకు ఎన్నో మెమోరీస్ ఉన్నాయి. ఆ రోజులు మళ్ళీ రావు. మీరు కూడా మంచి మెమోరీస్ ఉండేలా చూసుకోండి. మీ కలను నిజం చేసుకోండి. కాలేజ్ అంటే డిగ్రీ, జాబ్ మాత్రమే కాదు.. మంచి క్యారెక్టర్ తో బయటకు రావాలి. అక్టోబర్ 30న మా సినిమా విడుదలవుతోంది. మీ అందరూ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు.



## 'అక్క' ట్రైలర్ విడుదల

'అక్క' కథలో భవాని (కీర్తి సురేష్), రుద్ర (రాధికా ఆప్టే) ప్రధాన పాత్రలు. విభిన్నమైన ఆశయాలు, నమ్మకాలు కలిగిన ఈ ఇద్దరు శక్తివంతమైన మహిళల మధ్య ఏర్పడే పోరాటమే కథకు కేంద్ర బిందువు. వీరి మధ్య సంఘర్షణ అక్కడి వ్యవస్థను కుదిపేసే స్థాయికి చేరుకుంటుంది. అధికారం, విధేయత, కుటుంబం, ప్రతీకారం వంటి అంశాలను ఈ సిరీస్ లోతుగా ఆవిష్కరించనుంది. కీర్తి సురేష్, రాధికా ఆప్టేతో పాటు తన్వీ ఆజ్మీ, మహేష్ మంజ్రేకర్, అన్షుమన్ పుష్కర్, మోనికా పన్వార్ తదితరులు ఈ సిరీస్‌లో కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ అక్టోబర్ 30న నెట్‌ఫ్లిక్స్‌లో ప్రీమియర్ కానుంది. పెర్నూరు అనే రాజ్యం, అక్కడి శక్తివంతమైన వంశాల చుట్టూ ఈ కథ సాగుతుంది. తరతరాలుగా మహిళలే ముందుండి నడిపిస్తూ, తమ అధికారాన్ని, ఆధిపత్యాన్ని కాపాడుకుంటున్న ఈ రాజ్యంలో పైకి కనిపించే క్రమశిక్షణ, బలమైన వ్యవస్థ వెనుక అనేక ఉద్రిక్తతలు దాగి ఉన్నాయి. ఎప్పటినుంచో కొనసాగుతున్న వారసత్వాన్ని ఒక బయటి వ్యక్తి సవాలు చేయడంతో, విధేయతలు పరీక్షకు గురవుతాయి, ప్రత్యర్థిత్వాలు మరింత తీవ్రమవుతాయి, గతంలోని గాయాలు మళ్లీ బయటపడతాయి. దీంతో ఆ రాజ్యాన్ని నిలబెట్టిన సమతుల్యత క్రమంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. నెట్‌ఫ్లిక్స్ ఇండియా సిరీస్ హెడ్ తన్యా బామి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: ఆదిత్య చోప్రా, యోగేంద్ర మొగ్రే, అక్షయే విధాని.

## ఎపి-తెలంగాణాలో 'సీన్' రిలీజ్



హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలసి యాక్షన్‌కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య జాగరం స్టూడియోస్, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మేకర్స్ టైటిల్ టీజర్‌ను విడుదల చేసి సినిమాలోని క్విర్కీ, ఎంటర్‌టైనింగ్ ప్రపంచాన్ని పరిచయం చేశారు. ఫస్ట్ సింగిల్ 'అమ్మో ఇది ఎవర్రా'కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సెకండ్ సింగిల్ 'ఏరోప్లేన్' అదిరిపోయే ఎనర్జీతో ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్వీఆర్ సినిమా ద్వారా గ్రాండ్ రిలీజ్ కానుంది.ఈ చిత్రానికి వినీత్ అగస్టిన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సుశిన్ శ్యామ్ సంగీతం సమకూరుస్తున్నారు. అజ్మల్ సాబు ఎడిటింగ్, అశ్విని కాలే ప్రొడక్షన్ డిజైన్. సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది.

## జోర్డాన్ చర్చివద్ద ఉగ్రవాద కాల్పులకు భారత్ ఖండన

జోర్డాన్‌లోని కరక్ గవర్నరేట్‌పరిధిలో ఉన్న ఒక చర్చివద్ద అంత్యక్రియల సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపి ఏడుగురి ప్రాణాలు బలి తీసుకోవడాన్ని భారత విదేశీమంత్రిత్వ శాఖ నిర్ద్వంద్వంగా ఖండించింది. శుక్రవారం జరిగిన ఈ దాడిలో మరో 34 మంది గాయపడ్డారు.ఈ సంక్లిష్టసమయంలో మిత్రదేశ ప్రజలపై జరిగిన ఈ దాడికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం గట్టిగా వారిపక్షాన నిలబడుతుందని ఉద్ఘాటించింది. కరక్‌లోని హమౌద్ ప్రాంతలో అంత్యక్రియల సమయంలో ఉగ్రవాదులు ఆకస్మికంగా కాల్పులు జరిపారు.''మృతుల కుటుంబాలకు మేం హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నాం, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం,ఇది పిరికిపందలు చేసిన చర్య'' అని విదేశీమంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో విమర్శించింది.







## ఎల్ నినో ఎదుర్కొనేలా 8 నెలల..

# ''కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి''

మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో తలెత్తే నీటి ఎద్దడి, వ్యవసాయ రంగంలోని సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, శాశ్వత గ్రామీణ ఆస్తుల నిర్మాణానికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. విబిజి రామ్ జి పథకం కింద అనుమతించిన 370 రకాల పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించి, స్థానిక అవసరాలకు తగినట్లుగా దశలవారీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని పనులను ఒకేసారి ప్రారంభించకుండా, ఏడాది పొడవునా కూలీలకు ఉపాధి దక్కేలా ఎనిమిది నెలల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఎల్ నినో పరిస్థితులు, ఉపాధి హామీ పనుల పురోగతిపై శనివారం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, ఇఎన్‌సిలు కృపాకర్ రెడ్డి, జగదీశ్వర్ సహా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల డిఆర్‌డిఒలు, ఈఈలు, ఎంపిడిఎలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల వేగంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం మాటలు, సమాధానాలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో పురోగతి చూపించాలని స్పష్టం చేశారు. అర్హులైన వారికి జాబ్ కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తే ఎంపిడిఒలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 30 నాటికి మండలస్థాయి సమన్వయ కమిటీల ద్వారా పనుల ప్రణాళికలను ఆమోదించి, నవంబర్ 1 నుంచి పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గుర్తించిన పనుల్లో గ్రామాల తక్షణ అవసరాలకు తగినట్లుగా కనీసం 50 రకాల ముఖ్యమైన పనులను ఎంచుకొని లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి కొరత ముప్పు ఉన్నందున కాలువల మరమ్మతులు, చెరువులు, కుంటల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు పనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించారు. పాఠశాలల ప్రహరీ గోడలు, కమ్యూనిటీ హాళ్లు, పశువుల నీటి తొట్టెలు వంటి శాశ్వత ఆస్తుల నిర్మాణంతో పాటు వీలైనంత వరకు సౌర విద్యుత్ సంబంధిత పనులను కూడా చేర్చాలన్నారు. నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు రెండో పంటగా ఆరుతడి పంటలను వేసేలా అవగాహన కల్పించాలని, ఉపాధి క్యాలెండర్‌ను వ్యవసాయ సీజన్లకు అనుగుణంగా రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటిడిఎల పరిధికి కేటాయించిన 7 శాతం వర్క్ షేర్‌కు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలన్నారు. ఆదివాసీ గిరిజనులకు జాబ్ కార్డుల జారీలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామసభలు, సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమన్వయంతో పనుల నాణ్యతను పెంచి, గ్రామాభివృద్ధి, నీటి భద్రత, ఉపాధి కల్పన మూడింటినీ సాధించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.

## టిజిపిఎస్‌సి ఎఇఇ పరీక్ష వాయిదా వేయాలి

తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఇంజినీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయవద్దని, నవంబర్ 6న జరగనున్న టిజిపిఎస్‌సి ఎఇఇ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి హరీశ్ రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. ఎస్ఎస్‌సి జెఇ, టిజిపిఎస్‌ఇ ఎఇఇ పరీక్షలు ఒకే తేదీలో ఉండటంతో తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని వివరించారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఎస్‌సి జెఇ పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగొచ్చి ఎఇఇ పరీక్ష రాయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి అభ్యర్థులు ప్రస్తుతం రెండు పోటీ పరీక్షల్లో ఒకదాన్ని వదులుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు టిజి పిఎస్‌సిని విజ్ఞప్తి చేసినా స్పందించలేదన్నారు. పరీక్షల తేదీలను పునఃపరిశీలించాలని అక్టోబర్ 14వ తేదిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టిజిపిఎస్‌సికి లేఖ రాసిన విషయాన్ని హరీశ్‌రావు సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com